www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పశ్చిమాసియా ఉద్రిక్తం!

- ఇజ్రాయెల్‌పై దాడికి సిద్ధంగా ఇరాన్
- ఉగ్ర సంస్థ హిజ్బొల్లాకు పూర్తి మద్దతు
- ఇజ్రాయెల్‌కు అండగా రంగంలోకి అమెరికా
- యుద్ధ నౌక, జెట్లను పంపుతున్న అగ్రరాజ్యం
- భారత పౌరులను అప్రమత్తం చేసిన ఎంబసీలు
- విమాన సర్వీసులను రద్దు చేస్తున్న పలు సంస్థలు

2

ఆదివారం | 4-8-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 110 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య సా. 4.43 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పుష్యమి మ. 1.26 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె.3.15-4.59; దుర్ముహూర్తం: సా.5.01-5.52; అమృతఘడియలు: ఉ.6.38-8.20; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.43 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నిబంధనల ప్రకారం మాత్రమే భూముల క్రమబద్ధీకరణ జరగాలి. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం ఉండకూడదు. సాధారణ ప్రజానీకానికి ఇబ్బంది కలగకుండా చూడాలి. ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- జిల్లా కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఎల్‌ఆర్‌ఎస్.. ఇక ఆగదు!

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు వీడిన చిక్కులు

- రూ.10 వేల కోట్ల ఆదాయం వస్తుందనే అంచనాలు
- సీఎం, రెవెన్యూ మంత్రి వరుస సమీక్షలతో వేగం
- క్షేత్రస్థాయి బృందాలను నియమిస్తున్న శాఖాధిపతులు
- రాజకీయ కారణాల వల్లనే నాలుగేళ్ల జాప్యం!
- గత ప్రభుత్వంలో మునిసిపల్ శాఖ మంత్రికి తెలియకుండా ధరలు పెంచుతూ సీఎస్ ఉత్తర్వులు
- దుమారం రేగడంతో నెలలోపే సవరణలతో మరో జీవో
- ఎల్‌ఆర్‌ఎస్‌పై అన్ని పిటిషన్లను మూసేసిన హైకోర్టు
- సుప్రీంకోర్టు నుంచి ప్రస్తుతానికి లేని అభ్యంతరాలు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) అమలుకు సంబంధించి అడుగులు వేగంగా పడుతున్నాయి. గత నాలుగేళ్లుగా లక్షల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు ప్రభుత్వం భావిస్తున్నట్లుగా మూడు నెలల్లో మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెండింగ్ దరఖాస్తుల సమస్య పరిష్కారంపై ఇరవై రోజుల వ్యవధిలోనే అటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష చేయడం, తాజాగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లతో సమీక్ష నిర్వహించడాన్ని బట్టి ఈ అంశానికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తుందన్నది స్పష్టం చేస్తోంది. మూడు నెలల్లోగా ఎల్‌ఆర్‌ఎస్ సమస్యకు పరిష్కారం చూపాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఆ దిశగా క్షేత్రస్థాయి ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఈ ప్రక్రియ పూర్తయితే ప్రభుత్వానికి తక్షణం ఆదాయం సమకూరే అవకాశం ఉంది. సుమారు రూ.10 వేల కోట్ల దాకా ఖజానాకు జమ అవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో

మిగతా 13వ పేజీలో...

'దళితబంధు' విక్రేతలపై కేసులు: భట్టి 13

దళారులకు తావివ్వొద్దు

- ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరగనివ్వొద్దు
- మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలి
- ఎల్‌ఆర్‌ఎస్‌పై కలెక్టర్లకు పొంగులేటి ఆదేశం

13

నెలరోజుల్లోపు 4.5 లక్షల ఇళ్లు!

- తొలి విడతలో యుద్ధ ప్రాతిపదికన మంజూరు
- రుణమాఫీ సమస్యలు నెలాఖరులోగా కొలిక్కి
- ఈ నెల 15 వరకు మాఫీ పూర్తి: పొంగులేటి
- కాళేశ్వరంపై బీఆర్‌ఎస్ గోబెల్స్ ప్రచారం.. మంత్రి శ్రీధర్‌బాబు

గ్రాఫ్ తగ్గుతోందా?

ఎన్నికలు జరిగిన సమయంతో పోల్చితే కాంగ్రెస్ గ్రాఫ్ కొంత తగ్గినట్టుగా సమాచారం వస్తోంది. ఇందుకు సీఎం రేవంత్ మాత్రమే కారణం కాదు. అధిష్ఠానమే ప్రధాన బాధ్యత తీసుకోవాలి. సీఎంకు తగిన స్వేచ్ఛ కూడా ఇవ్వడం లేదు. మంత్రులు, ముఖ్యంగా సీనియర్లు ఎవరికి వారే ముఖ్యమంత్రులుగా వ్యవహరిస్తున్నారు. మంత్రులకు స్వేచ్ఛ అవసరమేగానీ అది అపరిమితం కాకూడదు. అధిష్ఠానం అతి జోక్యం కాంగ్రెస్‌కు నష్టం చేస్తున్నది. ఆ ఛాయలు ఇప్పటికే కనబడుతున్నాయి. జాతీయ స్థాయిలో ఇప్పుడిప్పుడే ప్రజాభిమానం చూరగొంటున్న రాహుల్ గాంధీ అప్పుడప్పుడయినా తెలంగాణలో పరిస్థితులను స్వయంగా సమీక్షించడం అవసరం.

రుణ మాఫీ వంటి ప్రధాన హామీల విషయంలో మాట నిలబెట్టుకున్నప్పటికీ ప్రభుత్వంపై మొత్తంగా ప్రజల్లో సదభిప్రాయం నెలకొనేలా తగు చర్యలు తీసుకోని పక్షంలో కాంగ్రెస్ బలహీనపడే ప్రమాదం ఉంది.

తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలకూడదన్న ధోరణిలో కొనసాగుతున్నాయి. రానురానూ ఈ పరిస్థితి మరింత వికటించి శాసనసభ లోపలా వెలుపలా ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కళ్లలో కళ్లు పెట్టి చూసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ సీఎంగా ఉన్నపుడు కేసీఆర్ ప్రతిపక్షాలకు కనీసం అపాయింట్మెంట్ కూడా ఇచ్చేవారు కాదు. గతంలో శాసనసభ సమావేశాల ప్రారంభం రోజు అధికార విపక్షాల నాయకులు అల్పాహార విందులో పాల్గొనేవారు. సమావేశాల ముగింపు సందర్భంగా కూడా ఉమ్మడిగా విందులో పాల్గొనేవారు. అది దాదాపు కనుమరుగైంది.

సీఎంలుగా ఉన్నప్పుడు అధికారం తలకెక్కి అహంకారపూరితంగా వ్యవహరించిన కేసీఆర్, జగన్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారు. అయితే... నాడు అధికార దర్పం వెలగబెట్టిన వీరు ప్రతిపక్ష నాయకులుగా శాసనసభ సమావేశాలలో పాల్గొనడానికి ఇష్టపడటం లేదు. చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా ఉండి కూడా ప్రతిపక్ష స్థానంలో కూర్చోడాన్ని నామోషీగా భావించలేదు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్నారు. అయినా ముఖ్యమంత్రిగా రేవంత్ ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్న ఆయన ఏకంగా శాసనసభ మీదే అలిగారని భావించాల్సి ఉంటుంది.

రేవంత్‌ను సీఎంగా గుర్తించడానికి మనసులో ఎక్కడో అయిష్టం ఉన్నందునే డిఫెన్స్ బదులు అఫెన్స్ పాత్ర పోషించాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నట్టు కనిపిస్తోంది. రేవంత్ సరదాగా, యథాలాపంగా చేసిన ఒక వ్యాఖ్యకు విపరీత అర్థాలు తీయడమే ఇందుకు నిదర్శనం. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతున్నప్పుడు రేవంత్ రెడ్డి కల్పించుకొని, 'మీ వెనుక కూర్చున్న అక్కల మాట వింటే మీ పరిస్థితి జూబిలీ బస్టాండ్ అవుతుంది' అని వ్యాఖ్యానించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని ఉద్దేశించి సీఎం చేసిన వ్యాఖ్యలు మహిళలను అవమానించడమేనని, ఆయనకు మహిళలంటే గౌరవం లేదని బీఆర్ఎస్ సభ్యులు ఎదురుదాడి చేసే యత్నం చేశారు. నిజానికి రేవంత్ చేసిన వ్యాఖ్యల్లో ఆక్షేపించాల్సింది ఏమీ లేదు. ఫలానా వాళ్ల మాటలు వింటే చెడిపోతావు అని మనం అనడం సహజం. ఆ వ్యాఖ్యలను ఆ కోవలోనే చూడాలి. రేవంత్ ట్రాక్ రికార్డ్ పరిశీలిస్తే.. ఆయన మహిళల పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించిన లేదా వారిని అవమానించిన సందర్భాలు లేవు.



కొత్త పలుకు!


4

కేసీఆర్ సభకు హాజరైతే శాసనసభ సమావేశాలు మరింత ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా ఉండేవి. నిజం చెప్పాలంటే కేసీఆర్ సభకు వచ్చి కేటీఆర్, హరీశ్‌లను కుడి ఎడమల కూర్చోబెట్టుకొని అధికార పక్షంపై మాటల యుద్ధానికి దిగితే ప్రభుత్వం ఎంతో కొంత ఆత్మరక్షణలో పడుతుంది.

రేవంత్ కూడా గతంలో సీఎంగా కేసీఆర్ తనను వేధించిన విషయాలను మరచి మరింత హుందాగా వ్యవహరించడం అవసరం. ప్రతిపక్షాలను పూచికపుల్లలకంటే హీనంగా చూసిన కేసీఆర్‌తో పోటీ పడాలనుకోకూడదు.

కృష్ణా ఆయకట్టుకు నీరు

- ఎగువ నుంచి భారీ వరద, ప్రాజెక్టులన్నీ నిండుగా ఉండటంతో విడుదలకు నిర్ణయం
- 14 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు ఊపిరి.. 'గోదావరి'పై 15 రోజుల్లో సమీక్ష
- రేపు తెరుచుకోనున్న నాగార్జున సాగర్ గేట్లు



నీటితో కళకళలాడుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నిండటంతో.. వాటి కింద ఉన్న ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొద్ది రోజులుగా ఎగువ నుంచి కృష్ణమ్మకు భారీగా వరద వస్తుండటంతో జలాశయాలన్నీ నిండు కుండలా మారాయి. దీంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో కృష్ణా ప్రాజెక్టుల కింద 14.05 లక్షల ఎకరాలకు 125 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు సర్కారు సిద్ధమవుతోంది. రాష్ట్ర స్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ ఛైర్మన్ ఈఎన్‌సీ (జనరల్) అనిల్ కుమార్ నేతృత్వంలో శనివారం జరిగిన

మిగతా 14వ పేజీలో...

3 లక్షల కోట్లు!

- వచ్చే పదేళ్లలో అసలు, వడ్డీలకు చెల్లించాల్సిన మొత్తం ఇది
- ఈ ఏడాది ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌కు దాదాపు సమానం
- కొత్తగా తెచ్చే అప్పుల్లో అసలు, వడ్డీలకే 76.73 శాతం
- జీఎస్టీ అవకతవకలతో ఖజానాకు రూ.986 కోట్ల నష్టం
- 2022-23 ఆర్థిక సంవత్సరపు నివేదికలో కాగ్ ఆక్షేపణలు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర ప్రభుత్వం అప్పుల వడ్డీలు, అసలుకే పదేళ్లలో రూ.2.90 లక్షల కోట్లు చెల్లించాలి. ఇప్పుడు బహిరంగ మార్కెట్ నుంచి కొత్తగా అప్పులు తెచ్చినా.. వచ్చే ఆ మొత్తం నుంచి 76.73% పాత అప్పుల అసలు, వడ్డీలకే చెల్లించే పరిస్థితి. సర్కారుకు నికరంగా మిగిలే నిధులు 23.27% మాత్రమే" అని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) తీవ్రస్థాయిలో ఆక్షేపించింది. ఇలా అప్పులు తెచ్చి.. రుణాలను తీర్చే పద్ధతి ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం ఆరోగ్యకరం కాదని అభిప్రాయపడింది. అప్పులపై ప్రభుత్వం దృష్టి

మిగతా 12వ పేజీలో...





'బాట్'తో బోల్తా

- అడ్డదారుల్లో ఇసుక ఆన్‌లైన్ బుకింగ్
- బాట్ సాఫ్ట్‌వేర్ ఆసరాగా కొందరు లారీ యజమానుల అక్రమాలు
- ఇతరులకు దక్కని బుకింగ్‌లు
- సైబర్ క్రైమ్‌కు టీజీఎండీసీ ఫిర్యాదు
- తవ్వకాలు, తరలింపుపై డ్రోన్ నిఘా

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) ద్వారా ఇసుక తరలించే లారీల యజమానులు అడ్డదారుల్లో బుకింగ్‌లు చేసుకోవడం అధికారులకు తలనొప్పిగా మారింది. కొందరికే పదే పదే బుకింగ్ ఆర్డర్లు లభిస్తుండగా, ఇతరులు

మిగతా 14వ పేజీలో...

ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి షెడ్యూల్

- నేటి నుంచి 13 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నీట్‌లో అర్హత సాధించిన 49,184 మంది

12



దివికేగిన నాట్యమయూరి


- ప్రముఖ నృత్యకారిణి యామినీ కృష్ణమూర్తి కన్నుమూత
- ఏపీలోని మదనపల్లెలో జననం.. 17 ఏళ్లకే తొలి ప్రదర్శన
- వృద్ధాప్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంతాపం

14


కబళించింది 86వేల మీటర్ల కొండచరియ

ఇరువంజిపుళ నదిలో 8 కి.మీ ప్రయాణం

» వయనాడ్ విషాదంపై ఇస్రో ఉపగ్రహ చిత్రం వెల్లడి



వయనాడ్/హైదరాబాద్, ఆగస్టు 3: కేరళలోని వయనాడ్ విషాదం వెనుక 86 వేల చదరపు మీటర్ల భారీ కొండచరియ ఉన్నట్లు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం(ఇస్రో) వెల్లడించింది. హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) తీసిన ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైనట్లు వివరించింది. ఆ మేరకు ఉపగ్రహ చిత్రాలను విడుదల చేసింది. ఓ కొండ పైభాగంలో విరిగి పడిగా మిగిలిన ప్రాంతాన్ని చిత్రంలో చూపిస్తూ.. గతంలో విరిగి పడ్డ కొండ చరియ ఆనవాళ్లు కూడా ఉన్నట్లు పేర్కొంది. అంటే.. 86 వేల చదరపు మీటర్ల మేర కొండ భాగం భారీ ముక్కలుగా విడిపోయి.. కిందకు దూసుకుపోయినట్లు తెలిపింది. అంతేకాదు.. సముద్ర మట్టానికి 1,550 మీటర్ల ఎత్తులోంచి కొండచరియలు జారుతూ.. ఇరువంజిపుళ నదిలో 8 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు పేర్కొంది. ఈ క్రమంలో అడ్డొచ్చిన చూరల్‌మల, ముండక్కై, అట్టమల గ్రామాల్లోని ఇళ్లు, చెట్లు, నదీ తీరాలను తుడిచిపెట్టేశాయని వివరించింది. ఈ కారణంగా ఆస్తి నష్టం, ప్రాణనష్టం అధికంగా ఉందని అధికారులు చెబుతున్నారు. శనివారం సాయంత్రానికి మరణాల సంఖ్య 344గా ఉన్నట్లు, ఇంకా 200 మంది జాడ తెలియరాలేదని వెల్లడించారు. భారత సైన్యం శిథిలాల కింద గాలింపును కొనసాగిస్తోందని, ఈ క్రమంలో ఓ కుటుంబానికి చెందిన నలుగురిని కాపాడారని పేర్కొన్నారు. మరోవైపు గుర్తించని మృతదేహాలకు సామూహిక ఖననాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. కాగా, కల్పేట అటవీ అధికారులు ప్రాణాలకు తెగించి చేసిన సాహసం.. పనియా తెగకు చెందిన ఓ కుటుంబాన్ని కాపాడింది. కొండచరియలు విరిగి పడ్డ రెండో రోజు కల్పేట అటవీ అధికారి కె.హాషిస్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం దట్టమైన అటవీ ప్రాంతానికి చేరుకుంది. అక్కడ నిటారుగా ఉండే ఓ కొండను తాళ్ల సాయంతో ఎక్కి.. ఓ గుహలో తలదాచుకున్న పనియా తెగకు చెందిన ఓ గిరిజన కుటుంబాన్ని కాపాడింది. ఆ కొండను ఎక్కడానికి నాలుగున్నర గంటల సమయం పట్టిందని, దట్టమైన పొగమంచు ఒకవైపు.. భారీ వర్షం, విరిగిపడుతున్న కొండచరియలు ఇంకోవైపు ప్రతికూలంగా ఉన్నా.. ఆ ప్రాంతానికి చేరుకున్నట్లు హాషిస్ తెలిపారు. వారిని తాళ్ల సాయంతో కాపాడారు. ఫారెస్ట్ అధికారుల సాహసాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఎక్స్‌లో కొనియాడారు.



బీఎస్ఎఫ్ తాత్కాలిక డీజీగా దల్జిత్ సింగ్ చౌధరి



న్యూఢిల్లీ, ఆగస్టు 3: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) తాత్కాలిక డైరెక్టర్ జనరల్‌గా దల్జీత్ సింగ్ చౌధరిని నియమిస్తూ శనివారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)కి డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తున్నారు. శాశ్వత ప్రాతిదికన డైరెక్టర్ జనరల్‌ను నియమించే వరకుగానీ, తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకుగానీ కేంద్ర ఉత్తర్వులు అమల్లో ఉండనున్నాయని హోం శాఖ అండర్ సెక్రటరీ సంజీవ్ కుమార్ తెలిపారు. దల్జీత్ సింగ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్టు పేర్కొన్నారు. ఇంతవరకు బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన నితిన్ అగర్వాల్‌ను శుక్రవారమే అర్థాంతరంగా తొలగించి సొంత కేడర్ అయిన కేరళకు పంపించింది. జమ్మూ ప్రాంతంలో ఇటీవల కాలంలో ఉగ్రవాదుల దుశ్చర్యలు పెరిగిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకొంది.

దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని జమ్మూకశ్మీర్‌లో ఆరుగురి డిస్మిస్

శ్రీనగర్, ఆగస్టు 3: దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఆరుగురిని జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగించింది. వీరిలో ఐదుగురు పోలీసులు, ఒక ఉపాధ్యాయుడు ఉన్నట్టు అధికారులు శనివారం వెల్లడించారు. వారిని విధుల నుంచి తొలగించడానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా రాజ్యాంగంలోని ఆర్టికల్ 311(2)(సీ)ని ప్రయోగించారని చెప్పారు. ఎవరైనా ఉద్యోగులు ప్రభుత్వ విధుల్లో కొనసాగడం వల్ల రాష్ట్ర భద్రతకు ముప్పు అని రాష్ట్రపతి లేదా గవర్నర్ భావించినట్లైతే సాధారణ ప్రక్రియను అనుసరించకుండానే వారిని ఉద్యోగాల నుంచి తొలగించే అధికారాన్ని ఈ ఆర్టికల్ కల్పిస్తుంది. హెడ్ కానిస్టేబుల్ ఫరూక్ అహ్మద్ షేక్, సెలక్షన్ గ్రేడ్ కానిస్టేబుళ్లు ఆసిఫ్ దీన్, ఖాలిద్ హుస్సేన్ షా, ఇర్షాద్ అహ్మద్ చాకూ, కానిస్టేబుల్ రెహ్మత్ షా, ఉపాధ్యాయుడు నజం దీన్ ఉగ్రవాద సంబంధిత, తీవ్రమైన దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు ఇంటెలిజెన్స్, దర్యాప్తు సంస్థలు గుర్తించాయని అధికారులు తెలిపారు. వీరంతా మాదక ద్రవ్యాల విక్రయంతోపాటు హిజ్బుల్ ముజాహిదీన్, లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థలకు క్షేత్రస్థాయి కార్యకర్తలుగా పనిచేస్తున్నారని చెప్పారు.

విదేశాల్లో ఉద్యోగాలంటూ 200 కోట్ల మోసం

» 9 రాష్ట్రాల్లో 3 వేలకు పైగా బాధితులు.. నలుగురి అరెస్టు

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలు రాష్ట్రాలకు చెందిన సుమారు 3,400 మంది వద్ద రూ.200 కోట్ల మేర మోసానికి పాల్పడిన నలుగురిని పుదుచ్చేరి సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో వెలువడిన ఓ ప్రకటన చూసిన పుదుచ్చేరి లాస్‌పేటకు చెందిన రమేష్‌కుమార్ మొబైల్‌ఫోన్‌లో అగంతకులను సంప్రదించాడు. సదరు వ్యక్తి కెనడాలోని ఓ ప్రముఖ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి.. వీసా, వైద్య పరీక్షలు, ఇన్సూరెన్స్ తదితరాల కోసమంటూ రూ.17.71 లక్షలు తీసుకున్నాడు. ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాక ఏడాది గడిచినా అటు నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్టు గ్రహించిన రమేష్‌కుమార్.. పుదుచ్చేరి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. రెండు నెలల పాటు జరిగిన విచారణలో కోల్‌కతా కేంద్రంగా మోసం జరిగినట్టు గ్రహించారు. అక్కడకు వెళ్లి దర్యాప్తు చేపట్టారు. మధ్యప్రదేశ్‌కు చెందిన శుభం శర్మ (29), నీరజ్ గుర్జార్ (28), వారి స్నేహితుడు బీహార్‌కు చెందిన దీపక్‌కుమార్ (28), యూపీ చెందిన రాజ్‌గౌండ్ (23) ఈ మోసానికి పాల్పడ్డారని, వారు ప్రస్తుతం బెంగుళూరులో ఉన్నట్టు తెలుసుకుని శుక్రవారం ఆ నలుగురినీ అరెస్టు చేసి పుదుచ్చేరికి తరలించారు. శుభం శర్మ నేతృత్వంలోని ఈ ముఠా.. దేశవ్యాప్తంగా 3,400 మందికి పైగా విదేశీ ఉద్యోగాల పేరిట మోసం చేసినట్టు సమాచారం. వారి నుంచి 21 సెల్‌ఫోన్లు, 2 పాస్‌పోర్ట్‌లు, రూ.41 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

సెప్టెంబరు 4న ట్రంప్-కమలా హారిస్ డిబేట్!

న్యూయార్క్, ఆగస్టు 3: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అధికార డెమోక్రటిక్ పార్టీ తరఫున కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో ఆమెతో డిబేట్‌కు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. ఈ విషయాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ఫాక్స్ న్యూస్ నిర్వహించే ఈ డిబేట్ సెప్టెంబరు 4న పెన్సిల్వేనియాలో జరగనుందని, ఈ కార్యక్రమంలో పూర్తి స్థాయిలో ప్రేక్షకులు కూడా ఉండనున్నారని ఆయన తెలిపారు. గతంలో జో బైడెన్‌తో డిబేట్ మాదిరే ఇందులో నియమ నిబంధనలు ఉండనున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఈ డిబేట్‌కు దాని నియమనిబంధనలకు హారిస్ అంగీకరించారా లేదా అన్నది తెలియాల్సి ఉంది. అయితే ట్రంప్‌తో ముఖాముఖీ చర్చకు తాను సిద్ధమేనని హారిస్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే.

హెచ్-1బీ వీసాదారులకు భారీ ఊరట

న్యూయార్క్, ఆగస్టు 3: హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు అమెరికాలో పనిచేయడానికి అనుమతించే ఫెడరల్ నిబంధనను కొలంబియా జిల్లా కోర్టు సమర్థించింది. వీసా హోల్డర్లను చేర్చుకొనే షరతులను నిర్ణయించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్)కి యూఎస్ ఇమిగ్రేషన్ చట్టం విస్తృత అధికారాలను కల్పిస్తుందని ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్ పేర్కొంది. స్థానికుల స్థానంలో విదేశీ కార్మికులను నియమించడాన్ని సవాలు చేస్తూ 'సేవ్ జాబ్స్ యూఎస్ఏ' సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని కింది కోర్టు కొట్టివేయడాన్ని సమర్థిస్తూ.. ఫెడరల్ చట్టం ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పీల్స్ కోర్టు స్పష్టం చేసింది. గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ సహా పలు ప్రధాన టెక్ కంపెనీలు సైతం ఈ నిబంధనను సమర్థించాయి.

సమాజ్‌వాదీ నేత బేకరీపై బుల్డోజర్

అయోధ్య, ఆగస్టు 3: స్థానిక సమాజ్‌వాదీ పార్టీ నేత మోయిన్ ఖాన్ బేకరీని శనివారం జిల్లా అధికారులు బుల్డోజర్‌తో నేలమట్టం చేశారు. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు ఆ బేకరీని సీల్ చేసి, అక్కడి పదార్థాలను పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. 12 ఏళ్ల బాలికను ఆ బేకరీలో తన సహాయకునితో కలిసి గ్యాంగ్ రేప్ చేసినట్టు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మోయిన్ ఖాన్..ఫైజాబాద్ ఎంపీ అవధేష్ ప్రసాద్ (ఎస్పీ)కి చాలా సన్నిహితుడన్న గుర్తింపు ఉంది. సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు సోహవాల్ రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లి మెయిన్ ఖాన్ ఆస్తుల కొలతలు తీశారు. అనంతరం బుల్డోజర్‌ను ప్రయోగించారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం బాధితురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అసెంబ్లీలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించారు.

స్కూల్ ఎగ్గొట్టేందుకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 3: పాఠశాలకు వెళ్లడం ఇష్టంలేని ఓ విద్యార్థి చేసిన అల్లరి పని... ఢిల్లీలోని సమ్మర్ ఫీల్డ్స్ స్కూల్ యాజమాన్యానికి ముచ్చెమటలు పట్టేలా చేసింది. పాఠశాలలో బాంబు ఉందంటూ గురువారం అర్ధరాత్రి సమయంలో మెయిల్ వచ్చింది. శుక్రవారం ఉదయం మెయిల్ చూసుకున్న సిబ్బంది... అప్పటికే పాఠశాల ప్రారంభంకావడంతో, హుటాహుటిన విద్యార్థులను బయటకు తరలించారు. తర్వాత రంగంలోకి దిగిన పోలీసులు... మెయిల్ పంపింది అదే పాఠశాలకి చెందిన 14 ఏళ్ల విద్యార్థిని కనిపెట్టారు. స్కూల్ ఎగ్గొట్టడం కోసమే ఈ పనిచేశానని అతను అంగీకరించాడు. అయితే, కేవలం తమ పాఠశాల అంటే అనుమానం వస్తుందని భావించిన ఆకతాయి... తాను పంపిన మెయిల్‌లో, మరో రెండు పాఠశాలల్లో కూడా బాంబును అమర్చినట్లు పేర్కొన్నాడు.

వణుకుతున్న ఉత్తరాది

హిమాచల్‌ప్రదేశ్ అతలాకుతలం

» కోల్‌కతా ఎయిర్‌పోర్టులోకి వరద

» ఝార్ఖండ్‌లో పలు ప్రాంతాలు జలమయం



పశ్చిమ బెంగాల్‌లోని నదియలో వరద నీటిలో చిన్నారితో మహిళ

న్యూఢిల్లీ, బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉత్తరాదితో పాటు పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ముఖ్యంగా హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు అతలాకుతలం అవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. హిమాచల్‌ప్రదేశ్‌లో అయితే కుండపోత వర్షాలకు పరిస్థితి భయానకంగా తయారైంది. నాలుగురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో 190కి పైగా రోడ్లపై రాకపోకలను నిషేధించారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం 82 బస్సు సర్వీసులను రద్దు చేసింది. విద్యుత్, తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జూన్ 27వ తేదీ నుంచి ఇప్పటి వరకు భారీ వర్షాలకు ఆ రాష్ట్రంలో 77 మంది మరణించగా, దాదాపు 655 కోట్ల ఆస్తి నష్టం సంభవించినట్టు అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాతో పాటు చుట్టుపక్కల జిల్లాలు ఎడతెరిపిలేని వర్షాలకు వణికిపోతున్నాయి. శనివారం కోల్‌కతా అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. రన్‌వే, ట్యాక్సీవేలపై వరద నీరు చేరింది. ఇలాంటి పరిస్థితుల్లోనూ విమానాల రాకపోకలు సజావుగా సాగుతున్నాయని అధికారులు తెలిపారు. విమానాలు పార్క్ చేసిన ప్రాంతంలో వర్షపు నీరు చేరిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పార్కింగ్ స్టాండ్లలోకి వరద చేరడంతో అదనపు మోటార్ పంపులతో నీటిని బయటకు పంపుతున్నారు. కోల్‌కతా నగరంలో చాలా ప్రాంతాలు వరదలో చిక్కుకున్నాయి. అల్పపీడనం ప్రభావంతో పశ్చిమబెంగాల్‌లోని దక్షిణాది జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పలు చోట్ల రెడ్, ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. పశ్చిమ వర్ధమాన్ జిల్లాలో నీట మునిగిన వంతెనను దాటుతుండగా కారు కొట్టుకుపోవడంతో ఓ వ్యక్తి మరణించారు. ఇక ఝార్ఖండ్‌లో భారీ వర్షాలకు చాలా రోడ్లు కొట్టుకుపోయాయి. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలగా, ఇళ్లు దెబ్బతిన్నాయి. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. రాంచీలో ఎన్డీఆర్ఎఫ్ దళాలను మోహరించి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

మంగళూరు-హాసన్ మధ్య కుంగిన భూమి

కర్ణాటక రాష్ట్రం మంగళూరు-హాసన్ మార్గంలోని ఎడకుమరి, కడగరవల్లి మధ్య భూమి కుంచించుకుపోవడంతో రాబోయే రెండు మూడు రోజులకు సంబంధించి ఆ మార్గంలో పలు రైలు సర్వీసులను రద్దు చేశారు. ఈ మేరకు రైల్వేశాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా, దక్షిణకన్నడ జిల్లా బెళ్తిప్పాడిలో కొండచరియలు విరిగి ఓ ఇంటిపై పడ్డంతో ఆరు పశువులు మృతి చెందాయి. మూడబిదరె వద్ద కొండచరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. హాసన్ జిల్లా సకలేశపుర ప్రాంతంలో జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మరోవైపు, వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు వంద ఇళ్లు నిర్మించి ఇస్తామని కేరళ సీఎం పినరయి విజయన్‌కు కర్ణాటక సీఎం సిద్దరామయ్య భరోసా ఇచ్చారు.వయనాడ్‌లో ప్రకృతి విపత్తుల వల్ల ఇబ్బంది పడుతున్న బాధితులను ఆదుకోవడం మనందరి సమష్టి బాధ్యత అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. అందుకోసం శనివారం ఆయన హైదరాబాద్‌లో విరాళాల సేకరణ చేపట్టారు.

ఊరంతా కొట్టుకుపోయింది

హిమాచల్‌ప్రదేశ్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో సిమ్లా జిల్లాలో సామెజ్ అనే గ్రామం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఆ ఊరిలో ఓ ఇల్లు మాత్రమే మిగిలింది. మరో వృద్ధుడు పొరుగూరులో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. సామెజ్ గ్రామానికి చెందిన అనితాదేవి ఆ హృదయ విదారక దృశ్యాలను పంచుకున్నారు. 'బుధవారం రాత్రి మేమంతా నిద్రలో ఉండగా పెద్ద శబ్దం వచ్చింది. బయటకొచ్చి చూస్తే ఊరు మొత్తం కొట్టుకుపోయింది. భయంతో మేం భగవతి కాళీమాత ఆలయానికి వెళ్లి ఆ రాత్రి తలదాచుకున్నాం. ఆ విధ్వంసంలో మా ఇల్లు మాత్రమే మిగిలింది. నా కళ్ల ముందే అంతా కొట్టుకుపోయింది' అని అనితాదేవి అన్నారు. అదే గ్రామానికి చెందిన బక్షీరామ్ అనే వృద్ధుడు.. 'వరదలు వచ్చినపుడు నేను రాంపూర్‌లో ఉండటంతో బతికి బయటపడ్డా. అర్ధరాత్రి 2 గంటలకు వరదలు వచ్చినట్టు తెలిసింది. 4 గంటల ప్రాంతంలో ఇక్కడికి వచ్చి చూడగా ఊరంతా ధ్వంసమైంది. నా కుటుంబ సభ్యులు 14-15 మంది వరదలో కొట్టుకుపోయారు' అంటూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ఆ గ్రామంలో మొత్తం 53 మంది గల్లంతు కాగా, 6 మృతదేహాలు లభ్యమయ్యాయి.

కోర్టు వ్యవహారాలతో ప్రజలు విసిగిపోయారు

» విచారణ ప్రక్రియే శిక్షగా మారింది

» సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఆగస్టు 3: కోర్టు వ్యవహారాలతో ప్రజలు విసిగిపోయారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. వారు కేవలం సమస్యలకు ఏదో విధమైన సత్వర పరిష్కారం కావాలని కోరుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. విచారణ ప్రక్రియే ఓ శిక్షగా మారిందని, ఇది జడ్జీలకు సయితం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక లోక్‌అదాలత్ కార్యక్రమం శనివారం ముగిసిన సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకునే రాజీ మార్గంలో కేసులు పరిష్కరించేందుకు లోక్‌అదాలత్‌ను నిర్వహించామని చెప్పారు. ప్రజల ఇంటి వద్దకు న్యాయాన్ని తీసుకెళ్లడం, వారి జీవితాల్లో భాగంగా ఉన్నామని చెప్పడమే లోక్ అదాలత్‌ల ఉద్దేశమని చెప్పారు. ఇందుకు న్యాయమూర్తులు, న్యాయవాదుల నుంచి సహకారం లభించిందని ప్రశంసించారు. ఇద్దరు న్యాయమూర్తులు, ఇద్దరు న్యాయవాదులతో కలిసి లోక్‌అదాలత్ ప్యానెళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. తొలుత ఏడు బెంచ్‌లు ఏర్పాటు చేయగా, వాటి సంఖ్యను 13కు పెంచామని, ఇవి కేసుల పరిష్కారానికి విశేషమైన కృషి చేశాయని చెప్పారు. తాను ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తరువాత సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో దేశంలోని అన్ని ప్రాంతాల వారికి ప్రాతినిధ్యం ఉండేలా చూశానని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు.

ఎన్డీయే కూటమిలో 'ఎస్సీ కోటా' సెగ

» సుప్రీంకోర్టు తీర్పుపై కూటమిలోని పలు పార్టీ నేతల భగ్గు

» తీర్పుపై అప్పీల్ చేస్తామన్న కేంద్ర మంత్రులు చిరాగ్, అథవాలే

న్యూఢిల్లీ, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎన్డీయే కూటమి పక్షాలైన లోక్ జనశక్తి పార్టీ(రాంవిలాస్), రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ-అథవాలే) తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్తామని లోక్ జనశక్తి పార్టీ చీఫ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. అదేవిధంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధినేత రామ్‌దాస్ అథవాలే కూడా తీర్పును వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి క్రీమీలేయర్ క్రిటేరియాపై అప్పీలు చేస్తామన్నారు. "15% ఎస్సీ కోటాలో వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సమీక్షించాలని కోరుతున్నాం. దీనిపై అప్పీల్‌కు వెళ్తాం" అని చిరాగ్ పాశ్వాన్ చెప్పారు. అస్పృశ్యత విషయంలో సుప్రీంకోర్టు తీర్పు విఫలమైందని వ్యాఖ్యానించారు. "ఎస్సీ కోటాలో క్రీమీలేయర్‌ను ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించలేం. వర్గీకరణ ద్వారా ఎస్సీలు అనుభవిస్తున్న అస్పృశ్యత పరిష్కారం కాదు" అని అన్నారు. అంతేకాదు, ఎస్సీల్లోని ఉన్నత విద్యావంతులు, ఆర్థికంగా బలంగా ఉన్నవారు కూడా అస్పృశ్యతను ఎదుర్కొంటున్నారని పాశ్వాన్ తెలిపారు. ఈ నేపథ్యంలో వర్గీకరణ మరింత అన్యాయానికి గురిచేసినట్టే అవుతుందన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కోరుతున్న కుల గణనకు పాశ్వాన్ మద్దతు తెలిపారు. అయితే, ఆయా కుల గణన వివరాలను మాత్రం బహిరంగ పరచకూడదని అభిప్రాయపడ్డారు. కాగా, తమ మిత్రపక్షం జేడీయూ సుప్రీంకోర్టు తీర్పును సమర్థించడంపై మాత్రం పాశ్వాన్ మౌనం వహించారు. మరోవైపు, ఆర్‌పీఐ అధినేత, కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే కూడా సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. కులం ఆధారంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఏర్పాటు చేశారని, దీనిలో క్రీమీలేయర్ క్రిటేరియా వర్తింపచేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, దీనిపై అప్పీలుకు వెళ్తామని అన్నారు.

తక్కువ జలం.. ఎక్కువ ఫలం

ఇప్పుడిదే ప్రపంచ సాగు మంత్రం

» తక్కువ నీటితో కాపునిచ్చే బ్లాక్ రైస్, తృణధాన్యాలతోనే ఆహారభద్రత సాకారం

» అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థిక వేత్తల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



వ్యవసాయ ఆర్థిక వేత్తల సదస్సులో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌తో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 3 : తక్కువ జలాలతో అధిక ఫలసాయం అందించే సాగు పద్ధతులే ప్రపంచానికి ఆహారభద్రతను సమకూర్చగలవని ప్రధాని మోదీ అన్నారు. దీనికోసం బ్లాక్ రైస్, తృణధాన్యాల సాగుపై దృష్టి సారించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. వ్యవసాయ ఆర్థికవేత్తల 32వ అంతర్జాతీయ సదస్సును(ఐసీఏఈ) శనివారం ఢిల్లీలో ఆయన ప్రారంభించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతతో పాటు పోషక విలువలు కలిగిన పంటలను పండించడం ప్రపంచానికి పెద్ద సవాల్‌గా మారిందని మోదీ అన్నారు. ఆహార భద్రత సమస్యకు పరిష్కారం చూపేలా భారత్ అడుగులు వేస్తోందన్నారు. వాతావరణ పరిస్థితులను తట్టుకుని మంచి పంటను అందించే సాగు విధానాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి సిద్ధంగా ఉన్నామనీ, ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ అంశానికి పెద్దపీట వేశామని మోదీ తెలిపారు. "అన్నిరకాల వాతావరణాలను తట్టుకోగల 1900 రకాల కొత్త వంగడాలను గత పదేళ్లలో రైతులకు అందించాం. ఈ వంగడాలకు సాధారణ వరి పంటలతో పోల్చితే 25% జలాలు సరిపోతాయి. బ్లాక్‌రైస్ అందరికీ ఇష్టమైన ఆహారంగా మారింది. ముఖ్యంగా మణిపూర్, అసోం, మేఘాలయలో ఈ రకం వరి ఆహారాన్ని బాగా తింటున్నారు" అని తెలిపారు. ప్రపంచం సూపర్ ఫుడ్‌గా భావించే తృణధాన్యాల అతి పెద్ద ఉత్పత్తిదారుగా భారత్ మారిందని చెప్పారు. కాగా, ఐసీఏఈ సదస్సు 65 ఏళ్ల తర్వాత మళ్లీ భారత్‌లో జరగడం ఇదే మొదటిసారి. ఆ సదస్సు తొలిసారి జరిగినప్పుడు కొత్తగా అప్పుడే భారత్ స్వాతంత్ర్యం పొందిందని మోదీ గుర్తుచేశారు. అప్పట్లో వ్యవసాయ రంగంలో సమస్యలతో తిండి గింజలకు కటకట పడిన దశ నుంచి ఆహార ఉత్పత్తిలో సంపూర్ణ సంవృద్ధిని ఇప్పుడు భారత్ సాధించిందని ప్రధాని గుర్తుచేశారు. పాల ఉత్పత్తిలో, పప్పు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాల సాగులో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉన్నామని వివరించారు. దేశాభివృద్ధి వ్యూహంలో వ్యవసాయం అతి కీలక రంగంగా మారిందని నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్ అన్నారు. కాగా, 70 దేశాల నుంచి వెయ్యిమంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

పాపులారిటీలో మోదీ నం. 1

ప్రధాని మోదీ మరోసారి ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా నిలిచారు. అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ అనే సంస్థ ఈ మేరకు నిర్వహించిన సర్వే తాజా వివరాలను ప్రకటించింది. ఇందులో 69% మద్దతుతో మోదీ ప్రపంచంలోనే అత్యధిక ప్రజాదరణ కలిగిన నేతగా నిలిచారు. ఆయన తర్వాత మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెస్ రెండో స్థానంలో ఉన్నారు. జాబితాలో 3 నుంచి 10 స్థానాల్లో వరుసగా అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మెలీ, స్విట్జర్లాండ్ ఫెడరల్ కౌన్సిలర్ వియోలా, ఐర్లాండ్ మంత్రి సైమన్ హ్యారిస్, యూకే ప్రధాని స్టార్మర్, పోలాండ్ మాజీ ప్రధాని టస్క్, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ , స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్, ఇటలీ ప్రధాని మెలోనీ ఉన్నారు.

పారిస్ వెళ్లేందుకు మాన్‌కు అనుమతివ్వలేం

భద్రతా కారణాల దృష్ట్యా కేంద్రం నిర్ణయం

చండీగఢ్, ఆగస్టు 3: భారత హాకీ జట్టుకు మద్దతు తెలిపేందుకు పారిస్ ఒలింపిక్స్ వెళ్లాలని నిర్ణయించుకున్న పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌కు కేంద్రం అనుమతి నిరాకరించింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు ఆగస్టు 4న క్వార్టర్‌ఫైనల్ ఆడనుంది. భారత టీంను ప్రోత్సహించేందుకు ఆగస్టు 4-9 వరకు పారిస్ వెళ్లాలని భగవంత్ మాన్ షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు. ఈ మేరకు విదేశీ వ్యవహారాల శాఖకు సమాచారం ఇచ్చారు. దౌత్య పాస్‌పోర్టు ఉన్నప్పటికీ జడ్ ప్లస్ భద్రత ఉన్న మాన్‌కు పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వడం కుదరదని కేంద్రం చెప్పినట్లు సమాచారం. ఇంత తక్కువ సమయంలో ఆయనకు పారిస్‌లో ఆ స్థాయి ఏర్పాట్లు చేయలేమని దీంతో పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. "భారత హాకీ జట్టులో ఎక్కువ మంది ఆటగాళ్లు పంజాబీలే. పారిస్ వెళ్లేందుకు మాన్‌కు అనుమతివ్వకపోవడం అంటే 3 కోట్ల పంజాబ్ ప్రజల మనోభావాలను కేంద్రం అవమానించడమే" అని ఆప్ పేర్కొంది. ఆగస్టు 4-7 వరకు అమెరికాలో జరిగే శాసనసభ స్పీకర్ల భేటీలో పాల్గొనేందుకు పంజాబ్ స్పీకర్ కుల్తర్‌కు కూడా కేంద్రం అనుమతి ఇవ్వలేదు.

మరో యుద్ధం అంచున పశ్చిమాసియా!

» ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాన్ ఆదేశంతో తీవ్ర ఉద్రిక్తత

» యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లను పంపుతున్న అమెరికా

» భారతీయ పౌరులను అప్రమత్తం చేసిన ఎంబసీలు



పసిఫిక్ జలాల్లో అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ లింకన్

టెల్ అవీవ్, ఆగస్టు 3: అసలే ఉద్రిక్తతలకు నెలవైన పశ్చిమాసియాలో ఓవైపు హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం జరుగుతుండగానే, మరో యుద్ధం తప్పదనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తమ దేశంలో అతిథిగా ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యతో రగిలిపోతున్న ఇరాన్.. ఇజ్రాయెల్‌పై దాడికి సిద్ధమవుతోంది. మిత్ర దేశాలతో కలిసి విరుచుకుపడే ఆలోచన చేస్తోంది. ఒకేసారి అందరూ కలిసి దాడి చేయడమా? లేక విడివిడిగానా? అనేది చర్చల్లో ఉంది. దీంతో ఇరాన్ బద్ధ శత్రువైన అమెరికా రంగంలోకి దిగింది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఫోన్ చేసి మద్దతు తెలిపారు. అగ్ర రాజ్యం అదనపు యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లను పంపేందుకు సిద్ధమైంది. ఈ మేరకు బాలిస్టిక్ క్షిపణలను నిరోధించగల క్రూయిజర్లు, యుద్ధ విమానాలను తరలించేందుకు అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఆదేశించారు. పశ్చిమాసియాలో ఇప్పటికే ఉన్న విమాన వాహక నౌక యూఎస్ఎస్ థియోడర్ రూజ్‌వెల్ట్ స్థానంలో యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు పెంటగాన్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ సబ్రినా సింగ్ తెలిపారు. కాగా, గత మంగళవారం లెబనాన్ రాజధాని బీరూట్‌లో తమ కమాండర్ ఫాద్ షకూర్‌ను ఇజ్రాయెల్ హతమార్చడంతో ఉగ్ర సంస్థ హెజ్బొల్లా తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఇక హనియా హత్యకు భీకరమైన సైనిక ప్రతీకారం తప్పదని యెమెన్‌కు చెందిన హౌతీ ఉగ్రవాదులూ ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్‌ను అడ్డుకునేందుకు పశ్చిమాసియాలో సైనిక శక్తిని పెంచుతున్నట్లు అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్ తెలిపింది. మరోవైపు టెల్ అవీవ్‌కు ఎయిరిండియా సహా పలు విమానయాన సంస్థలు సర్వీసులను రద్దు చేశాయి. భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని ఇజ్రాయెల్‌లోని రాయబార కార్యాలయం కోరింది. ముందు రోజే బీరూట్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా ఇదే విధమైన హెచ్చరిక చేసింది. వీలైతే లెబనాన్ నుంచి వెళ్లిపోవాలని కూడా కోరింది. మరోవైపు, లెబనాన్‌లో ఉన్న తమ పౌరులు వెంటనే, ఏ టికెట్ దొరికితే ఆ టికెట్‌తో స్వదేశాలకు వచ్చేయాలని అమెరికా, యూకే సూచించాయి.

2036 కల్లా దేశ జనాభాలో 65% మంది పనిచేయగల వయస్సు వారే

న్యూఢిల్లీ, ఆగస్టు 3: భారతదేశంలో పనిచేయగలిగిన వయస్సు(15-64) కలిగిన జనాభా సంఖ్య 2036వరకు పెరుగుతుందని ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఏడీబీ) నివేదిక పేర్కొంది. 2011 నాటికే భారత్‌లో 60% మంది పనివయసు జనాభా ఉందని, ఇది 2031 నాటికి 65.1 శాతానికి చేరుతుందని పేర్కొంది. అయితే, 2036 నాటికి స్వల్పంగా తగ్గుముఖం పట్టి 64.9 శాతానికి చేరే అవకాశం ఉందని తెలిపింది. ఇదే సమయంలో చైనా, జపాన్‌లలో పనివయసు జనాభా తగ్గుముఖం పడుతోందని తెలిపింది. పనివయసు జనాభా పెరుగుదల కారణంగా శ్రామిక శక్తి వృద్ధి చెందుతుందని, ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని నివేదిక వివరించింది. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో వలసలు, మానవ వనరుల మూలధన పెట్టుబడులు కూడా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, ప్రస్తుతం పలు దేశాల్లో పనివయసు జనాభా తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఆయా దేశాలు మరిన్ని విధానాలు అవలంభించాల్సి వస్తోందని పేర్కొంది. అయితే, ఆసియా, పసిఫిక్ దేశాలు మాత్రం పనివయసు జనాభాను సమతుల్యం చేయడంతో పాటు వారిని సరైన విధంగా వినియోగించుకునేందుకు నూతన విధానాలను అవలంభించాల్సి ఉంటుందని ఏడీబీ వివరించింది.

జనరల్‌లో ఎక్కితే చుక్కలే..!

- రైళ్లలో ప్రయాణం సామాన్యులకు నరకం
- సరిపడా జనరల్ బోగీలు లేక జనం విలవిల
- కిక్కిరిసిన బోగీల్లో ప్రమాదకరంగా ప్రయాణం
- పెరుగుతున్న గొడవలు, కొట్లాటలు
- గతంలో 4 జనరల్ బోగీలు.. ఇప్పుడు ఒక్కటే

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

వ్యాపారమే పరమావధిగా మారిపోయిన రైల్వేకు పేదల ఇబ్బందులు పట్టడం లేదు. లాభార్జన కోసం జనరల్ బోగీలను కుదించడంతో సామాన్య ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. స్లీపర్ కోచ్‌లను కూడా రెట్టింపు సంఖ్యలో కుదించేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. కరోనా తర్వాత నుంచి కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైల్వే సామాన్యుడికి దూరమవుతూ వస్తోంది. ఓ పథకం ప్రకారం రైల్వేను ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో విజయవాడ రైల్వే పరిధిలోనూ సామాన్య ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పాసింజర్ల రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చేయడం, జనరల్ బోగీలను నాలుగు నుంచి దశలవారీగా ఒక్క బోగీకి తీసుకురావడం, స్లీపర్ కోచ్‌లు 15 నుంచి 5కు పరిమితం చేయడం చేస్తున్నారు. ఏసీ బోగీల సంఖ్యను రెండు, మూడు రెట్లు పెంచుకుంటూ పోతున్నారు. రైళ్లలో సింహభాగం పేద, మధ్య తరగతి వర్గాలే ప్రయాణిస్తుంటారు. కానీ, ధనిక వర్గాలకే ప్రాధాన్యమిచ్చేలా ఏసీ బోగీలను పెంచడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఇసకేస్తే రాలనంత జనం..

విజయవాడ డివిజన్ పరిధిలో ఏ రైలు చూసినా ఒకే ఒక్క జనరల్ బోగీ, ఐదు స్లీపర్ కోచ్‌లు ఉంటున్నాయి. ఇవి సామాన్యులకు సరిపోవట్లేదు. పోనీ కోచ్‌ల్లో ప్రయాణికులు సరిపడా టికెట్లు ఇస్తున్నారా అంటే అదీ లేదు. పరిమితిని మించి టికెట్లు జారీ చేస్తున్నారు. దీనికితోడు టికెట్ తీసుకోని వారు కూడా జనరల్ బోగీల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ఉన్న ఒకే ఒక్క జనరల్ బోగీలో ఇసకేస్తే రాలనంత జనం కనిపిస్తున్నారు. సీట్ల కోసం గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయి. మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారు. టాయ్‌లెట్స్ వరకు కూడా కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఆఖరుకు సీట్ల దగ్గర కాళ్లు పెట్టుకునే ప్రాంతంలో కూడా కూర్చోవాల్సి వస్తోంది.

అమృత్ భారత్‌లో పరిస్థితి దారుణం

పేదల కోసం రేటు పెంచి నడుపుతున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఇటీవల విజయవాడకు ఒకటి కేటాయించారు. ఈ రైల్లో అన్నీ సాధారణ సీటింగ్ బోగీలే. ఫస్ట్, సెకండ్, థర్డ్ క్లాస్ అంటూ వర్గీకరించారు. ఈ రైల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. బోగీలన్నీ కిటకిటలాడుతున్నాయి. ట్రెయిన్ రూఫ్‌కు దుప్పట్లను ఉయ్యాలలా కట్టుకుని అందులో కూర్చుంటున్నారు. రైళ్లలో ఒక జనరల్ బోగీని పెంచుతామని ఇటీవల కాలంలో రైల్వే అధికారులు గొప్పగా ప్రకటించారు. కానీ, ఇప్పుడున్న డిమాండ్ దృష్ట్యా కనీసం రైలుకు ఐదు జనరల్ బోగీలనైనా నడపాల్సిన అవసరం ఉంది.

'మున్నూరు కాపు' కౌన్సిల్ చైర్మన్‌గా ఆది శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆ సంఘం నియమించింది. ఇటీవలి దాకా ఈ కౌన్సిల్‌కు మాజీమంత్రి గంగుల కమలాకర్ చైర్మన్‌గా వ్యవహరించారు. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో తాజాగా జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆది శ్రీనివాస్‌ను చైర్మన్‌గా నియమిస్తూ నిర్ణయం జరిగింది.

అక్టోబరు 4 నుంచి 12 వరకు

శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- ప్రత్యేక దర్శనాలు, ఆర్జితసేవలు రద్దు: టీటీడీ అదనపు ఈవో



తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను అక్టోబరు 4వ తేదీ నుంచి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం సాయంత్రం ఆయన బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై తొలి సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఇంజనీరింగ్ పనులు, వాహనాల ఫిట్నెస్, లడ్డూ బఫర్ స్టాక్, అన్నప్రసాదం, దర్శనం, వసతి, కళాబృందాల కార్యక్రమాలు, ఉద్యానవన శాఖ, ట్రాన్స్‌పోర్టు, కల్యాణకట్ట, గోశాల, శ్రీవారిసేవకులు, విజిలెన్స్ ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌర్యం లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు అక్టోబరు 4న ధ్వజారోహణం జరుగుతుందన్నారు. 8న గరుడసేవ, 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, 12న చక్రస్నానం నిర్వహిస్తారు. వాహన సేవలు రోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు ప్రారంభిస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో వయోవృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐలు, చిన్నపిల్లల తల్లిదండ్రులతో సహా అన్ని ప్రత్యేక దర్శనాలు, ఆర్జితసేవలను రద్దు చేశామన్నారు.

కమీషన్ ఆశచూపి.. క్రెడిట్ కార్డులతో పెట్రోల్ బంక్‌లకు టోకరా

- ఏపీకి చెందిన ఐదుగురి అరెస్టు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 3: డెబిట్, క్రెడిట్ కార్డుల లావాదేవీలు జరిపే స్వైపింగ్ మెషీన్(పీఓఎస్ యంత్రాలు)ల్లోని ఆప్షన్లను వాడుకుని పెట్రోల్ బంకు యజమానులకు టోకరా వేస్తున్న కేటుగాళ్లను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండకు చెందిన వేముల శ్రీనివాసరావు, నేలటూరి రవికుమార్, మలపతి శౌరీ, నర్సారావుపేట మండలం రావిపాడుకు చెందిన ఆనాల శివ, కారంపుడికి చెందిన కడితం సిద్దార్థరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నిందితులు ఐదుగురు ఓ ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలపై తిరుగుతూ ఏపీ సరిహద్దుల్లోని పెట్రోల్ బంకుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. పెట్రోల్ బంకులోకి వెళ్లి తమ బంధువు ఆస్పత్రిలో ఉన్నారని, అత్యవసరంగా నగదు కావాలని, తమ క్రెడిట్ కార్డు నుంచి నగదు డ్రా చేసి ఇస్తే కొంత కమీషన్‌గా ఇస్తామని సాయం చేయమని వేడుకునేవారు. బంక్ నిర్వాహకులు అంగీకరిస్తే తమ క్రెడిట్ కార్డు నుంచి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు డ్రా చేసేవారు. ఈ క్రమంలో ముఠా సభ్యులు బంక్ ఆపరేటర్‌ను మాటల్లో పెట్టి పీఓఎస్ యంత్రాన్ని తమ చేతుల్లోకి తీసుకుని మెషీన్‌లోని 'వాయిడ్' అనే ఆప్షన్ వాడి తాము చేసిన లావాదేవీని రద్దు చేసేవారు. దీంతో డ్రా చేసిన సొమ్ము తిరిగి వారి క్రెడిట్ కార్డులో జమయ్యేది. అలాగే, బంకు నిర్వాహకులు నుంచి నగదు కూడా తీసుకుని పరారయ్యేవారు. వేముల శ్రీనివాసరావు, ఆనాల శివ తొలుత నర్సారావుపేట, రావిపాడులోని బంకుల్లో ఈ తరహా మోసాలు చేశారు. ఇదే టెక్నిక్‌తో వీరంతా కలిసి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని పలు పెట్రోల్ బంకుల్లోనూ మోసాలకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి వివిధ పోలీసుస్టేషన్లలో వీళ్లపై కేసులు కూడా నమోదయ్యాయి. అయితే, నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై శెట్టిపాలెం ఎక్స్‌రోడ్డులో శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో అడ్డుకున్న వేములపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలు బయటపెట్టారు. నిందితుల నుంచి రూ.1.80లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, బైక్, క్రెడిట్‌కార్డును స్వాధీనం చేసుకున్నారు.

గోదావరి-పెన్నా-కావేరీ అనుసంధానంపై దృష్టి

- ప్రతిపాదనలను సిద్ధం చేసిన ఏపీ సర్కారు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ప్రధాని మోదీ గోదావరి - కావేరి నదుల అనుసంధానంపై దృష్టి సారించారు. పెన్నాబేసిన్‌లోకి గోదావరి జలాలను తీసుకెళ్లి, అక్కడినుంచి కావేరిలో కలవాలనేది కేంద్రం ప్రతిపాదన. ఈ మేరకు చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధంచేసింది. ఇందులో భాగంగా కేంద్రం... ప్రకాశం జిల్లా బొల్లాపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తుంది. అక్కడినుంచి అవుకు, సోమశిల ఫోర్‌షోర్ మీదుగా కండలేరుకు గోదావరి జలాలను పంపి.. కావేరికి కలుపుతారు. అంతిమంగా చెన్నైకు 50టీఎంసీల జలాలను అందుతాయి. గతంలో ఇచ్చంపల్లి నుంచి కావేరిదాకా నదుల అనుసంధాన ప్రక్రియకు వేసిన అంచనా వ్యయం రూ.95 వేల కోట్లు. తాజాగా రాష్ట్రం ప్రతిపాదించిన కొత్త అనుసంధాన ప్రక్రియ అంచనా వ్యయం రూ.25,000 కోట్లు మాత్రమే.

సీబీఎఫ్ కింద ఒక్కో జిల్లాకు

కోటి మంజూరు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): 'క్రూషియల్ బ్యాలెన్సింగ్ ఫండ్(సీబీఎఫ్)' కింద జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి చొప్పున మంజూరు చేసింది. 33 జిల్లాలకు రూ.33 కోట్ల నిధులను కేటాయించింది. ఈ మేరకు ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధుల వ్యయ బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు.

అక్రమ మైనింగ్‌పై లేఖలే వ్యాజ్యాలు

- సుమోటోగా స్వీకరించిన హైకోర్టు
- ఉత్తరాలు రాసిన కరీంనగర్, కామారెడ్డి జిల్లాల వ్యక్తులు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా జరుగుతున్న గ్రానైట్ మైనింగ్, ఇసుక తవ్వకాలకు సంబంధించి అందిన రెండు వేర్వేరు లేఖలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈపిటిషన్‌లపై ఈనెల 5న విచారణ చేపట్టనుంది. కరీంనగర్ జిల్లా బావ్‌పేట్ కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ వద్ద అక్రమంగా గ్రానైట్ మైనింగ్ చేస్తున్నారని, దీనివల్ల తీవ్ర వాతావరణ కాలుష్యం ఏర్పడుతోందని పేర్కొంటూ కరీంనగర్‌కు చెందిన డీ అరుణ్ కుమార్ లేఖరాశారు. బాంబు బ్లాస్టింగ్‌ల వల్ల చుట్టుపక్కల పది గ్రామాల్లో నివసించే 40 వేలమందిపై ప్రభావం పడుతోందని తెలిపారు. కామారెడ్డి జిల్లా బిచుకుంద మండల పరిధిలోని షెట్లూరు పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ మైనింగ్ జోరుగాసాగుతోందని, ప్రైవేటు సెక్యూరిటీని పెట్టుకుని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని పేర్కొంటూ ఎ. ప్రకాశ్ మరో లేఖ రాశారు. కడ్గాం - షెట్లూర్ ప్రాంతాల్లో ఆరు క్వారీల్లో మైనింగ్ అనుమతులకు కాలంచెల్లిపోయినా మైనింగ్ కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ రెండు పిటిషన్‌ల లో టీజీఎండీసీ, గనులు, రెవెన్యూ, పోలీస్, ఆయా జిల్లా కలెక్టర్‌లను ప్రతివాదులుగా చేర్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

రణమా... రాజకీయమా?

తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలకూడదన్న ధోరణిలో కొనసాగుతున్నాయి. రాష్ట్రం విడిపోక ముందు అధికార విపక్షాలు కలివిడిగా ఉండేవి. 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించినప్పుడు శాసనసభ లోపలా, వెలుపలా అప్పుడప్పుడూ ఉభయ పక్షాల మధ్యా ఉద్రిక్త పరిస్థితులు కనిపించేవి కానీ, ఇప్పటిలా ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు ముఖాముఖి కలుసుకోలేని పరిస్థితులు ఉండేవి కావు. రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అధికార విపక్షాల మధ్య దూరం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో కీలక అంశాలపై ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాలను నిర్వహించి నిర్ణయాలు తీసుకొనేది. రాష్ట్రం విడిపోయాక అఖిలపక్ష సమావేశాలు జరగడాన్ని చూడలేదు. రానురానూ ఈ పరిస్థితి మరింత వికటించి శాసనసభ లోపలా వెలుపలా ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కళ్లలో కళ్లు పెట్టి చూసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కేసీఆర్ ప్రతిపక్షాలకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇచ్చేవారు కాదు. 2014–2018 మధ్య విపక్ష కాంగ్రెస్ నాయకుడిగా జానారెడ్డి ఉండేవారు. అప్పట్లో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచారు. గతంలో శాసనసభ సమావేశాల ప్రారంభం రోజు అధికార, విపక్షాల నాయకులు అల్పాహార విందులో పాల్గొనేవారు. సమావేశాల ముగింపు సందర్భంగా కూడా ఉమ్మడిగా విందులో పాల్గొనేవారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఈ సంప్రదాయం దాదాపు కనుమరుగైంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగా ప్రతిపక్ష నాయకుడి స్థానంలో జగన్మోహన్ రెడ్డి ఉండేవారు. ఆ రాష్ట్రంలో కూడా అఖిలపక్ష సమావేశాలు జరగనే లేదు. అధికారిక కార్యక్రమాల్లో ప్రతిపక్ష నాయకుడు పాల్గొన్న దాఖలాలు లేవు. రాజధానిగా అమరావతిని ఎంపిక చేసే ముందు కూడా అఖిలపక్ష సమావేశం జరగలేదు. శాసనసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య నిత్యం యుద్ధం జరిగేది. అదే సమయంలో తెలంగాణ శాసనసభ సమావేశాలు కొంత సాఫీగా సాగేవి.

> శాసనసభలో పోరు ప్రస్తుతానికి కాంగ్రెస్ – బీఆర్ఎస్ మధ్య కేంద్రీకృతం కావడంతో భారతీయ జనతా పార్టీ పరిస్థితి స్తబ్దుగా ఉంది. ఆ పార్టీ ఎప్పుడు ఎటువంటి ఎత్తుగడలు అనుసరిస్తుందో తెలియదు. బీజేపీ తేరుకొనేలోపే ప్రధాన ప్రతిపక్షంగా మరింత బలపడే ప్రయత్నాలను బీఆర్ఎస్ మొదలెట్టింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన యంత్రాంగాన్ని, మంత్రాంగాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలి. రేవంత్ రెడ్డి పాలనలో బీఆర్ఎస్ ముఖ్యులు ఉక్కపోతకు గురవుతుండవచ్చు గానీ ప్రజాస్వామ్యప్రియులు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని చొప్పించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ప్రజల్లో ఫీల్ గుడ్ భావన లోపిస్తుంది. రాజకీయ వైషమ్యాలే పాలకులకు, ప్రతిపక్షాలకు ప్రధాన ఎజెండా కాకూడదు. అదే జరిగితే భారతీయ జనతా పార్టీ ఉండనే ఉంది.

విపక్షంపై విరుచుకుపడుతూ...

2018 తర్వాత కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిగా రెండోసారి బాధ్యతలు చేపట్టాక అధికార, ప్రతిపక్షాల మధ్య దూరం మరింత పెరిగింది. ఆపరేషన్ ఆకర్ష్‌ను ఉద్యమంగా చేపట్టిన కేసీఆర్... కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారు. రేవంత్ రెడ్డికి శాసనసభలో గతంలో నోరెత్తే అవకాశం లేకుండా చేశారు. ఎప్పటికప్పుడు సభ నుంచి సస్పెండ్ చేసి పారేసేవారు. సభలో రేవంత్ రెడ్డి ముఖం చూడ్డం కూడా ఇష్టం లేదన్నట్టుగా కేసీఆర్ వ్యవహరించేవారు. కాంగ్రెస్ సభ్యులను చీటికి మాటికీ సస్పెండ్ చేసేవారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితులు మరింత వికటించాయి. 2019 ఎన్నికల్లో ప్రజలు తనకు 23 సీట్లు మాత్రమే ఇచ్చినప్పటికీ చంద్రబాబు నాయుడు కుంగిపోకుండా, సభకు హాజరవడాన్ని నామోషీగా భావించకుండా శాసనసభ సమావేశాలలో పాల్గొన్నారు. అధికారంలో ఉన్న వైసీపీ అడుగడుగునా అవమానించినా భరించారు. చివరకు తన సతీమణిని నిండు సభలో అవమానించడంతో తట్టుకోలేక కౌరవసభగా మారిన శాసనసభలోకి తిరిగి ముఖ్యమంత్రిగానే అడుగుపెడతానని శపథం చేసి సభను బహిష్కరించారు. ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు అధికారం తలకెక్కి అహంకారపూరితంగా వ్యవహరించిన కేసీఆర్, జగన్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారు. అయితే... నాడు అధికార దర్పం వెలగబెట్టిన ఈ ఇరువురూ కూడా ప్రతిపక్ష నాయకులుగా శాసనసభ సమావేశాలలో పాల్గొనడానికి ఇష్టపడటం లేదు. తెలంగాణలో ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్‌కు గుర్తింపు ఉంది. అందుకు తగిన సంఖ్యా బలం ప్రజలు ఆయనకు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష నాయకుడి హోదా పొందడానికి అవసరమైన సంఖ్యా బలాన్ని ప్రజలు ఇవ్వలేదు. తనకు ఏమాత్రం ఇష్టం లేని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థానంలో ఉండటాన్ని జీర్ణించుకోలేని స్థితిలో ఉన్న కేసీఆర్ శాసనసభ సమావేశాలకు హాజరు కావడంలేదు. అయితే, తాను సభకు హాజరు కాబోవడంలేదని మాత్రం ఆయన ఇంతవరకు ప్రకటించలేదు. జగన్మోహన్ రెడ్డి అలా కాకుండా... సంఖ్యా బలం లేకపోయినా తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే శాసనసభకు హాజరు కాబోనని ప్రకటించారు. నాకు చాక్లెట్ కొనివ్వకపోతే బడికి వెళ్లనని విద్యార్థి మారాం చేసినట్టుగా ఆయన వ్యవహరిస్తున్నారు. 2019లో తెలుగుదేశం పార్టీ తరఫున 23 మంది శాసనసభ్యులు మాత్రమే ఎన్నికైనప్పటికీ వెరవకుండా చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించిన విషయం తెలిసి కూడా కేసీఆర్, జగన్మోహన్ రెడ్డిలు శాసనసభకు హాజరు కాకపోవడం వింతగా ఉంది. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి కూడా ప్రతిపక్ష స్థానంలో కూర్చోవడాన్ని నామోషీగా భావించలేదు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్నారు. అయినా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్న ఆయన ఏకంగా శాసనసభ మీదే అలిగారని భావించాల్సి ఉంటుంది. ఇక జగన్మోహన్ రెడ్డి విషయానికి వస్తే... ఐదేళ్లపాటు రారాజుగా వ్యవహరించిన తాను ప్రతిపక్షంలో కూర్చోవడం ఏమిటి? నాన్సెన్స్! అని భావిస్తున్నట్టు ఉంది. 1994 ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి కూడా ప్రధాన ప్రతిపక్ష హోదా పొందడానికి అవసరమైన సంఖ్యా బలం లభించలేదు. అయినప్పటికీ ఆనాడు దివంగత పి. జనార్దన్ రెడ్డి శాసనసభలో కాంగ్రెస్ పక్ష నాయకుడిగా ప్రభుత్వంపై పోరాడారు. జగన్మోహన్ రెడ్డిలో ఈ స్ఫూర్తి కొరవడింది.

> 2019లో తెలుగుదేశం పార్టీ తరఫున 23 మంది శాసనసభ్యులు మాత్రమే ఎన్నికైనప్పటికీ వెరవకుండా చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించిన విషయం తెలిసి కూడా కేసీఆర్, జగన్మోహన్ రెడ్డిలు శాసనసభకు హాజరు కాకపోవడం వింతగా ఉంది.

సభలో సెగలు...

తెలంగాణలో అధికార మార్పిడి జరిగి ఎనిమిది నెలలే అయింది. అయినప్పటికీ తెలంగాణ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. శుక్రవారంతో ముగిసిన శాసనసభ సమావేశాలలో చోటుచేసుకున్న సంఘటనలే ఇందుకు నిదర్శనం. కేసీఆర్ హయాంతో పోల్చితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం శాసనసభలో ప్రజాస్వామ్య బద్ధంగానే వ్యవహరిస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన భారత రాష్ట్ర సమితికి తగిన సమయం కేటాయిస్తోంది. కీలకమైన అంశాలపై కోరినంత సమయం ఇస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా రాత్రులు పొద్దుపోయే వరకు సమావేశాలను నిర్వహించింది. మైక్ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు కొట్లాడే పరిస్థితిని అధికార కాంగ్రెస్ పార్టీ కల్పించడం లేదు. అయినప్పటికీ సభలో చివరి రెండు రోజుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓటుకు నోటు కేసులో తాము అరెస్టు చేసి జైల్లో పడేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉండటాన్ని కేసీఆర్ మాత్రమే కాదు— బీఆర్ఎస్‌కు చెందిన ఇతర ముఖ్యులు కూడా సహించలేక పోతున్నట్టుగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సభలోనే 'రేవంత్ రెడ్డీ' అని కేటీఆర్ ఏకవచనంతో సంబోధించారు. అధికార కాంగ్రెస్ సభ్యులు దీనిపై ఆక్షేపించగా, ఒకప్పుడు తానూ రేవంత్ మంచి మిత్రులమని, గత పదేళ్లుగా తమ మధ్య చెడిందని, అందుకే గత చనువుతో పేరుతో సంబోధించానని కేటీఆర్ వివరణ ఇచ్చారు. అయితే ఈ వివరణ ఆకుకు అందకుండా పోకకు పొందకుండా ఉంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆయనను సభలో 'మా బాపు లేదా మా నాన్న' అని ఎప్పుడూ సంబోధించలేదు. 'గౌరవ ముఖ్యమంత్రి' అని మాత్రమే అనేవారు. కేసీఆర్ కూడా తన కుమారుడిని 'గౌరవ మంత్రి' అని మాత్రమే సంబోధించేవారు. అంతేగానీ ఇంట్లో పిలుచుకున్నట్టు అరే తురే అని సంబోధించలేదు. సభాసంప్రదాయాలు అలాగే ఉంటాయి. ఉండాలి కూడా! రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి మనసులో ఎక్కడో అయిష్టం ఉన్నందునే డిఫెన్స్ బదులు అఫెన్స్ పాత్ర పోషించాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నట్టు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరదాగా, యథాలాపంగా చేసిన ఒక వ్యాఖ్యకు విపరీత అర్థాలు తీయడమే ఇందుకు నిదర్శనం. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతున్నప్పుడు రేవంత్ రెడ్డి కల్పించుకొని, 'మీ వెనుక కూర్చున్న అక్కల మాట వింటే మీ పరిస్థితి జూబిలీ బస్టాండ్ అవుతుంది' అని వ్యాఖ్యానించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని ఉద్దేశించి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు మహిళలను అవమానించడమేనని, ముఖ్యమంత్రికి మహిళలంటే గౌరవం లేదని బీఆర్ఎస్ సభ్యులు ఎదురుదాడి చేసే ప్రయత్నం చేశారు. సభ లోపలా వెలుపలా నిరసన వ్యక్తం చేశారు. తనను అవమానించారని సబితా ఇంద్రారెడ్డి కన్నీరు పెట్టుకోవడం కూడా జరిగింది. నిజానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలలో ఆక్షేపించాల్సింది ఏమీ లేదు. ఫలానా వాళ్ల మాటలు వింటే చెడిపోతావు అని మనం అనడం సహజం. రేవంత్ వ్యాఖ్యలను కూడా ఆ కోవలోనే చూడాలి. అంతేకాదు, రేవంత్ రెడ్డి ట్రాక్ రికార్డ్ పరిశీలిస్తే... ఆయన మహిళల పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించిన లేదా వారిని అవమానించిన సందర్భాలు లేవు. దీంతో బీఆర్ఎస్ ప్రయత్నం ఫలించలేదు. పనిలో పనిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 'ఏ ముఖం పెట్టుకొని ఇప్పుడు మాట్లాడుతున్నారు' అని చేసిన వ్యాఖ్యను కూడా అనుకూలంగా మలచుకొనే ప్రయత్నాన్ని కేటీఆర్ అండ్ కో చేసింది. వాస్తవానికి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జరిగిన సంఘటనలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి పూసగుచ్చినట్టు వివరించడంతో బీఆర్ఎస్సే ఆత్మరక్షణలో పడింది. మహిళలను అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్ క్షమాపణలు చెప్పాలంటూ బీఆర్ఎస్ చేసిన ఆందోళనలను కూడా ప్రజలు పట్టించుకోలేదు. దీంతో బీఆర్ఎస్ అందుకున్న ఆయుధం పనిచేయలేదు. అయితే... సమావేశాల చివరి రోజు బీఆర్ఎస్ తరఫున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు మాత్రం అధికారపక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. దానం నాగేందర్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయి. వీధి పోరాటాల సందర్భంగా వాడే భాషను ఆయన వ్యాఖ్యలు తలపించాయి. మజ్లిస్ నాయకుడు అక్బరుద్దీన్ జోక్యంతో దానం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. ఇలాంటి భాషను నిన్నటి వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో విన్నాం. ఇప్పుడు ఆ రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. జగన్మోహన్ రెడ్డి సభకు హాజరు కావడం లేదు కనుక సభలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడం లేదు. గత ఎన్నికల వరకు తెలంగాణ శాసనసభ సమావేశాలు కూడా ప్రశాంతంగానే సాగాయి. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కేసీఆర్ కుటుంబానికి మధ్య నెలకొన్న వైరం ఇందుకు కారణం కావచ్చు.



> ఓటుకు నోటు కేసును అడ్డుపెట్టుకొని కేసీఆర్ కర్కశంగా వ్యవహరించడం వల్లనే ప్రజల్లో రేవంత్ రెడ్డి పట్ల సానుభూతి ఏర్పడింది. అంతిమంగా అది ఆయన ముఖ్యమంత్రి కావడానికి దోహదపడింది. ఈ వాస్తవాన్ని రేవంత్ విస్మరించ కూడదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను ఢీకొనగల సత్తా రేవంత్ రెడ్డిలో లేకపోలేదు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తమను అవమానిస్తున్నారన్న భావన బీఆర్ఎస్‌కు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలతోపాటు కార్యకర్తల్లో కూడా నెలకొన్నది. ఈ కారణంగానే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన వాళ్లు కొంతమంది భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చారు. ఫలితంగా కాంగ్రెస్‌తో సమానంగా బీజేపీ కూడా ఎనిమిది సీట్లు గెలుచుకుంది. తనలో రాజకీయంగా కసి రగలడానికి కారణం ఎవరు? ఏమిటి? అనేది గుర్తించి అవతలి వారిలో కూడా తనపై కసి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకొనే విషయం రేవంత్ రెడ్డి ఆలోచించాలి.

కేసీఆర్ సభకు వస్తే...

కేసీఆర్ సభకు హాజరైతే తెలంగాణ శాసనసభ సమావేశాలు కచ్చితంగా మరింత ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా ఉండేవి. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించినట్టుగా మజా వచ్చేది. కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావ్ మంచి స్పీకర్లు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఆ స్థాయి వాక్చాతుర్యం ఉన్నవాళ్లు అతికొద్ది మంది మాత్రమే ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నప్పటికీ ఆ స్థాయిలో వాక్చాతుర్యం ఉన్నవాళ్లుగానీ, సై అంటే సై అనగలిగే వాళ్లు గానీ కాంగ్రెస్‌లో తక్కువే. నిజం చెప్పాలంటే కేసీఆర్ సభకు వచ్చి కేటీఆర్, హరీశ్‌లను కుడి ఎడమల కూర్చోబెట్టుకొని అధికార పక్షంపై మాటల యుద్ధానికి దిగితే ప్రభుత్వం ఎంతో కొంత ఆత్మరక్షణలో పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుకు వాక్చాతుర్యం లేకపోయినా, ఆ శక్తి ఉన్నవాళ్లను ప్రోత్సహిస్తూ ప్రతిపక్ష పాత్రను పోషించేవారు. జగన్మోహన్ రెడ్డి వ్యవహారం మొరటుగా ఉంటుంది. అంచేత ఆయన సభకు హాజరైనప్పటికీ చర్చలు రసవత్తరంగా సాగే అవకాశం లేదు. వైసీపీ తరఫున గెలిచిన పదకొండు మందిలో మాటకారితనం ఉన్న వాళ్లు ఉన్నారో లేదో తెలియదు. బూతు భాషకు అలవాటు పడిన వారందరూ తాజా ఎన్నికల్లో ఓడిపోయారు కనుక ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఇప్పుడు బూతులు వినపడకపోవచ్చు. మహాభారతంలో దుర్యోధనుడు పాండవులపై పగ పెంచుకోవడానికి... మయసభలో అడుగిడిన సందర్భంగా జరిగిన అవమానం ఒక కారణం. అలాంటి అనుభవం ఎదురు కాకపోయినా శాసనసభకు హాజరు కాకూడదని జగన్మోహన్ రెడ్డి నిర్ణయించుకోవడం వింతగా ఉంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కూడా తన సోదరుడి నిర్ణయాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. రాజకీయ పార్టీల మధ్య విభేదాలు ఉండటం సహజం. విద్వేషాలు ఏర్పడటం వాంఛనీయం కాదు. దురదృష్టవశాత్తు తెలుగు రాష్ట్రాలలో ఇదే పరిస్థితి ఉంది. అధికార ప్రతిపక్ష నాయకుల మధ్య వ్యక్తిగత స్థాయిలో వైషమ్యాలు నెలకొన్నాయి.

మారకపోతే అంతే..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పర్యాయం మరింత పరిణతి ప్రదర్శిస్తున్నారు. పర్యటనల సందర్భంగా హంగూ ఆర్భాటాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తన సభలకు జన సమీకరణలు చేయకూడదని నిర్ణయించుకోవడం నిజంగా ముదావహం. ఆయన మడకశిర నియోజకవర్గంలో జనసమీకరణ లేకుండా సాదాసీదాగా కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీరా రెడ్డి అభినందించడం గమనార్హం. అధికారం దక్కించుకున్న చంద్రబాబులోనే ఇంత మార్పు వచ్చినప్పుడు, అధికారం కోల్పోయిన జగన్ రెడ్డిలో ఏ మార్పూ కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పరదాల మాటున, పోలీసు రక్షణలో, పాఠశాలలకు సెలవులు ప్రకటింపజేసి, దుకాణాలను సైతం మూయించి, జనాలను బలవంతంగా తరలించి సభలు నిర్వహించినా ఎన్నికల్లో ఫలితం ఇవ్వలేదనే వాస్తవాన్ని జగన్ రెడ్డి గుర్తించడానికి నిరాకరించడం ఆయన మనస్తత్వానికి నిదర్శనం. ఎన్నికల్లో ఓడిపోయాక కూడా తనను కలవడానికి వచ్చిన కార్యకర్తలను కలుసుకోవడానికి నిరాకరిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు మరింత చేరువయ్యే ప్రయత్నం ఎవరైనా చేస్తారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడపాదడపా అయినా తరలించి తీసుకువచ్చిన వారిని కలుసుకుంటున్నారు. జగన్మోహన్ రెడ్డి కనీసం ఆ పని కూడా చేయడం లేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గతంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ తనను వేధించిన విషయాలను మరచిపోయి మరింత హుందాగా వ్యవహరించడం అవసరం. ప్రభుత్వంలో ఉన్నప్పుడు పనుల ఒత్తిడి ఉంటుంది. ఎల్లవేళలా అందరినీ సంతృప్తి పరచడం సాధ్యం కాదు. శాసనసభ లోపలా వెలుపలా ప్రతిపక్షాల పట్ల మరింత ఉదారంగా వ్యవహరిస్తే ప్రజలు హర్షిస్తారు. ప్రతిపక్షాలను పూచికపుల్లల కంటే హీనంగా చూసిన కేసీఆర్‌తో పోటీ పడాలనుకోకూడదు. ఓటుకు నోటు కేసును అడ్డుపెట్టుకొని కేసీఆర్ కర్కశంగా వ్యవహరించడం వల్లనే ప్రజల్లో రేవంత్ రెడ్డి పట్ల సానుభూతి ఏర్పడింది. అంతిమంగా అది ఆయన ముఖ్యమంత్రి కావడానికి దోహదపడింది. ఈ వాస్తవాన్ని రేవంత్ విస్మరించ కూడదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను ఢీకొనగల సత్తా రేవంత్ రెడ్డిలో లేకపోలేదు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తమను అవమానిస్తున్నారన్న భావన బీఆర్ఎస్‌కు చెందిన కొంత మంది ఎమ్మెల్యేలతో పాటు కార్యకర్తల్లో కూడా నెలకొన్నది. ఈ కారణంగానే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన వాళ్లు కొంతమంది భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చారు. ఫలితంగా కాంగ్రెస్‌తో సమానంగా బీజేపీ కూడా ఎనిమిది సీట్లు గెలుచుకుంది. తనలో రాజకీయంగా కసి రగలడానికి కారణం ఎవరు? ఏమిటి? అనేది గుర్తించి అవతలి వారిలో కూడా తనపై కసి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకొనే విషయం రేవంత్ రెడ్డి ఆలోచించాలి.

కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గుతోందా...

ఎనిమిది నెలల క్రితం ఎన్నికలు జరిగిన సమయంతో పోల్చితే కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ కొంత తగ్గినట్టుగా సమాచారం వస్తోంది. ఇందుకు రేవంత్ రెడ్డి మాత్రమే కారణం కాదు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రధాన బాధ్యత తీసుకోవాలి. ముఖ్యమంత్రికి తగిన స్వేచ్ఛ కూడా ఇవ్వడం లేదు. మంత్రులు, ముఖ్యంగా సీనియర్లు ఎవరికి వారే ముఖ్యమంత్రులుగా వ్యవహరిస్తున్నారు. మంత్రులకు స్వేచ్ఛ అవసరమేగానీ అది అపరిమితం కాకూడదు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి రాష్ట్రంలోని పరిస్థితులపై అవగాహన ఉన్నట్టుగా లేదు. ఆమె హైదరాబాద్‌లోనే అధిక సమయం గడుపుతున్నప్పటికీ పార్టీలో ఏం జరుగుతున్నదో పట్టించుకోవడం లేదు. అధిష్ఠానం అతి జోక్యం కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో నష్టం చేస్తున్నది. ఆ ఛాయలు ఇప్పటికే కనబడుతున్నాయి. జాతీయ స్థాయిలో ఇప్పుడిప్పుడే ప్రజాభిమానం చూరగొంటున్న రాహుల్ గాంధీ అప్పుడప్పుడయినా తెలంగాణలో పరిస్థితులను స్వయంగా సమీక్షించడం అవసరం. శాసనసభలో పోరు ప్రస్తుతానికి కాంగ్రెస్—బీఆర్ఎస్ మధ్య కేంద్రీకృతం కావడంతో భారతీయ జనతా పార్టీ పరిస్థితి స్తబ్దుగా ఉంది. ఆ పార్టీ ఎప్పుడు ఎటువంటి ఎత్తుగడలు అనుసరిస్తుందో తెలియదు. బీజేపీ తేరుకొనేలోపే ప్రధాన ప్రతిపక్షంగా మరింత బలపడే ప్రయత్నాలను బీఆర్ఎస్ మొదలెట్టింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన యంత్రాంగాన్ని, మంత్రాంగాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలి. రుణమాఫీ వంటి ప్రధాన హామీల విషయంలో మాట నిలబెట్టుకున్నప్పటికీ ప్రభుత్వంపై మొత్తంగా ప్రజల్లో సదభిప్రాయం నెలకొనేలా తగు చర్యలు తీసుకోని పక్షంలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడే ప్రమాదం ఉంది. రేవంత్ రెడ్డి పాలనలో బీఆర్ఎస్ ముఖ్యులు ఉక్కపోతకు గురవుతుండవచ్చు గానీ ప్రజాస్వామ్య ప్రియులు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని చొప్పించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో ప్రజల్లో ఫీల్‌గుడ్ భావన లోపిస్తుంది. రాజకీయ వైషమ్యాలే పాలకులకు, ప్రతిపక్షాలకు ప్రధాన ఎజెండా కాకూడదు. అదే జరిగితే భారతీయ జనతా పార్టీ ఉండనే ఉంది. తస్మాత్ జాగ్రత్త!

> బీఆర్ఎస్ తరపున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ సమావేశాల చివరి రోజు చేసిన వ్యాఖ్యలు అధికారపక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. దానం నాగేందర్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయి. వీధి పోరాటాల సందర్భంగా వాడే భాషను ఆయన వ్యాఖ్యలు తలపించాయి. మజ్లిస్ నాయకుడు అక్బరుద్దీన్ జోక్యంతో దానం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. ఇలాంటి భాషను నిన్నటి వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో విన్నాం. ఇప్పుడు ఆ రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. జగన్మోహన్ రెడ్డి సభకు హాజరు కావడం లేదు కనుక సభలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడం లేదు. గత ఎన్నికల వరకు తెలంగాణ శాసనసభ సమావేశాలు కూడా ప్రశాంతంగానే సాగాయి. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కేసీఆర్ కుటుంబానికి మధ్య నెలకొన్న వైరం ఇందుకు కారణం కావచ్చు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

సామాజిక న్యాయభావనకు 'సుప్రీం' దండోరా

సామాజిక న్యాయభావనను ప్రోది చేయడానికి అవిశ్రాంత సంవాదం నడిపిన చరిత్ర తెలుగునేలకు ఉంది. బ్రిటిష్, నిజాం వ్యతిరేక పోరాటంలో ప్రగతిదాయక ఆలోచనా స్రవంతి పరిపక్వం చెందింది. నక్సల్బరీ రాజకీయాలు వర్గపోరాటమే కాకుండా, ఉపశ్రేణుల ఆకాంక్షల చుట్టూ ఆవరించిన ప్రశ్నలకు పదును పెట్టాయి. ఎనభైయో దశకంలో వ్యక్తమయిన అస్తిత్వ ఉద్యమాలు విస్మరణకు గురైన సామాజిక సమూహాలలో రాజకీయ ఎరుకను తీసుకొచ్చాయి. 1984లో ఏర్పడిన బీఎస్పీ తెలుగు నేల మీదకు వేగంగా చొచ్చుకొచ్చింది. ఈ పార్టీ ప్రవేశానికి కారంచేడు మాదిగల హననం నేపథ్యంగా పని చేసింది.

1994 మార్చిలో నిజాం కాలేజీ మైదానంలో దక్షిణ భారతదేశ ఆదిజాంబవ అరుంధతీయ సమాఖ్య ఆధ్వర్యంలో మాదిగల సభ జరిగింది. ఈ సభకు ఐఏఎస్ అధికారి వెంకటస్వామి అధ్యక్షత వహించాడు. ఆ సంస్థకు ప్రధాన కార్యదర్శిగా డా. మందా జగన్నాథం వ్యవహరించారు. సదాలక్ష్మమ్మ, టీవీ నారాయణ లాంటి పెద్దలు సభ కోసం కృషి చేసారు. ఈ సభలో సాధారణ ప్రేక్షకుడిగా మందకృష్ణ పాల్గొన్నాడు. ఎస్సీ రిజర్వేషన్ పంపకంలో ఉన్న అసమానతలను తెలియ చేస్తూ ఆ సభలో పంచిన కరపత్రం చదివి ప్రేరణ పొందిన మందకృష్ణ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికే ఆయన పీపుల్స్ వార్ పార్టీ నుంచి బయటకు వచ్చి ఆంధ్రప్రాంతంలో దళితుల మీద జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పని చేస్తున్నాడు. ముఖ్యంగా 1992 చీమకుర్తి గ్రానైట్ గనుల్లో ఏసమ్మ, రాములమ్మ అనే మాల యువతులను అగ్రకులం యువకులు అత్యాచారం చేసి చంపితే దానికి వ్యతిరేకంగా సమతా వాలంటీర్ ఫోర్స్ తరఫున పని చేయడానికి మందకృష్ణ అక్కడికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఈదుమూడి మాదిగ యువకులతో పరిచయం పెరిగి, వారి మధ్య జరిగిన అనేక చర్చల అనంతరం 7 జూలై 1994న ఎమ్మార్పీఎస్ అనే సంఘం ఏర్పడింది. 1995లో ఒంగోలు పట్టణంలో పదివేల మందితో వర్గీకరణ కోసం మొదటి బహిరంగసభ జరిగింది. ఈ సభకు సదాలక్ష్మమ్మ, ఐఏఎస్ అధికారి వెంకటస్వామి హాజరయ్యారు.

తలవంచుకొని చెప్పులు కుట్టి, శరీరాన్ని కళగా మార్చి డప్పులు కొట్టిన మాదిగలు మొదటిసారి సామూహికంగా నిర్మాణమయ్యారు. 1996లో నిజాం కాలేజీ మైదానాన్ని మాదిగలు తమ అంటరాని మట్టి పాదాలతో పావనం చేసారు. లక్షమందికి పైగా సభకు హాజరై తమ ఆకాంక్షను వ్యక్తం చేసారు. అదే సంవత్సరం ఆగస్టులో బషీర్‌బాగ్‌లోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద వేలాది మంది మాదిగలు నిరసన దీక్షకు దిగారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ పంపకంలో ఉన్న అసమానతలను అధ్యయనం చేయడానికి రామచంద్ర రాజు కమిషన్ నియమించింది. మూడు నెలల్లోనే ఆ కమిటీ తన నివేదికను ఇస్తూ మాదిగలకు జరిగిన అన్యాయాన్ని గణాంకాలతో సహా బయట పెట్టింది. ఈ నివేదికను అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని కృష్ణ మాదిగ నారావారి పల్లె నుంచి పాదయాత్ర చేసి లక్షలాదిమందితో హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధం చేసారు. ఫలితంగా ఎస్సీ రిజర్వేషన్‌ను ఏబీసీడీలుగా వర్గీకరణ చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఆ జీవోలో ఉన్న సాంకేతిక విషయాల ఆధారంగా హైకోర్టు అభ్యంతరాన్ని చెప్పింది. గవర్నర్ ఆర్డినెన్స్ ద్వారా రాష్ట్రపతి ఆమోదంతో 1999 చివర్లో మరో జీవో వచ్చింది. ఈ జీవోను సవాల్ చేస్తూ కొందరు సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారు. వి.చిన్నయ్య పేరు మీద కేసును ఫైల్ చేసారు. 2004 నవంబర్‌లో ఆర్టికల్ 341ను సాకుగా చూపుతూ ఆనాటి న్యాయమూర్తులు నాలుగేళ్లు అమలయిన చట్టాన్ని కొట్టి వేసారు. మాదిగలు తిరిగి రోడ్డు మీద దండోరా వేయక తప్పలేదు.

మందకృష్ణ మాదిగ నాయకత్వంలో కోర్టు లోపల, బయట జరిగిన పోరాటాల ఫలితంగా, పంజాబ్ ప్రభుత్వం చూపిన శ్రద్ధ వల్ల సుప్రీంకోర్టు తన పనిని వేగవంతం చేసింది. 2020 ఆగస్టులో జస్టిస్ అరుణ్‌మిశ్రాతో కూడిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం 2004 నాటి తీర్పును పూర్వపక్షం చేస్తూ రాజ్యాంగ ధర్మాసనానికి కేసును నివేదించాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఏర్పడిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఆర్టికల్ 341ను లోతుగా పరిశీలించి షెడ్యూల్డ్ జాబితాలో కొత్త కులాలను చేర్చడం, మినహాయించడం గురించి మాత్రమే ఈ ఆర్టికల్ చెబుతుంది, కనుక ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరించకూడదనే విషయాన్ని ప్రస్తావించలేదని ధర్మాసనం చెప్పింది. 2004లో వెలువరించిన తీర్పులోని న్యాయబద్ధతను ప్రశ్నించింది. రాజ్యాంగ ఫలాలను అందుకోవడంలో ఎస్సీ కులాల్లో ఆర్థిక, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయనే విలువైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

> తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పు అమలుకు సంబంధించి కార్యాచరణను వేగవంతం చేయడానికి పౌర సమాజం, ఉద్యమ శక్తులు చొరవ చూపవలసిన అవసరం ఉంది. ఈ విజయాన్ని సమస్త మాదిగల సొంతంగా భావించాలి. మూడు దశాబ్దాల పోరాటం కన్నీళ్లను, అవమానాలను, అమరత్వాన్ని కోరింది. కానీ అంతిమ విజయం సత్యవాక్యానిదేనని చరిత్ర రుజువు చేసింది.



సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాల సామాజిక వర్గానికి వ్యతిరేకమని, మాదిగ సామాజిక వర్గానికి అనుకూలమని భావించకుండా సామాజిక న్యాయభావనగా చూడవలసిన సందర్భమిది. మూడు దశాబ్దాలుగా ఈ రెండు సమూహాల మధ్యన ఎడం పెరిగి మానసికంగా దూరం పాటిస్తున్నారు. ఫలితంగా ఈ వర్గాలకు అందవలసిన రాజ్యాంగ ఫలాలకు అనేక పరిమితులను పాలకవర్గాలు కల్పిస్తున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పగిస్తూ రిజర్వేషన్లకు అవకాశం లేకుండా చేస్తున్నారు. భూమి, సంపదకు దళితులు రోజురోజుకు దూరమవుతున్నారు. రాజ్యాధికారంలో సామాజిక న్యాయం అమలు కావడంలేదు. ఉద్యోగాలలో ప్రమోషన్లలో అన్యాయం చేస్తూనే ఉన్నారు. రోస్టర్ పాయింట్‌ను సక్రమంగా అమలు చేయకుండా దళిత ఉద్యోగులకు పాలకులు తీరని నష్టం చేస్తున్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలు కోసం పోరాడవలసిన లక్ష్యం మిగిలే ఉంది. కనుక రిజర్వేషన్ వర్గీకరణ సమస్యకు ఇక్కడితో ముగింపు పలికి భవిష్యత్ కర్తవ్యాల మీద మాలమాదిగలు కలిసి కార్యాచరణకు దిగటానికి కావలసిన ప్రాతిపదికను రూపొందించుకునే ప్రయత్నాలు ఇరువైపుల నుంచి చొరవను చూపెట్టాలి. కారంచేడు, చుండూరు ఉద్యమాల సందర్భంలో వ్యక్తమైన ఐక్యతను ఈనాటి తరం కోరుతుంది.

మాదిగ మేధావులు, బుద్ధిజీవులు, మధ్యతరగతి ప్రజలు ఉదాసీనతను వీడి తమ సమాజాన్ని చైతన్యం చేయవలసిన బాధ్యతను చేపట్టాలి. ముప్పై ఏళ్లుగా ప్రబలిన అన్యవర్గ ధోరణులను సరిచేసుకోకపోతే ఈ సమూహం నష్టపోతుంది. ప్రధాన స్రవంతిలో అనేక మార్పులు వచ్చాయి. నైపుణ్యాలు పెరిగాయి. కనుక సామాజిక, రాజకీయ నిర్మాణాలలో మూసధోరణిని వర్తమానం అంగీకరించదు. మారుతున్న సమాజానికి కావలసిన నైపుణ్యాలను సంతరించుకునే ఆలోచనా స్రవంతిని మాదిగ సమూహంలో పాదుకొల్పవలసిన బాధ్యతను విద్యావంతులు చేపట్టాలి. రెండు సమూహాల మధ్య వైరుధ్యాలను సాధ్యమయినంత వరకు తగ్గించే ప్రయత్నాలు మొదలుపెట్టాలి. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పు అమలుకు సంబంధించి కార్యాచరణను వేగవంతం చేయడానికి పౌర సమాజం, ఉద్యమ శక్తులు చొరవ చూపవలసిన అవసరం ఉంది. ఈ విజయాన్ని సమస్త మాదిగల సొంతంగా భావించాలి. మూడు దశాబ్దాల పోరాటం కన్నీళ్లను, అవమానాలను, అమరత్వాన్ని కోరింది. కానీ అంతిమ విజయం సత్యవాక్యానిదేనని చరిత్ర రుజువు చేసింది.

• ప్రొఫెసర్ చింతకింది కాశీం



భగీరథ.. కబ్జా వ్యధ

- బహిరంగ మార్కెట్‌లో రూ.1500కోట్ల విలువ
- పత్రికలో వచ్చిన రోజే అధికారుల్లో కదలిక
- మరుసటి రోజునుంచి షరా మామూలే..
- అవకాశంగా తీసుకుంటున్న ఆక్రమణదారులు

ఇప్పటికే 20 ఎకరాలకు పైగా అన్యాక్రాంతం

కబ్జాలను తొలగించాల్సిన అధికారులు ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారు. కోట్ల విలువజేసే భూములను అప్పనంగా కాజేస్తున్నా వాటిపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో నీటితో కళకళలాడాల్సిన చెరువులు అన్యాక్రాంతమవుతున్నాయి. మట్టి దిబ్బలతో మొదలుపెట్టి రాత్రికి రాత్రే చెరువు హద్దులు మార్చి కడీలు పాతేస్తున్నారు.. ఇలా ఒకటా..! రెండా..! మహా నగర విస్తరణలో వందలాది చెరువులు కనుమరుగవ్వగా.. ప్రస్తుతం అదే జాబితాలో భగీరథ చెరువు చేరుతోంది. 54 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు దాదాపు 20 ఎకరాలకు పైగా శిఖం భూమి అన్యాక్రాంతమవుతున్నా ఆరేళ్లుగా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూడడం విడ్డూరం

రాయదుర్గం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లోని పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలో భగీరథ చెరువు 54ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. ఇందులో సాధారణంగా నీళ్లుండే ప్రాంతం 48ఎకరాలు కాగా, చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) మాత్రం 54ఎకరాలు. హెచ్‌ఎండీఏ నోటిఫైడ్ చేసిన చెరువుల్లో భగీరథ చెరువు ఒకటి. ఈ చెరువు విస్తీర్ణంలో కొంత మేర ప్రైవేటు భూమి ఉంది. కాగా, ఈ చెరువు 50శాతం మేర పుప్పాలగూడ గ్రామ పరిధిలో ఉండగా, మరో 50 శాతం చెరువు, శిఖం స్థలం నానక్‌రామ్‌గూడ, ఖాజాగూడ రెవెన్యూ గ్రామాల పరిధిలోకి వస్తుంది. భగీరథ చెరువు శిఖంలో నానక్‌రాంగూడ గ్రామ రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 151లోని 2.34ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఈ ప్రభుత్వ భూమికి ఆనుకొని ఉన్న పుప్పాలగూడ రెవెన్యూ గ్రామ పరిధిలోని భూమిని సుమారు 8 సంవత్సరాల క్రితం.. ఓ మాజీ ముఖ్యమంత్రి సోదరుడిగా చెప్పుకుంటున్న వ్యక్తి కొనుగోలు చేశాడు. ఆ వెంటనే దానికి ఆనుకొని ఉన్న నానక్‌రాంగూడ ప్రభుత్వ భూమిని రాత్రికి రాత్రే కబ్జా చేశాడు. ప్రహరీ నిర్మించి గేటును సైతం ఏర్పాటు చేశాడు. కబ్జా వ్యవహారానికి సంబంధించిన సమాచారం అందడంతో అప్పట్లో చెరువు శిఖం చెర అంటూ 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీంతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం మార్చి 2019లో కబ్జాకు గురైన స్థలం వద్దకు పోలీసు బందోబస్తుతో వెళ్లి కబ్జాదారులు నిర్మించిన ప్రహరీని కూల్చేశారు. గేట్లను తొలగించారు. ఇతరులెవ్వరూ చెరువు శిఖంలోని ప్రభుత్వ


చెరువు శిఖం స్థలంలో పాతిన మరో కడీ

స్థలంలోకి రాకుండా ఉండేందుకు ఎక్స్‌కవేటర్లతో కందకం తవ్వారు. ఇది ప్రభుత్వ భూమి అని సూచిక బోర్డును రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. అనంతరం కబ్జాదారులపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో కొద్దిరోజులు ఎలాంటి పనులు చేపట్టకుండా కబ్జాదారులు మిన్నకుండి పోయారు.

మే నెలలో మళ్లీ చెరువు కబ్జా..

రాష్ట్రంలో గతేడాది నవంబర్ నుంచి అధికార యంత్రాంగం అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల హడావుడిలో ఉండగా, ఇదే అదనుగా భావించి అక్రమార్కులు సర్వేనంబర్ 151లోని 2.34 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారు. ఈ స్థలం భగీరథ చెరువు శిఖంలో ఉండటంతో వందలాది టిప్పర్లతో మట్టిని తెచ్చి నింపారు. కబ్జా చేసి యథేచ్ఛగా ప్రహరీ గేటును ఏర్పాటు చేశారు. కొన్ని నెలల పాటు పనులు సాగుతున్నా కానీ ఎవరూ పట్టించుకోలేదు. దాంతో 'మళ్లీ కబ్జా' అనే శీర్షికతో మే 25న 'ఆంధ్రజ్యోతి' మరో కథనాన్ని ప్రచురించింది. దాంతో ఆగమేఘాల మీద కబ్జా స్థలాన్ని రంగారెడ్డి జిల్లా స్పెషల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి శేరిలింగంపల్లి తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ స్థలానికి ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన ప్రహరీనీ, గేటును రెవెన్యూ సిబ్బంది అధికారుల సమక్షంలో ఎక్స్‌కవేటర్లతో కూల్చేశారు. ఆ వెంటనే కబ్జాదారులు లగ్జరీ కార్లలో అక్కడికి చేరుకుని ఉన్నత స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చారు. దాంతో రెవెన్యూ అధికారులు కూల్చివేత

మిగతా 8వ పేజీలో..



శ్రీనివాసునిగా అవతరించిన మహావిష్ణువు లక్ష్మీదేవిని మనువాడే ఘట్టాన్ని వివరిస్తూ వేంకటేశ్వర కల్యాణ నృత్యరూపం నయనానందకరంగా సాగింది. శనివారం గచ్చిబౌలిలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో 30 మంది కళాకారులు చక్కటి అభినయంతో ఆహూతుల్ని రంజింపజేశారు. అక్షరస్కూల్ ఆఫ్ పెర్ఫామింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాట్యగురువు నిహంత్రి వెంకటేశ్వరుడిగా, త్రిష తాటిపాయుల పద్మావతి పాత్రలో నర్తించి ఆకట్టుకొన్నారు.
-రవీంద్రభారతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి)

ఎఫ్‌ఓసీ ఆటోలకు జీపీఎస్!

టోల్‌ఫ్రీ నంబర్ 1912 మరింత బలోపేతం

- ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా డిస్కం చర్యలు
- గ్రేటర్‌జోన్‌లో 213 ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లు, 213 ఆటోలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో విద్యుత్ ఫిర్యాదులను తక్కువ సమయంలో పరిష్కరించడంపై డిస్కం ప్రత్యేక దృష్టిసారించింది. విద్యుత్‌శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1912 ద్వారా కంట్రోల్‌రూమ్‌కు వచ్చే ఫిర్యాదులను సంబంధిత ఫ్యూజ్‌ఆఫ్ కాల్ సిబ్బంది(ఎఫ్‌ఓసీ)కి సత్వరమే అందించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఎఫ్‌ఓసీ సిబ్బంది వినియోగించే ఆటోలకు జియోగ్రాఫికల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్)ను దక్షిణ తెలంగాణ విద్యుత్

మిగతా 8వ పేజీలో..


ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సిబ్బంది వెళ్లే ఆటో

మురుగు శుద్ధి.. ఇక శరవేగంగా

- జంట జలాశయాల ఎగువన 4 ఎస్టీపీలు
- రూ.65 కోట్ల వ్యయంతో 9 నెలల్లో నిర్మాణం
- వాటర్‌బోర్డు ప్రతిపాదనకు సర్కారు ఓకే
- త్వరలో టెండర్.. ఆ వెంటనే పనులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహానగరానికి తాగునీటినందించే జంట జలాశయాలు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట)లోకి చుక్క మురుగునీరు చేరకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఈ జలాశయాల ఎగువన పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతుండడంతో భారీగా మురుగు వచ్చి చేరుతోంది. మరో హుస్సేన్‌సాగర్‌గా మారకముందే మురుగును వేగంగా శుద్ధి చేసి వదిలేందుకు వాటర్‌బోర్డు చేసిన

మిగతా 8వ పేజీలో..


సరూర్‌నగర్ ఎస్టీపీ (ఫైల్)

రూ.3,849 కోట్లతో 39 ఎస్టీపీలు

- నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు 8


వయనాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్న కె.నారాయణ

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి

మంగళ్‌హాట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కేరళలోని వయనాడ్‌లో ప్రకృతి సృష్టించిన విలయానికి వేలాది కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని, వారిని ఆదుకోవడం మనందరి సమష్టి బాధ్యత అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. బాధితుల సహాయార్థం శనివారం అబిడ్స్ ప్రధాన చౌరస్తాలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విరాళాలు సేకరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, కమతం యాదగిరి, బి.స్టాలిన్, బి.వెంకటేశ్ తదితరులతో కలిసి ఆయన అబిడ్స్, కోఠి, గన్‌ఫౌండ్రి, బషీర్‌బాగ్, లిబర్టీ తదితర ప్రాంతాల్లో విరాళాలు కోరారు.


పబ్‌లు, కార్పొరేట్ కళాశాలలు, ఐటీ కంపెనీల్లో..

డ్రగ్స్ టెస్టులు

- డ్రంకెన్ డ్రైవ్ తరహాలో ఆకస్మిక తనిఖీలు
- ప్రణాళికలు రూపొందిస్తున్న నార్కోటిక్ బ్యూరో

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ సరఫరా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్న నార్కోటిక్ బ్యూరో అధికారులు సరికొత్త కార్యక్రమానికి కార్యాచరణ రూపొందిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ తరహాలోనే డ్రగ్స్ పరీక్షలు నిర్వహించేందుకు వారు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా కార్పొరేట్ కాలేజీల విద్యార్థులు, ఐటీ కంపెనీ ఉద్యోగులు మత్తు బారిన పడుతున్నట్లు గుర్తించారు. దీంతో పబ్‌లు, క్లబ్‌లు, కళాశాలలు, కార్పొరేట్ స్కూల్స్, ఈవెంట్స్ జరుగుతున్న ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేయనున్నారు. ఆ ప్రదేశాన్ని సమూహంగా తీసుకొని ర్యాండమ్‌గా డ్రగ్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. గంజాయి తీసుకున్న వారిలో 4 వారాలు, డ్రగ్స్ తీసుకున్న వారిలో 3 నెలలపాటు మత్తు ఆనవాళ్లు ఉంటాయి. పరీక్షలో వచ్చిన ఫలితాన్ని బట్టి మాదక ద్రవ్యాలు తీసుకున్న వారిని గుర్తించి విచారిస్తారు. డ్రగ్స్ ఎవరు సరఫరా చేశారు ? ఎక్కడ కొన్నారు ? ఎంతమందితో కలిసి సేవిస్తున్నారు ? తదితర

మిగతా 8వ పేజీలో..

14 నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నర్ ఇంజనీరింగ్ కార్యక్రమాన్ని ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇన్నర్ ఇంజనీరింగ్, ప్రాచీన శాస్త్రాల నుంచి రూపొందించిన ఈ కార్యక్రమాన్ని తెలుగులో మారేడ్‌పల్లి, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, గచ్చిబౌలి, హిమాయత్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు bit.ly/ieuతెలుగు అయ్యి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 8277164555/8548027807 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

భారత్ ఎదుగుదలలో విద్యావ్యవస్థే కీలకం



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న టీజీ సీతారాం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ మూడో స్థానానికి చేరుకోవాలంటే విద్యావ్యవస్థ కీలకమని ఏఐసీటీఈ చైర్మన్ డాక్టర్ టీజీ సీతారాం అన్నారు. నార్సింగిలో శనివారం నిర్వహించిన ఇక్ఫాయ్ (ఐసీఎఫ్ఏఐ) 14వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమలులోకి వచ్చిన నూతన విద్యా విధానంలో 2035 వరకు ఉన్నత విద్యను పూర్తిచేసుకునేవారి సంఖ్య 50 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దాని కోసం ప్రస్తుతం ఉన్న యూనివర్సిటీలు, కళాశాలలు రెట్టింపు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అటార్నీ జనరల్ ఆర్ వెంకటమణికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ ఛాన్స్‌లర్ డాక్టర్ సీ రంగరాజన్, వీసీ ప్రొఫెసర్ ఎల్ఎస్ గణేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


టీటీడీ అదనపు ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న మధుసూదన్

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం

తిరుమల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.కోటి విరాళం అందింది. బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో వ్యాపారం నిర్వహిస్తున్న సుమధుర గ్రూప్ సీఎండీ మధుసూదన్ ఈ విరాళాన్ని తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. సంస్థ డైరెక్టర్లు భరత్‌కుమార్, నవీన్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధికి నిధులివ్వండి

రాజేంద్రనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులివ్వాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రిని సచివాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిప్రతం అందజేశారు. నియోజకవర్గంలోని గండిపేట్, శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాల్లో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను పూర్తిచేయడానికి నిధులు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



చార్మినార్ ప్రాంతంలో పర్యటిస్తున్న రాష్ట్ర ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ డా.రవీందర్ నాయక్

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- రాష్ట్ర ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్

హైదరాబాద్ సిటీ/చార్మినార్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని రాష్ట్ర ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ డా.రవీందర్ నాయక్ సూచించారు. వర్షకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చార్మినార్ ప్రాంతంలో శనివారం హైదరాబాద్ జిల్లా వైద్యశాఖ డీఎంఅండ్ హెచ్‌ఓ డా.వెంకటి, జీహెచ్‌ఎంసీ మలేరియా విభాగం చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబులతో కలిసి డా.రవీందర్ పర్యటించారు. చార్మినార్ పత్తర్‌గట్టి పటేల్ మార్కెట్‌లోని అగర్వాల్ శిక్షణ సమితి పాఠశాలలో విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. దోమలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యటించి దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డా.రవీందర్ నాయక్ మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకొని దోమలను పిల్ల దశలోనే అరికట్టాలన్నారు. మలేరియా అధికారులు అన్ని ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించి దోమల వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో చార్మినార్‌జోన్ మలేరియా విభాగం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామల శ్రీనివాస్, ఎస్‌పీహెచ్‌ఓ డా.శశికళ, యూపీహెచ్‌సీ వైద్యాధికారిని డా.అరుణ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

మీ పేరుతో డ్రగ్స్ పార్సిల్ దొరికింది

- డబ్బులు ఇవ్వకపోతే అరెస్టు చేస్తాం
- యువకుడికి సైబర్ నేరగాళ్ల బెదిరింపులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): 'మీ పేరుతో డ్రగ్స్ పార్సిల్ డెలివరీ అయింది. పూర్తి ఆధారాలు మా వద్ద ఉన్నాయి. పై అధికారులు చెప్పిన విధంగా నడుచుకొని అడిగినంతా డబ్బులు ఇవ్వాలి. లేదంటే అరెస్టు చేస్తామని' గుర్తుతెలియని వ్యక్తులు క్రైమ్ బ్రాంచి పోలీసుల్లా బెదిరించారు. అప్రమత్తమైన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన 23 ఏళ్ల యువకుడికి ఇటీవల గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. మీ పేరుతో ఒక పార్సిల్ డెలివరీ అయిందని, వివరాల కోసం ఒకటి నొక్కండి అని చెప్పారు. ఒకటి నొక్కగానే ఓ కొరియర్ సర్వీస్‌కు చెందిన కనెక్టు చేయబడింది. అవతలి వ్యక్తి మాట్లాడుతూ.. మీ పేరు, ఆధార్‌కార్డును చట్టవ్యతిరేకమైన డ్రగ్స్ పార్సిల్ పంపడానికి వినియోగించారని, దాంతో మీపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారని చెబుతూ కాల్‌ను మరొకరికి బదిలీ చేశారు. క్షణాల్లో మరోవ్యక్తి పోలీస్ అధికారిగా నటిస్తూ.. ఈ డ్రగ్ పార్సిల్‌కు మీకు ఎలాంటి సంబంధం లేనట్టయితే, వెంటనే ఈ కేసు నుంచి మీ పేరు తొలగించుకోండి. లేదంటే అరెస్టు చేయాల్సి ఉంటుందని హెచ్చరించాడు. మీ పేరు తొలగించాలంటే ముగ్గురు అధికారులకు చెప్పాల్సి ఉంటుందన్నారు. అందుకోసం మీరు వెంటనే రూ. 5లక్షలు తాము చెప్పిన ఖాతాలో వేస్తే మీ పేరు తొలగించి కేసు నుంచి తప్పిస్తారని చెప్పారు. లేదంటే ఏ క్షణమైనా అరెస్టు చేస్తామని హెచ్చరించారు. అనుమానం వచ్చిన యువకుడు సిటీసైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా సైబర్ క్రిమినల్స్‌ను గుర్తించే పనిలో పడ్డారు.

102 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్

చార్మినార్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం, గోధుమలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్, భవానీనగర్ పోలీసులు, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా శనివారం రెండు చోట్ల దాడులు చేశారు. నషేమ్‌నగర్‌కు చెందిన షేక్ రషీద్, కుమారుడు షేక్ అయాజ్‌తో కలిసి నగరంలోని పలు ప్రాంతాలలో కార్డుదారుల నుంచి రేషన్ బియ్యం, గోధుమలు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. వాటిని ఇంట్లో నిల్వ ఉంచి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. అమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అక్తర్ స్థానికంగా కిరాణ షాపు నడుపుతున్నాడు. అతడు కూడా రేషన్ బియ్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తుంటాడు. నిఘాపెట్టిన పోలీసులు శనివారం దాడులు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 102 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 31 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం చేసుకున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు .. ఏడేళ్ల బాలుడు మృతి

- తండ్రికి గాయాలు

కార్వాన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన కారు.. బైక్‌ను ఢీకొట్టడంతో ఏడేళ్ల బాలుడు మృతిచెందాడు. ఈ ప్రమాదం గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇబ్రహీంబాగ్ వైఎస్ఆర్‌నగర్ కాలనీలో ఉంటున్న రమేశ్, సంగీత భార్యాభర్తలు. వారికి కుమారుడు సూర్య(7) లిటిల్ ఫ్లవర్ పాఠశాల్లో 1వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం కుమారుడిని బైక్‌పై ఎక్కించుకుని తండ్రి ఇబ్రహీంబాగ్ నుంచి నెక్నాంపూర్ వైపునకు వెళ్తున్నాడు. ఎదురుగా వేగంగా వచ్చిన కారు... బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలనే బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి రమేశ్‌కు గాయాలు అయ్యాయి. స్థానికులు కారు డ్రైవర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కారులో మద్యం బాటిళ్లు లభించాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన కారు

హైదర్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కారును వెనక్కి తిప్పుతుండగా అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన హైదర్‌నగర్ డివిజన్ అంబీర్ చెరువు వద్ద శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ నుంచి ప్రగతినగర్ వైపుగా వెళ్తున్న కారు చెరువు ప్రారంభంలో టర్న్ చేసుకునే క్రమంలో అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను కాపాడారు. స్థానికుల సహాయంతో యజమాని కారును బయటకు తీశారు. కారు ముందుభాగం పాక్షికంగా దెబ్బతినడంతో పాటు కారులోకి పూర్తిగా నీరు వెళ్లడంతో కారు పాడయింది.

సైబరాబాద్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

- శుక్రవారం పట్టుబడ్డ 309 మంది

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో 309 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో 261 మంది ద్విచక్రవాహనదారులు, 11 మంది ఆటోడ్రైవర్లు, 36 మంది కార్లు నడిపేవారు. ఒక భారీ వాహన డ్రైవర్ ఉన్నారు. మాదాపూర్‌లో 17 మంది, రాయదుర్గంలో 13 మంది, గచ్చిబౌలిలో ఆరుగురు, నార్సింగ్‌లో 13 మంది, రాజేంద్రగర్‌లో 35మంది, శంషాబాద్‌లో 20 మంది, చేవెళ్లలో 18 మంది, షాద్‌నగర్‌లో 10 మంది, మియాపూర్‌లో 52 మంది, కూకట్‌పల్లిలో 13మంది, బాలానగర్‌లో 21 మంది, జీడిమెట్లలో 16 మంది, అల్వాల్‌లో 22 మంది, కేపీహెచ్‌బీలో 8 మంది, మేడ్చల్‌లో 17 మంది, ఆర్‌సీపురంలో 28 మంది డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు.

'నిజాం' హాస్టల్‌లో
డిగ్రీ విద్యార్థినులకే అవకాశమివ్వాలి

- పీజీ విద్యార్థినులకు ఓయూలో వసతి కల్పించాలి
- ప్రిన్సిపాల్ బెదిరింపులకు భయపడేది లేదు
- నిజాం కళాశాల విద్యార్థుల ఐక్య సంఘటన

బర్కత్‌పుర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నిజాం కళాశాలలోని బాలికల హాస్టల్‌లో డిగ్రీ విద్యార్థునులకే అవకాశం ఇవ్వాలని నిజాం కళాశాల విద్యార్థుల ఐక్య సంఘటన డిమాండ్ చేసింది. పీజీ విద్యార్థినులకు హాస్టల్ అడ్మిషన్లలో అధికప్రాధాన్యత ఇవ్వడంవల్ల డిగ్రీ విద్యార్థునులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి డిగ్రీ విద్యార్థునులకు న్యాయం చేయకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు. శనివారం నిజాం కళాశాలలో డిగ్రీ విద్యార్థులు ఆందోళనకు దిగి, ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నిజాం కళాశాలలో నిర్మించిన బాలికల హాస్టల్‌లో 400 సీట్లు ఉన్నాయి. వాటిల్లో సగం పీజీ విద్యార్థునులకు కేటాయించడంతో, డిగ్రీ విద్యార్థునులకు హాస్టల్‌లో అడ్మిషన్‌లో లభించక అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. ఈ విద్యా సంవత్సరం నిజాకళాశాలలో డిగ్రీ అడ్మిషన్లు బాగా పెరిగాయన్నారు. పీజీ విద్యార్థునులకు ఓయూలో వసతి కల్పించి, నిజాం కళాశాల బాలికల హాస్టల్‌లో పూర్తిగా డిగ్రీ విద్యార్థునులతోనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.



నిజాం కళాశాలలో ధర్నా చేస్తున్న డిగ్రీ విద్యార్థులు

కళాశాల ప్రిన్సిపాల్ నిరంకుశంగా వ్యవహరిస్తూ, భయపెడుతున్నారని వారు ఆరోపించారు. ప్రిన్సిపాల్ బెదిరింపులకు భయపడేది లేదని, డిగ్రీ విద్యార్థునులకు న్యాయం జరిగేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

'స్వచ్ఛదనం- పచ్చదనం'ను విజయవంతం చేయాలి

చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న



సమావేశంలో జోనల్ కమిషనర్ వెంకన్న, వివిధ విభాగాల అధికారులు

మదీన, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో పచ్చదనాన్ని పెంచేందుకు ఈనెల 5 నుంచి 9వ వరకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం చాంద్రాయణగుట్ట పూల్‌బాగ్‌లోని తన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదురోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో ఆరోగ్యం, పారిశుధ్యం, యూసీడీ, అర్బన్ బయోడైవర్సిటీ, ట్యాక్స్, ఎంటమాలజీ విభాగాలతో బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 5న పారిశుధ్య సమస్యల పరిష్కారానికి బస్తీలు, కాలనీలు, వాణిజ్య సముదాయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, శ్మశానవాటికలు, పార్కులు, ప్లేగ్రౌండ్లలో ప్రత్యేక కార్యక్రమాలు, 6న దోమల నివారణకు ఫాగింగ్, వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు, 7న నీటి నిల్వలు, చెరువులు, బావులు, పరిశుభ్రత, 8న డ్రైనేజీ, నాలాల పూడికతీత, కమ్యూనిటీ హాళ్ల నిర్వహణ సమావేశాలు ఉంటాయన్నారు. 9న వన మహోత్సవం సందర్భంగా అన్ని బస్తీలు, కాలనీలు, విద్యాసంస్థల్లో మొక్కలను పంపిణీ చేస్తామన్నారు.

సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు జయంత్, సురేందర్, సరిత, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ సీపీ శ్యామ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి : డీసీ

రాజేంద్రనగర్, (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో విజయవంతం చేయాలని డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సూచించారు. శనివారం వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సర్కిల్ కార్యాలయంలో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డి

పహాడిషరీఫ్ ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డి చెప్పారు. మన మహోత్సవంలో భాగంగా శనివారం శ్రీరాం కాలనీ, గ్రీన్‌సిటీలో జామ, సీతాఫలం తదితర పండ్ల మొక్కలను కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, ప్రశాంతి శ్రీధర్ గౌడ్, అధికారులతో కలసి ఆమె మొక్కలు నాటారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటి సిబ్బంది శ్రీనివాస్, కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

రాజేంద్రనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మైలార్‌దేవుపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ సూచించారు. లక్ష్మీగూడ... రాజీవ్ గృహకల్ప పింక్ బిల్డింగ్‌లలోని దుకాణాలలో గంజాయి, గుట్కా విక్రయిస్తున్నట్టు సమాచారం పోలీసులకు అందింది. శుక్రవారం రాత్రి పోలీసులు దుకాణాలలో సోదాలు చేశారు. నిషేధిత గుట్కాలు, గంజాయి సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ నరేందర్ హెచ్చరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

'నేరాలపై అవగాహన కలిగి ఉండాలి'

మదీన, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న నేరాలు, దొంగతనాలు, చోరీలపై చాంద్రాయణగుట్ట పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం ఎస్ఐ అంటోనియమ్మ, పెట్రో కార్-1 సిబ్బంది, కానిస్టేబుళ్లు స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ప్రజలను సమీకరించి వారికి నేరాలు, నివారణ అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్స్, సెల్‌ఫోన్ చోరీ, చైన్‌స్నాచింగ్‌లు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నేరం జరిగినప్పుడు డయల్-100 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.



పురస్కారాన్ని అందుకుంటున్న ఎంబీఎస్ ప్రసాద్, గంధం బసవశంకర్ రావు

సాహిత్యం, సంస్కృతి సామరస్యాన్ని పెంపొందిస్తాయి

మంగళ్‌హాట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం, సంస్కృతి సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తాయని శాంతా-వసంత ట్రస్టు అధ్యక్షుడు, పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం రాత్రి బొగ్గులకుంటలోని తెలంగాణ రాష్ట్ర సారస్వత పరిషత్తులో ప్రముఖ రచయిత ఎంబీఎస్ ప్రసాద్‌కు డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారాన్ని.. ప్రముఖ అన్నమయ్య పరిశోధకుడు గంధం బసవశంకర్ రావుకు కోడూరి వెంకటరమణారెడ్డి ఉత్తమ సాహితీ పురస్కారాన్ని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కె.వి.రమణాచారితో కలిసి ప్రదానం చేశారు. ఒక్కొక్కరి రూ.1 లక్ష నగదు, శాలువా, మెమోంటోతో సత్కరించారు. డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ... డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి ఎన్నో అవరోధాలు ఎదుర్కొని ప్రపంచానికి ప్రాణధారమైన ఔషధాలను అందించడంలో చేసిన కృషికి ఎంత గౌరవించినా తక్కువేనన్నారు. కార్యక్రమంలో సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కార్యదర్శి జె.చెన్నయ్య, శాంతా-వసంత ట్రస్టు కార్యదర్శి టి.నవీన్, హేమ తదితరులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో 1,424 యూనిట్ల రక్తం సేకరణ



మాట్లాడుతున్న రాహుల్ శ్యాం సుఖ

బర్కత్‌పుర , ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రక్తదానం పట్ల యువతలో అవగాహన పెంపొందించడానికి గత నెలలో గ్రేటర్ పరిధి లో 42చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. 1,424 యూనిట్ల రక్తాన్ని సేకరించామని అఖిల భారతీయ తేరాపంత్ యువక్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ రాహుల్ శ్యాంసుఖ, గ్రేటర్ కన్వీనర్ మనోజ్‌జైన్ తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తాన్ని గాంధీ ఆస్పత్రి, నిలోఫర్, కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి, రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించామనివారు చెప్పారు. తాము నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30శాతం యువత రక్తదానం చేశారని తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో 2012 నుంచి రక్తదాన శిబిరాలనునిర్వహిస్తున్నామన్నారు. 2014లో రక్తాన్ని సేకరించడంలో గిన్నీస్ రికార్డులోకి ఎక్కామని వారు చెప్పారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలి

- బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్



బీఐఎస్ సైన్స్‌బోధన శిక్షణలో ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల సైన్స్ ఉపాధ్యాయులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సైన్స్ బోధనలో భారతీయ ప్రమాణాలను మిళితం చేయాలని, తద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో స్టాండర్డ్స్ క్లబ్స్‌గా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల సైన్స్ ఉపాధ్యాయులకు 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే అంశంపై బీఐఎస్ రెండు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో శిక్షణ ఇచ్చింది. ఈ సందర్భంగా పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించడంతో పాటు బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు దేశవ్యాప్తంగా 10 వేలు, తెలంగాణలో 190 పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్లబ్ ద్వారా విదార్థులకు విభిన్న పోటీల్లో భాగస్వామ్యం చేయడం, భారతీయ ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు పరిశ్రమల సందర్శనకు తీసుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే కొత్త కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలకు బీఐఎస్ రూపొందించిన పుస్తకాలను అందిస్తున్నామని ఆయన తెలిపారు. బీఐఎస్ శాస్త్రవేత్తలు రాకేష్, కెవిన్, ఏఎన్ఎస్సీ శాస్త్రీలు పలు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.

ధూల్‌పేట్‌లో 5 కిలోల గంజాయి పట్టివేత

- ఏడుగురి అరెస్ట్ ● పట్టుకున్న సీఐలను అభినందించిన కమలాసన్‌రెడ్డి



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా శనివారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.అంజిరెడ్డి ఆధ్వర్యంలో భారీఎత్తున గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ధూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలు, రవాణా, వినియోగంపై దాడులు చేశారు. శనివారం 5 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లోని జియాగూడ, పురానాపూల్, కమ్మరివాడ, ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 2.5 కిలోల గంజాయిని పట్టుకొన్నారు.

మరో వైపు నాంపల్లి, మాదాపూర్ గచ్చిబౌలి అత్తాపూర్ నానల్‌నగర్ ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కమ్మర్వాడి ప్రాంతానికి చెందిన నిఖిల్ కుమార్, అఖిలేష్ సింగ్, జియాగూడకు చెందిన అరుణ్‌రావు, అమీష్, ఆశిష్, గణేష్, సాయికుమార్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

దాడుల్లో అంజిరెడ్డితోపాటు ఎక్సైజ్ సీఐలు మధుబాబు గోపాల్, చంద్రశేఖర్, బాస్కర్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, సాయి కిరణ్, అజీజ్ ప్రకాష్, మహేష్ రాకేష్ పాల్గొన్నారు. గంజాయిని పట్టుకున్న సీఐలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

లింక్ ఓపెన్ చేస్తే ఖాతా ఖాళీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు మరో కొత్తరకం మోసానికి తెరతీశారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఖాతాదారులను లక్ష్యంగా చేసుకున్న కేటుగాళ్లు ఎస్‌బీఐ రివార్డు పాయింట్స్ పేరుతో ఒక నకిలీ మెసేజ్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొన్నారు. "ప్రియమైన వినియోగదారులారా..! మీ ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్ రివార్డు పాయింట్లు (9980.00) గడువు నేటితో ముగుస్తుంది. వెంటనే ఎస్‌బీఐ రివార్డు యాప్ ఇన్‌స్టాల్ ద్వారా రిడీమ్ చేసుకోండి. నేరుగా మీ ఖాతాలో నగదు డిపాజిట్ అవుతుంది." అంటూ నకిలీ మెసేజ్‌లు పంపిస్తున్నారు. వచ్చిన మెసేజ్ నిజమని నమ్మి లింక్‌ను ఓపెన్ చేసి ఎస్‌బీఐ రివార్డు యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే వెంటనే 'మీ ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తారు. దాంతో మీ ఫోన్ కంట్రోలింగ్ వారి చేతికి వెళ్తుంది. ఫోన్‌లో మీరు ఎస్‌బీఐ ఖాతా వివరాలు నమోదు చేయగానే వారు ఖాతాలో ఉన్న డబ్బు ఖాళీ చేస్తారు' అని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ఎస్‌బీఐ ఖాతాదారులు ఈ మోసపూరితమైన మెసేజ్‌లు నమ్మొద్దని, ఎలాంటి యాప్‌లు, లింక్‌లు ఫోన్‌లో ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/kcv7rwMలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



క్షీరాభిషేకం చేస్తున్న దళిత విభాగం నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

నార్సింగ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలను ఏ,బీ,సీ,డీగా వర్గీకరణ చేయడంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుది కీలక పాత్ర అని దళిత నాయకులు కొనియాడారు. శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దళిత విభాగం నాయకులు భూపాల్‌రెడ్డి, పోలంపల్లి అశోక్, జోగిందర్‌సింగ్, వెంకటేశ్, రాఘవులు, నమోదనరావు, రవీందర్, జి.వి.జి.నాయుడు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన కరెన్సీ, కాయిన్ల ఎగ్జిబిషన్

- 15 నుంచి మొఘల్‌పురా ఉర్దూఘర్‌లో

చార్మినార్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పురాతన కరెన్సీ, నాణేలు, కాయిన్లు, స్టాంప్ పేపర్ల ప్రత్యేకతపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి మూడు రోజులపాటు పాతబస్తీలోని మొఘల్‌పురా ఉర్దూఘర్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామని ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి ఖదీరుల్లా ఖాద్రి తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సదర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు.

షంషీర్‌బాగ్ మైసమ్మ ఆలయం అధ్యక్షుడిగా రాజేశ్వర్ గౌడ్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): షంషీర్‌బాగ్ మైసమ్మ ఆలయ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా మాదుగుల రాజేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షురాలుగా ఎం.జయశ్రీ, ప్రధాన కార్యదర్శి యు.సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా గణపతి మురళీ, కోశాధికారిగా యు.ప్రభు, కార్యవర్గ సభ్యులుగా క్రాంతి, శ్రావణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

6 నుంచి చైతన్య వికాస్ కాలనీలో రామాలయం ప్రతిష్ఠాపన పూజలు

రాజేంద్రనగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6 నుంచి 9 వరకు రామాలయ ప్రతిష్టాపన పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. హైదర్‌గూడ చైతన్యవిలాస్ కాలనీలో హనుమాన్ సేవిత రామచంద్రస్వామి మందిరాన్ని నూతనంగా నిర్మించారు. శ్రీచినజీయర్‌స్వామి, అహోబిల జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ నెల 9న దేవాలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్రినాక శివగంగానగర్‌లోని లక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో త్రయోదశి 13వ శ్రీశివ సహస్రనామ మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం జ్యోతిప్రజ్వలన, భగవద్గీత పారాయణం, రుద్రాభిషేకం, శివసహస్రనామ యజ్ఞం నిర్వహించారు. దాదాపు వంద మంది మహిళలు ఆలయ ప్రాంగణంలో రామకోటి రాశారు. శ్రీమత్ భగవద్గీత, రుద్రాభిషేకం, శాంతిమంత్రం పఠించారు.

విజయవాడ కనకదుర్గ అమ్మవారికి పట్టు వస్త్రాలు



ఇంద్రకీలాద్రిపై అంజయ్య, మధుసూదన్

చార్మినార్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ మహాకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, ఉపాధ్యక్షుడు మధుసూదన్ యాదవ్ బృందం శనివారం విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. పాతబస్తీలోని ప్రధాన ఆలయాల తరఫున కనక దుర్గమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

రాజేంద్రనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జంగయ్య, ప్రదీప బదిలీ అయ్యారు. శనివారం నవయువ యూత్ క్లబ్ ప్రతినిధులు వారిని సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు అనిత మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఏ పాఠశాలకు వెళ్లినా అంకితభావంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని సూచించారు.

ఉస్మానియా పాత భవనంలో పాము కలకలం



పామును పట్టుకున్న కానిస్టేబుల్

మంగళ్‌హాట్, ఆగస్టు 3 (ఆంధ్ర జ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి పాత భవనంలో పాము కలకలం రేపింది. శనివారం మధ్యాహ్నం పాము కనిపించడంతో గమనించిన సిబ్బంది ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారం అందించారు. వారు సకాలంలో స్పందించి పామును పట్టుకుని స్నేక్ సొసైటీకి అప్పగించారు. నాలుగేళ్లుగా ఉస్మానియా పాత భవనం ఖాళీగా ఉండడంతో పాటు మూసీ ప్రాంతం నుంచి విషసర్పాలు ఆస్పత్రిలోకి వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.



రోడ్డు ప్రమాదంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, పోలీసు అధికారులు

ప్రమాదాలు జరిగాక పోలీసుల సేవలు కీలకం

● కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు కీలకంగా వ్యవహరిస్తారని కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్(టీఓఎస్ఏ), ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్(ఐఓఏ) సంయుక్త ఆధ్వర్యంలో నగర పోలీసులకు రోడ్డు ప్రమాదాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రధానంగా సీపీఆర్, ప్రథమ చికిత్స చాలా కీలకమని, దీనిని ప్రతీ పోలీస్ తెలుసుకుంటే ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ కాశా పేర్కొన్నారు. ఈ సంవత్సరం 'రోడ్డు భద్రత' అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి దాదాపు 200కుపైగా ట్రాఫిక్, సాధారణ పోలీసులు, 20 మందికి పైగా ఆర్టీసీ సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమంలో హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, నార్త్‌జోన్ ఏసీపీ వెంకటేశ్వర్లు, వెస్ట్‌జోన్ ఏసీపీ హరిప్రకాష్, ఆర్థో విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ రైటర్ దురుసు ప్రవర్తనపై డీసీపీ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాదర్‌ఘాట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): 'ఫోన్ లాక్కుని.. లాకప్ పక్కన నేలపై కూర్చోబెట్టి..' అని 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన వార్తకు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ స్పందించారు. చెక్కు బౌన్స్ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఫిర్యాదుదారుడి పట్ల రైటర్ చారి ప్రవర్తించిన తీరుపై ఆరా తీశారు. రైటర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు.

మురుగు శుద్ధి.. ఇక శరవేగంగా

రూ.3,849 కోట్లతో 39 ఎస్టీపీలు

● నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరంలో కొత్తగా మురుగునీటి శుద్ధి కేంద్రాలను (ఎస్టీపీ) నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు అమృత్ 2.0(ట్రాంచీ-3) కింద మొత్తం 39 ఎస్టీపీలను నిర్మించేందుకు రూ. 3,849.10 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఓఆర్ఆర్, జీహెచ్ఎంసీ పరిధిలోని స్థానిక సంస్థలతో పాటు మూసీనది ప్రక్షాళన కోసం వీటిని ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 39 ఎస్టీపీల్లో ఒక ఎస్టీపీని పీపీపీ మోడ్‌లో.. మిగిలిన 38 ఎస్టీపీలను హెచ్ఏఎం విధానంలో నిర్మించనున్నారు. కాగా, వీటిని రెండు ప్యాకేజీల్లో పూర్తి చేయనున్నారు. ప్యాకేజీ-1లో 16 ఎస్టీపీలు, ప్యాకేజీ-2లో 22 ఎస్టీపీలు నిర్మిస్తారు. ఈ రెండు అందుబాటులోకి వస్తే.. నగర పరిధిలో 972 ఎంఎల్‌డీల మురుగును శుద్ధి చేయవచ్చు. నిర్మించే సంస్థ యే ం రెండే ళ్ల పాటు పూర్తి నిర్వహణ బాధ్యత వహించాల్సి ఉంటుందని టెండర్ నిబంధనల్లో పొందుపరిచారు.



(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. జంట జలాశయాల ఎగువ భాగంలో రూ.65 కోట్లతో నాలుగు మురుగునీటి శుద్ధి ప్లాంట్ల(ఎస్టీపీ) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పాలనాపరమైన అనుమతులు కూడా రావడంతో త్వరలో పనులు ప్రారంభించేందుకు జల మండలి సన్నద్ధమవుతోంది. నెలరోజుల్లో టెండర్ ప్రక్రియను పూర్తి చేసి శంకుస్థాపన చేసేందుకు అడుగులేస్తోంది.

భారీగా నిర్మాణాలు, ఫామ్‌హౌస్‌లు

జంట జలాశయాల ఎగువ ప్రాంతాల్లో పెద్దఎత్తున ఫామ్‌హౌస్‌లు వెలిశాయి. పలు రిక్రియేషన్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. దీంతోపాటు ఆయా గ్రామాల నుంచి మురుగునీరంతా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లలో చేరుతోంది. దీన్ని అరికట్టకపోతే మున్ముందు జలాశయాల ఉనికికే ప్రమాదం ఉన్నందున ఎస్టీపీల నిర్మాణం చేపట్టాలని జలమండలి నిర్ణయించింది. నగరంలోని మణికొండ, సన్‌సిటీ, పాతబస్తీలోని పలు ప్రాంతాలకు ప్రతినిత్యం ఉస్మాన్‌సాగర్ నుంచి 97 మిలియన్ లీటర్లు, హిమాయత్‌సాగర్ నుంచి 36 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు.

నాలుగు ఎస్టీపీల నిర్మాణాలకు చర్యలు

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ఎగువన నాలుగు ఎస్టీపీలను నిర్మించనున్నారు. ఉస్మాన్‌సాగర్ ఎగువన 9 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ పర్ డే) సామర్థ్యంతో రెండు ఎస్టీపీల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. 4 ఎంఎల్‌డీల సామర్థ్యంలో జన్వాడ వద్ద బుల్కాపూర్ నాలా సమీపంలో ఒకటి, చిలుకూరు జోన్ పరిధిలోని హిమాయత్‌నగర్ వద్ద 5 ఎంఎల్‌డీల సామర్థ్యంతో మరొకటి నిర్మించనున్నారు. అలాగే హిమాయత్‌సాగర్ ఎగువన 11 ఎంఎల్‌డీల సామర్థ్యంతో రెండు ఎస్టీపీలను నిర్మించనున్నారు. అజీజ్‌నగర్, బంగళ్‌గూడ, నాగిరెడ్డిగూడ జోన్ పరిధిలో నుంచి వచ్చే మురుగును శుద్ధి చేసేలా నాగిరెడ్డిగూడ వద్ద 5ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఎస్టీపీని నిర్మించడానికి నిర్ణయించారు. అదేవిధంగా మరో ఎస్టీపీని కోత్వాల్‌గూడ, శంషాబాద్, కవాగూడ జోన్ల పరిధిలో నుంచి వచ్చే మురుగును శుద్ధి చేసేలా కాముని నాలా సంగమం వద్ద 6ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఎస్టీపీని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

9 నెలల్లో నిర్మాణానికి నిర్ణయం

20 ఎంఎల్‌డీల సామర్థ్యం గల ఈ నాలుగు ఎస్టీపీల నిర్మాణానికి రూ.65 కోట్ల మేర వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ పనులను దక్కించుకునే సంస్థ వాటర్‌బోర్డుతో ఒప్పందం చేసుకున్న తర్వాత తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఉస్మాన్‌సాగర్ ఎగువన జన్వాడ, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో, హిమాయత్‌సాగర్ ఎగువన నాగిరెడ్డిగూడ, కాముని నాలా సంగమం వద్ద అవసరమైన భూమిని సేకరించినట్లు తెలిసింది. ఎస్టీపీలు

తిరుగుబాటుతత్వానికి ప్రతీక 'తెలంగాణి'

● జూపాక సుభద్ర 'తెలంగాణి కైతల దొంతులు' ఆవిష్కరణ ● వ్యక్తీకరణతో పాటు భాషా ప్రయోగాలను కొనియాడిన వక్తలు



'తెలంగాణి కైతల దొంతులు' పుస్తకావిష్కరణ సభలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, బీఎస్ రాములు, గోగు శ్యామల, అంబటి సురేంద్రరాజు, కొండవీటి సత్యవతి తదితరులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వచన కవిత్వంలో ఉత్తుంగ తరంగం జూపాక సుభద్ర అంటూ వక్తలు కొనియాడారు. వచన కవిత్వానికి తెలంగాణ భాషా మాధుర్యాన్ని అందించిన తొలి విశిష్ట కవయిత్రి కూడా ఆమేనంటూ ప్రశంసించారు. దండోరా పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో జూపాక సుభద్ర రాసిన 'తెలంగాణి' కైతల దొంతులు సంపుటిని సచివాలయ ఉద్యోగి జంగిటి విజయ ఆవిష్కరించారు. అనంతరం సిటీ కాలేజీ తెలుగు శాఖ అధ్యక్షుడు కోయి కోటేశ్వరరావు పుస్తకాన్ని పరిచయం చేస్తూ, సుభద్ర రాసిన కవిత్వాన్ని సామాజిక ఇతిహాసంగా అభివర్ణించారు. నిఘంటువుకు అందని భాష ఈ సంపుటిలో ఉన్నదన్నారు. తన సాహిత్య సృజన ద్వారా జూపాక సుభద్ర స్త్రీల కోణం నుంచి సమాజాన్ని పునర్ మూల్యాంకనం చేస్తున్నారంటూ ప్రశంసించారు. ముఖ్య అతిథి ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సుభద్ర రచనలు సెన్సిటైజ్ చేస్తాయన్నారు. ఆమె కవిత్వంలో లోతైన వ్యక్తీకరణలతో పాటు భాషా ప్రయోగాలు, వర్ణనలు చాలా గొప్పగా, మరెవరూ చేయలేనివిగా ఉంటాయని కొనియాడారు. తెలంగాణ, విప్లవ, దళిత, బహుజన, స్త్రీ వాద తదితర ఉద్యమాలు కలగలసిన అరుదైన వ్యక్తిత్వం సుభద్ర సొంతం అంటూ కె.శ్రీనివాస్ శ్లాఘించారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ తెలంగాణి కవితా సంపుటిని తిరుగుబాటు కవిత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. రచయిత్రి గోగు శ్యామల మాట్లాడుతూ తెలంగాణ ప్రేమ చరిత్రను సుభద్ర కవిత్వంలో చూడవచ్చన్నారు. కార్యక్రమానికి రచయిత జిలుకర శ్రీనివాస్ సభాధ్యక్షత వహించగా, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కొండవీటి సత్యవతి, రచయిత్రులు కనీజ్ ఫాతిమా, దాసోజు లలిత, స్వేచ్ఛ, సాహితీవేత్త అంబటి సురేంద్రరాజు తదితరులు సుభద్ర సాహిత్య కృషిని, ఉద్యమ స్ఫూర్తిని ప్రశంసించారు. తెలంగాణి పుస్తక శీర్షిక వెనకున్న కవయిత్రి స్త్రీవాద తాత్విక దృక్పథాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో సుభద్ర జీవిత భాగస్వామి కృపాకర్ మాదిగ పాత్రను గుర్తుచేసుకొంటూ వారిని వక్తలు అభినందించారు.

ప్రైవేట్ టీచర్లపై సీఎం వ్యాఖ్యలు తగవు

● టీపీటీఎఫ్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ

పంజాగుట్ట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్బీ స్టేడియంలో ఇటీవల జరిగిన ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రైవేట్ టీచర్లను కించపర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని, వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) అధ్యక్షుడు షేక్ షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల నిర్వాకం వల్ల సకాలంలో టీచర్, ఇతర ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో చాలామంది చాలీచాలని జీతాలతో ప్రైవేట్ టీచర్లుగా పనిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లను వేర్వేరుగా చూడడం తగదని, రాజకీయ నాయకులు, ప్రభుత్వ టీచర్ల పిల్లలు కూడా ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువుతున్నారని గుర్తుచేశారు. సీఎం వ్యాఖ్యల సమయంలో వేదికపై ఉన్న ప్రొఫెసర్ కోదండరాం కనీసం వారించలేదని, దీన్ని నిరసిస్తూ ఆదివారం ఫోరం ఆధ్వర్యంలో కోదండరాం ఇంటిని ముట్టడిస్తామని తెలిపారు. సమావేశంలో ఫోరం కార్యదర్శి నవీన్‌కుమార్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల అధ్యక్షులు ముజీబ్‌ఖాన్, అమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ.. కబ్జా వ్యథ

(5వ పేజీ తరువాయి)

పనులను మధ్యలోనే వదిలేసి అక్కడి నుంచి జారుకున్నారు. పూడ్చిన మట్టిని తీయలేదు. కనీసం కందకాలు తొలగించలేదు. ఆ తర్వాత ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. కబ్జాదారులపై స్థానిక పోలీసుస్టేషన్‌లో రెవెన్యూ అధికారులు ఫిర్యాదు కూడా చేయలేదు.

20 ఎకరాలకు పైగా అన్యాక్రాంతం

భగీరథ చెరువు దాదాపు 54 ఎకరాల్లో విస్తరించి ఉండగా, సుమారు 20ఎకరాల మేర అన్యాక్రాంతమైంది. కొందరు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి సుమారు రూ.1500కోట్ల విలువ చేసే 15ఎకరాల చెరువు శిఖం స్థలాన్ని కబ్జా చేసేందుకు ఎనిమిదేళ్లుగా ప్రయత్నిస్తున్నారు. చెరువు శిఖంలోని ప్రైవేటు భూ యజమానులు నీటితో ఉన్న శిఖం స్థలాన్ని మట్టితో నింపుతున్నారు. నీళ్లు లేకుండా చేసి ఈ స్థలం శిఖం భూమి కాదని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు అధికారులు వారికి అండగా ఉండడంతో చెరువు ఆక్రమణలో కబ్జాదారులు ఆడిందే ఆటగా మారింది. రెండు నెలల క్రితం రెవెన్యూ అధికారులు హడావుడి చేసిన తర్వాత కూడా రాత్రి వేళ చెరువులో టిప్పర్లతో మట్టిపోస్తున్నారు. పూడ్చిన చెరువులోనే ఎక్కడికక్కడే హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. ప్రహరీ, గేటు నిర్మాణం చేసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే, ఈ చెరువు ఓ వైపు గండిపేట మండల రెవెన్యూ పరిధి.. మరోవైపు శేరిలింగంపల్లి మండల రెవెన్యూ పరిధి కావడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదు. ఫలితంగా రెండు మండలాల సరిహద్దులో కబ్జా దందా యథేచ్ఛగా సాగుతున్నది. చెరువును పూడ్చుతూ నింపిన మట్టిని తొలగించే ప్రయత్నం ఇరు మండలాల అధికారులూ చేయడం లేదు. కబ్జాకు గురైన స్థలంలో నింపిన మట్టిని తొలగించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, భగీరథ చెరువును కాపాడాలని పరిసర నివాసితులు, ఖాజాగూడ, నానక్‌రామ్‌గూడ ప్రజలు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. కబ్జా చేసే వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టి చెరువు శిఖం స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కబ్జాదారుల బరితెగింపు

● హెచ్ఎండీఏ భూముల ఆక్రమణకు యత్నం ● 50 ఎకరాలపై కన్ను.. విలువ రూ.500 కోట్లు
● ఐదుగురిపై కేసు, మూడు ఎక్స్‌కవేటర్లు స్వాధీనం



అక్రమార్కులు కూల్చిన హెచ్ఎండీఏ భూముల షెడ్లు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దేశ అత్యున్నత న్యాయస్థానం అవి హెచ్ఎండీఏ భూములని చెప్పినా కబ్జాదారులు రెచ్చిపోయారు. మూడు ఎక్స్‌కవేటర్లతో రూ.500 కోట్ల విలువైన సుమారు 50 ఎకరాలను చదును చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకొని ఆక్రమణదారులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని సర్వేనంబర్ 725లో 181 ఎకరాల హెచ్ఎండీఏ భూములున్నాయి. నగరానికి చెందిన మహ్మద్ ఖలీద్, మహ్మద్ షాబాజ్‌లు మూడు ఎక్స్‌కవేటర్లతో శనివారం భూములను చదును చేసేందుకు యత్నించగా విషయం తెలుసుకున్న హెచ్ఎండీఏ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మూడు ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసి డ్రైవర్లు రషీద్, నందు, నిసార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కబ్జాకు యత్నించిన ఖలీద్, షాబాజ్‌లపై కేసులు నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చినా..

ఉమ్మడి ఏపీలో ట్రక్కు టెర్మినల్ నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని వివిధ సర్వేనంబర్లలో హెచ్ఎండీఏ దాదాపు 214.02 ఎకరాల భూమిని సేకరించింది. వీటిలో పైగా ప్రాపర్టీస్‌కు చెందిన భూములు కూడా ఉన్నాయి. సర్వేనంబర్ 725/21లో 7 ఎకరాల 31 గుంటలు, సర్వేనంబర్ 725/23లో 10 ఎకరాల 12 గుంటలతోపాటు మరికొన్ని సర్వేనంబర్ల భూములు తమవేనంటూ గతంలో ఇద్దరు వ్యక్తులు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి అవి హెచ్ఎండీఏ భూములని తేల్చింది. హైకోర్టులో కేసు ఓడిపోయిన అక్రమార్కులు తిరిగి సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ఆరునెలల క్రితం అక్కడా ఎదురుదెబ్బ తగిలింది. అయినా, విలువైన భూములపై కన్నేసిన అక్రమార్కులు తిరిగి కబ్జాకు యత్నించారు.

డ్రగ్స్ టెస్ట్‌లు

(5వ పేజీ తరువాయి)

వివరాలను రాబడుతారు. వారిచ్చిన సమాచారంతో డ్రగ్స్ స్మగ్లర్ల లింకులను పట్టుకోనున్నారు. గ్రేటర్‌వ్యాప్తంగా విస్తృతస్థాయి తనిఖీలు, పరీక్షలు నిర్వహిస్తే కొద్దిరోజుల్లోనే డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను దూరం చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

డ్రగ్స్ ఫ్రీ నగరమే లక్ష్యం

డ్రగ్స్ బారిన పడుతున్న యువత వాటికి బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఏదో మార్గం ద్వారా నగరానికి డ్రగ్స్ సరఫరా అవుతుండడంతో ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. డ్రగ్స్ ఫ్రీ నగరమే లక్ష్యంగా తెలంగాణ నార్కోటిక్ బ్యూరో అధికారులు లోకల్ స్మగ్లర్లతోపాటు అంతర్రాష్ట్ర ఘరానా స్మగ్లర్ల ఆటకట్టిస్తున్నారు. అందులో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ తరహాలోనే డ్రగ్స్ టెస్టులను చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలి

● మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పంజాగుట్ట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, వెంటనే సమగ్ర కులగణన చేపట్టాలని, స్థానికసంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 10న ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన బీసీల సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, బీసీ సంఘాల నాయకులతో కలిసి శనివారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి బీసీలను మోసం చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తే బీసీ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సిద్దేశ్వర్, పిడికిలి రాజు, సాయిని నరేందర్, మేకల కృష్ణ, ఎల్. గోవర్ధన్, కొంపల్లిరాజు, బి.లింగం, కిరణ్ పాల్గొన్నారు.

ఎఫ్ఓసీ ఆటోలకు జీపీఎస్.!

(5వ పేజీ తరువాయి)

పంపిణీ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. గ్రేటర్‌జోన్ 10 సర్కిళ్ల పరిధిలో 213 ఎఫ్ఓసీ సెంటర్లు పనిచేస్తుండగా, వాటిలో 213 ఆటోలు అందుబాటులో ఉన్నాయి. విద్యుత్ కంట్రోల్ రూమ్‌కు 24 గంటల పాటు వచ్చే ఫిర్యాదులను ఎఫ్ఓసీ సిబ్బందికి పంపించి ఎక్కడ సమస్య తలెత్తిందో అక్కడకు ఆటోలో వెళ్లి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే చర్యలను ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది చేపడుతుంటారు. జీపీఎస్ సాంకేతికతను ఆటోల్లో అందుబాటులోకి తేవడంతో విద్యుత్ సిబ్బంది ఫిర్యాదుదారుడి ప్రాంతానికి నిమిషాల్లో నేరుగా చేరుకొని సమస్యలు పరిష్కరించే అవకాశాలు మెరుగుపడుతాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. జీపీఎస్ ట్రాకింగ్‌తో ఆటోలు ఏ సమయంలో విద్యుత్ కార్యాలయం నుంచి సమస్య తలెత్తిన ప్రాంతానికి వెళ్లాయి? ఎంత సమయంలో అక్కడకు చేరుకున్నాయి..? సమస్యను ఎంత సమయంలో పరిష్కరించారనే వివరాలు నేరుగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు చేరుతాయి.

రెండేళ్లలో 1912 కు వచ్చిన ఫిర్యాదుల సంఖ్య

నెల	2023	2024
జనవరి	64,738	45,994
ఫిబ్రవరి	70,789	30,407
మార్చి	78,862	32,870
ఏప్రిల్	1,23,255	73,386
మే	1,36,822	1,36,009
జూన్	1,09,206	79,268

అన్ని విభాగాల్లో ఆధునిక సాంకేతికత..

విద్యుత్ కంట్రోల్ రూమ్(1912)తో పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్(ఎఫ్ఓసీ) పనితీరు, క్షేత్రస్థాయిలో చేపట్టే విద్యుత్ మరమ్మతులు, డిస్కం పరిధిలో నిర్వహిస్తున్న కార్యకలాపాలతో పాటు అన్ని విభాగాల్లో ఆధునిక సాంకేతికతను డిస్కం క్రమంగా అందుబాటులోకి తెస్తోంది. సరఫరా, బిల్లింగ్‌లపై వచ్చే ఫిర్యాదులు, బ్రేక్ డౌన్ సమాచారం, ఫీడర్ల సమాచారం, బిల్లింగ్, కలెక్షన్ సమాచారం వంటి వివరాలతో కూడిన సమీకృత డ్యాష్ బోర్డులను విద్యుత్‌శాఖ అందుబాటులోకి తెచ్చింది. 1912కు ఒకేసారి 400 ఫిర్యాదులు వచ్చినా వాటిని రికార్డు చేసుకునే సామర్థ్యం పెంచారు. వినియోగదారుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో అపార్ట్‌మెంట్ల అసోషియేషన్ల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ● తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష



నిరాహారదీక్షలో ఎంపీ ఆర్.కృష్ణయ్య, చిరంజీవులు, వివిధ సంఘాల ప్రతినిధులు

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కులగణన చేపట్టాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, పెంచిన రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో బీసీ కులగణన సాధన కోసం నిరాహారదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ సింహాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టకుండా స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు మాట్లాడుతూ సకలజనుల సర్వే ఆధారంగా వెంటనే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ సింహాద్రి మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలో బీసీ సంఘాల నేతలు గుజ్జ సత్యం, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, కోల జనార్దన్, అనంతయ్య, రాజేందర్, రాజ్‌కుమార్, ఉదయ్, సతీష్, భరత్‌కుమార్, నందగోపాల్, పృథ్వీగౌడ్, వంశీకృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం

సండే సెలబ్రిటీ



మెగా కుటుంబం నుంచి నటిగా సినిమా రంగంలోకి ప్రవేశించిన నిహారిక కొణిదెల... 'కమిటీ కుర్రాళ్ల'తో నిర్మాతగా మారారు. ఈ సందర్భంగా తాను చేస్తున్న ప్రాజెక్టులు... వ్యక్తిగత జీవిత విశేషాలను 'నవ్య'తో పంచుకున్నారు.

వదిన కోసం మేము మారాం

నిర్మాతగా...

నేను ఇంతకుముందు ఓటీటీ కోసం కొన్ని సీరియల్స్ నిర్మించాను. వాటికి ఎంత శ్రమపడ్డామో, 'కమిటీ కుర్రాళ్ల' చిత్రానికి కూడా అంతే శ్రమపడ్డాం. బడ్జెట్స్‌లో మార్పు వచ్చి ఉండచ్చు. కానీ వర్క్‌పరంగా పెద్ద తేడా ఏమీ లేదు. నాకు చాలా మంచి టీమ్ దొరికింది. షూటింగ్‌కు వెళ్లకపోయినా ఏం తీశారో సాయంత్రానికి ఫుటేజ్ వచ్చేస్తుంది. ఇక నటన విషయానికివస్తే... తమిళంలో ఒక సినిమా చేస్తున్నా. తెలుగులో ఒక సినిమా ఈ ఏడాది చివర్లో ప్రారంభమవుతుంది.

24 క్రాఫ్ట్స్‌లో...

నాకు ప్రొడక్షన్, యాక్టింగ్‌తో పాటు ఎడిటింగ్ అంటే చాలా ఇష్టం. ఎందుకంటే.. ఒక సినిమా హిట్ అవ్వాలన్నా, ఫ్లాప్ కావాలన్నా.. ఎడిటింగ్ ప్రముఖమైన పాత్ర పోషిస్తుందని నేను నమ్ముతాను. ఎడిటర్స్ అంటే నాకు చాలా గౌరవం ఉంది.

నటిగా నేర్చుకున్నది...

ఏకాగ్రతతో పని చేయాలని ఒక నటిగా నేర్చుకున్నా. మనకు ఫోకస్ ఉంటే.. నచ్చిన విషయాన్ని పొందగలుగుతాం. ఉదాహరణకు నేను ఇప్పటికీ వర్క్‌షాప్‌లకు వెళ్లి నటించటం ఎలాగో, మాట్లాడటం ఎలాగో తెలుసుకుంటూ ఉంటా. స్క్రిప్టుల విషయంలో నేను చేసేది ఏంలేదు. నా నటన చూసి 'ఈ అమ్మాయి బాగా చేస్తోంది. మనం ఒక పాత్ర రాయాలి' అని రైటర్స్ అనుకోవాలి. వాళ్లు అలా అనుకోవాలంటే... నేను బాగా నటించాలి.

> **బయట తినను**
> నేను ఎక్కువగా ఇంట్లో అమ్మ వండినవే తింటాను. బయట తినను. పప్పుచారు, చికెన్ అంటే నాకు చాలా ఇష్టం. కొన్నిసార్లు వంట నేనే చేస్తుంటాను.

క్లిష్టమైన సమయం...

'కమిటీ కుర్రాళ్ల' ప్రారంభించినప్పుడు ఎవ్వరూ మమ్మల్ని నమ్మలేదు. 11 మంది కొత్త వాళ్లతో సినిమా చేస్తున్నానంటే.. నమ్మలేనట్లు చూసేవారు. టీజర్, ట్రైలర్ రిలీజ్ అయిన తర్వాత మమ్మల్ని నమ్మడం మొదలుపెట్టారు. ఇప్పుడు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. నాకే కాదు.. ఎవరికైనా ఇతరులను నమ్మించటానికి చాలా సమయం పడుతుంది.

ఎమోషనల్ పర్సన్‌ని...

నేను చాలా ఎమోషనల్ పర్సన్‌ని. కానీ నా ఎమోషన్స్ బయటకు కనపడనివ్వను. ఇక నాకు ఎమోషనల్ సపోర్టు అంటే మా నాన్నే. చాలా మంది నమ్మకపోవచ్చు కానీ.. నాన్న (నాగబాబు) తన విషయంలో ఎమోషనల్‌గా ఉండరు. తాను ప్రేమించేవాళ్లను ఏదైనా అంటే ఊరుకోరు. నేనూ అంతే. నాన్న తన ఎమోషన్స్‌ను పక్కనపెట్టి నాకు మద్దతు ఇచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

ఆ విధంగా...

సోషల్ మీడియా ద్వారా మన వ్యక్తిగత జీవితంలోకి దూసుకువచ్చేస్తారు. ఇప్పటిదాకా నా మీద అంత ఘోరమైన ట్రోల్స్ రాలేదనుకోండి. ఈ విషయంలో నేను అదృష్టవంతురాలినే. నా దృష్టిలో సోషల్ మీడియాకు రెండు పార్శ్వాలు ఉన్నాయి. ఒక పార్శ్వం... చాలా మంచిది. మనకు ఎంతో ఉపకరిస్తుంది. దాన్ని తగినట్లుగా వాడుకోవాలి. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. నేను ఎప్పుడూ కామెంట్స్ సెక్షన్ చూడను. ఎందుకంటే దానిలో విపరీతమైన నెగిటివిటీ ఉండొచ్చు.

> **అతి ముఖ్యమైనది...**
> ఈతరం అమ్మాయిలకు గౌరవం చాలా ముఖ్యం. కొందరు అమ్మాయిలను అలుసుగా తీసుకుంటారు. నా ఉద్దేశంలో చదువును బట్టి జ్ఞానం రాదు. మన ఇంట్లో ఉన్న ఆడవాళ్లను గౌరవించేవాళ్లు... ఎవరినైనా గౌరవించగలరు. తల్లితండ్రులు తమ పిల్లలకు ఈ తరహా సంస్కృతిని నేర్పాలి.

వెంటాడే భయం...

నేను ప్రేమించే వ్యక్తులు దూరమవుతారనేది నన్ను ఎక్కువగా భయపెడుతుంది. ఇక నాకు బల్లులంటే విపరీతమైన భయం.

సర్దుకుపోవాలి...

కొత్త వ్యక్తులు ఇంటికి వచ్చినప్పుడు మనం సర్దుకుపోవాలి. వాళ్లను మన జీవితాల్లోకి ఆహ్వానించాలి. వదిన (లావణ్య త్రిపాఠి) మా ఇంటికి వచ్చినప్పుడు మేము ఆహ్వానించాం. తను చాలా కాలంగా హైదరాబాద్‌లోనే ఉంది. కానీ ఉత్తరాది అమ్మాయి కావడంతో తన అలవాట్లు భిన్నంగా ఉండేవి. వాటికి అనుగుణంగా మేము మార్పులు చేసుకున్నాం. నా ఉద్దేశంలో కొత్త వ్యక్తి మనింటికి వచ్చినప్పుడు రెండు అడుగులు వెనక్కి వేస్తే తప్పేంలేదు. నేను, వదినా మంచి ఫ్రెండ్స్. గంటల తరబడి మాట్లాడుకుంటాం.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అలనాటి కథ



అందమైన జ్ఞాపకం

కొన్ని వస్తువులను మనం అపురూపంగా దాచుకొంటాం. ఎందుకంటే వాటితో మన అందమైన జ్ఞాపకాలు ముడిపడి ఉంటాయి. నచ్చిన కవిత్వపు పుస్తకం మధ్యలో దాచుకున్న పువ్వులు కావచ్చు. వచ్చిన తొలి ప్రేమ లేఖ కావచ్చు.. నాకున్న అలాంటి ఒక జ్ఞాపకం డైమండ్ రూబీ బ్రేస్‌లెట్. 70 ఏళ్ల క్రితం నాటి అందమైన జ్ఞాపకం అది. ఈ జ్ఞాపకాన్ని మీ అందరితోనూ పంచుకోవటానికి ఒక కారణముంది. రాజ కుటుంబాలలో పెరిగిన అమ్మాయిలకు భావ స్వేచ్ఛ ఉండదని, కేవలం తల్లితండ్రుల ఆజ్ఞను అనుసరించే జీవిస్తారని భావిస్తూ ఉంటారు. కానీ అందరి విషయంలోనూ అది నిజం కాదు. నాకు తెలిసిన రాజ కుటుంబాలలోని అమ్మాయిలను వారి తల్లితండ్రులు చాలా స్వేచ్ఛగా పెంచేవారు. అదే సమయంలో ఆ అమ్మాయిలు కూడా తల్లితండ్రుల మాట జవదాటేవారు కారు. అలాంటి ఒక అనుభవాన్ని మీతో పంచుకుంటున్నా. ఈ కథలో ఇతరుల పేర్లు మాత్రం చెప్పను. ఎందుకంటే వారి కుటుంబ సభ్యులు నొచ్చుకోవచ్చు. ఇక కథలోకి వెళ్తే... మనకు స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజులు. ఒక పెద్ద సంస్థానానికి ఒక యువరాజు ఉండేవారు. ఆరు అడుగుల అందగాడు. ఆయనను నేను చూసింది రెండుసార్లే. అది కూడా పార్టీల్లో... దూరంగా. అలాంటి వ్యక్తి హఠాత్తుగా రేపు సాలార్‌జంగ్ మ్యూజియంకు వస్తావా' అని అడిగేటప్పటికి ఏం చెప్పాలో అర్థం కాలేదు నాకు. 'నాన్నగారిని అడిగి చెబుతా' అన్నా. నాన్నను అడిగితే వెళ్లమన్నారు. నేను 'వస్తాను' అని చెప్పే లోపే... 'ఉదయం పది గంటలకు మీ మహల్‌కు వస్తా' అని యువరాజు వెళ్లిపోయారు. మర్నాడు చెప్పిన సమయానికే యువరాజు వచ్చారు. నేను ఆయన కారు ఎక్కా. మ్యూజియంకు వెళ్లేసరికి కమిటీ సభ్యులందరూ మాకు ఆహ్వానం పలికారు. మధ్యాహ్నం ఆయన నన్ను జ్ఞాన్‌బాగ్‌లో వదిలి వెళ్లిపోయారు. సాయంత్రం రాజ ముద్రతో నాకో ఉత్తరం వచ్చింది.. 'రాజకుమారి సాహేబా.. నాకు మ్యూజియం చూపించినందుకు థాంక్యూ. మళ్లీ బొంబాయిలో కలుద్దాం' అని!

నాకు తెలిసిన రాజ మర్యాదల ప్రకారం... ఏదైనా ఉత్తరం వస్తే దానికి తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలి. 'తప్పకుండా కలుద్దాం. నేను వేచి చూస్తున్నా' అని సమాధానమిచ్చా. ఆ తర్వాతి వారం మేమందరం బొంబాయి వెళ్లాం. నేపాల్ మహారాజు త్రిభువన్ తన కుటుంబంతో కలిసి తొలిసారి భారత్‌కు వచ్చారు. మా ప్యాలెస్‌లోనే ఆయనకు విడిది ఏర్పాటు చేశాం. అదే రోజు సౌదీ అరేబియా యువరాజు ప్రిన్స్ ఫైజల్ కూడా డిన్నర్‌కు వచ్చారు. ఆ సమయంలో నాకు యువరాజు నుంచి ఫోన్ వచ్చింది. 'డిన్నర్‌కు వెళ్దామా' అని! 'నేను డేటింగ్‌కు వెళ్లటానికి నాన్న ఒప్పుకోరు' అన్నా. 'సరే.. నేనే వస్తా' అన్నారు. నాన్న దగ్గరకు వెళ్లి 'యువరాజు డిన్నర్‌కు వస్తానన్నారు' అని చెప్పా. నాన్న వెంటనే తన సెక్రటరీతో యువరాజుకు ఫోన్ చేయించారు. కానీ యువరాజు తనకు వేరే అపాయింట్‌మెంట్ ఉందని డిన్నర్‌కు రాలేదు.

ఆ మర్నాడు నా జుట్టు సరి చేయించుకోవటానికి తాజ్ హోటల్‌కు వెళ్లా. సెలూన్ నుంచి బయటకు వస్తుంటే యువరాజు ఎదురుపడ్డారు. 'ఒక్కసారి నా స్వీట్ (రూమ్)కు వస్తావా?' అని అడిగారు. ఏం చెప్పాలో అర్థం కాలేదు. కాళ్లు, చేతులు వణుకుతున్నాయి. అయోమయ స్థితిలో నేను, నా గవర్నెస్.. యువరాజుతో రాజ్‌పుత్ స్వీట్‌కు వెళ్లాం. అక్కడ కొద్దిసేపు మాట్లాడిన తర్వాత యువరాజు మా గవర్నెస్‌ను బయటకు వెళ్లమన్నారు. నాకు భయం వేసింది. యువరాజు తన పర్స్ తీసి, దానిలో ఉన్న నా ఫోటో చూపించారు. అంతే... వెంటనే బ్యాగ్ తీసుకొని బయటకు పరిగెత్తుకుంటూ వచ్చేశాను. ఆ రోజు రాత్రి ఇంట్లో పార్టీ జరుగుతోంది. మా గవర్నెస్ ఒక పార్సిల్ ఇచ్చింది. ఆ పార్సిల్ ఇప్పి చూశాను. దాంట్లో అందమైన డైమండ్, రూబీలతో చేసిన బ్రేస్‌లెట్ ఉంది. దాన్ని నాన్నకు చూపించాను. 'ఏం చేయను' అని అడిగాను. 'నచ్చితే ఉంచుకో' అన్నారు. తన కూతురును దేశంలో ఒక పెద్ద సంస్థానానికి చెందిన యువరాజు ప్రపోజ్ చేశాడనే ఆనందం నాన్న కళ్లలో కనబడింది. అది ధరించి పార్టీకి వెళ్లా. యువరాజు కూడా వచ్చారు. 'ధరించినందుకు థాంక్యు' అన్నారు. తర్వాత పెళ్లికి అందరూ అంగీకరించారు. ఆ సమయంలో మా నాయనమ్మ హఠాత్తుగా జబ్బు పడింది. మరణానికి చేరువయింది. ఆ సమయంలో తను నన్ను పిలిచి... 'కుటుంబాన్ని చూసుకోవాలి. నువ్వు ఎక్కడికీ వెళ్లకు' అని కోరింది. కాదనలేకపోయా.

ఆ తర్వాతి జీవితం వేరే కథ!



• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

ఈ వారమే విడుదల — ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది ఇన్‌ఫ్లూయన్సర్	కొరియన్ సిరీస్	ఆగస్టు 06
సీక్రెట్ వరల్డ్ ఆఫ్ సౌండ్	వెబ్‌సిరీస్	ఆగస్టు 07
ది అంబరిల్లా అకాడమీ 4	వెబ్‌సిరీస్	ఆగస్టు 08
ఇన్‌సైడ్ ది మైండ్ ఆఫ్ ఏ డాగ్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 09
మిషన్ క్రాస్	కొరియన్ మూవీ	ఆగస్టు 09
రొమాన్స్ ఇన్ ది హౌస్	కొరియన్ సిరీస్	ఆగస్టు 10
సోనీ లివ్		
టర్బో	మలయాళ చిత్రం	ఆగస్టు 09
జియో సినిమా		
ది కలర్ పర్పుల్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 08
ఘుడ్‌చఢీ	హిందీ చిత్రం	ఆగస్టు 09
దస్ జునేకీ రాత్	హిందీ చిత్రం	ఆగస్టు 09
లీసా ఫ్రాంకెన్‌స్టైన్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 09
లయన్స్ గేట్ ప్లే		
జాంగో	వెబ్‌సిరీస్	ఆగస్టు 09
జీ 5		
గ్యారా గ్యారా	హిందీ సిరీస్	ఆగస్టు 09
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది జోన్ 3	కొరియన్ సిరీస్	ఆగస్టు 07
లైఫ్ హిల్ గయీ	హిందీ సిరీస్	ఆగస్టు 09
ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా	హిందీ చిత్రం	ఆగస్టు 09
ఆహా...		
తెప్ప సముద్రం	తెలుగు చిత్రం	ఆగస్టు 03

బిజినెస్



ఫండ్స్‌లోకి నారీమనీ

మొత్తం మదుపరుల్లో 30% వారే

- పెట్టుబడులపరంగా చూసినా 35% మహిళలవే
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ అదే ట్రెండ్
- యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నివేదిక వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పెట్టుబడుల సరళి మారిపోతోంది. గతంలోలా మహిళలు నాలుగు డబ్బులు చేతిలో ఉంటే నగనట్రా కొనుగోళ్లకే పరిమితం కావడం లేదు. మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల్లోనూ పెద్దఎత్తున మదుపు చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. గత ఐదేళ్ల (2019 మార్చి-2023 డిసెంబరు) కాలంలో ఎంఎఫ్ పథకాల్లో మదుపు చేసే మహిళల సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లో 4.7 రెట్లు, తెలంగాణలో 3.1 రెట్లు పెరిగింది. పెట్టుబడులపరంగా చూస్తే గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోని మహిళల ఎంఎఫ్ పెట్టుబడులు 4.1 రెట్లు, తెలంగాణలోని మహిళల పెట్టుబడులు 3 రెట్లు పెరిగాయి. 'యాక్సిస్ మ్యూచువల్ ఫండ్' సంస్థ రూపొందించిన ఒక నివేదిక ఈ విషయం తెలిపింది. 'విమెన్ ఇన్వెస్ట్‌మెంట్ బిహేవియర్ రిపోర్ట్, 2024' పేరుతో ఆ సంస్థ ఈ నివేదికను విడుదల చేసింది. 2019 మార్చి-2023 డిసెంబరు మధ్య కాలంలో తన పథకాల్లో మదుపు చేసిన కోటి మంది మదుపరుల డేటా ఆధారంగా యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ ఈ రిపోర్టును రూపొందించింది.

నిర్ణయాలు సొంతంగానే: ఎంఎఫ్ పథకాల్లో పెట్టుబడుల విషయానికి వస్తే 72 శాతం మంది మహిళలు సొంతంగానే తుది నిర్ణయాలు తీసుకుంటున్నారు. యువతుల్లో ఈ ట్రెండ్ మరింత ఎక్కువగా కనిపిస్తోంది. 25-34 ఏళ్ల మధ్య వయస్కులైన యువతుల్లో 75 శాతం, 35-44 ఏళ్ల మధ్య వయస్కుల్లో 70 శాతం మంది సొంతంగానే మ్యూచువల్ ఫండ్ పథకాల్లో పెట్టుబడుల నిర్ణయాలు తీసుకుంటున్నారు. అప్పుడప్పుడు పెట్టుబడుల నిపుణులు, కుటుంబసభ్యులు లేదా స్నేహితులను సంప్రదించినా.. తుది నిర్ణయం మాత్రం మహిళలదేనని నివేదిక తెలిపింది. గత ఏడాది డిసెంబరు నాటికి తమ మొత్తం మదుపరుల్లో 30 శాతం, పెట్టుబడుల్లో 35 శాతం నారీమణులదని పేర్కొంది.

దీర్ఘకాలిక లక్ష్యాలతోనే: మ్యూచువల్ ఫండ్ పథకాల్లో మదుపు చేసే మహిళల్లో ఎక్కువ మంది దీర్ఘకాలిక లక్ష్యాలతోనే మదుపు చేస్తున్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల ఖర్చులు ఇందులో ముఖ్యమైనవి. దీంతో గత ఐదేళ్లలో ఎంఎఫ్ పథకాల్లో మదుపు చేసే ఒక్కో మహిళ పెట్టుబడులు సగటున 25 శాతం పెరిగాయి. పురుషులతో పోల్చినా వీరి సగటు పెట్టుబడుల మొత్తం 37 శాతం అధికంగా ఉన్నట్టు నివేదిక తెలిపింది. గత ఐదేళ్లలో యాక్సిస్ ఎంఎఫ్‌కు చెందిన 22 లక్షల మంది మహిళా ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులపై సగటున రూ.80,000 వరకు లాభాలు ఆర్జించినట్టు పేర్కొంది.

డిజిటల్ రెడీ: ప్రస్తుతం చాలా మంది మహిళల చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. దీంతో డిజిటల్ లావాదేవీల్లోనూ వారు ఆరితేరిపోయారు. ఏదైనా మంచి ఎంఎఫ్ పథకం గురించి తెలిస్తే తమ ల్యాప్‌ట్యాప్ లేదా స్మార్ట్‌ఫోన్ ద్వారా చెల్లింపులు చేసి, ఆ పథకాల్లో మదుపు చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం కేవలం 14 శాతం మంది మహిళలు మాత్రమే, డిజిటల్ సాధనాల ద్వారా ఎంఎఫ్ పథకాల్లో మదుపు చేసేవారు. గత ఏడాది చివరికి ఇది 55 శాతానికి చేరినట్టు యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నివేదిక వెల్లడించింది.

పసిడి బాండ్ల హోల్డర్లకు 122% రిటర్నులు

రిడంప్షన్ ధర గ్రాముకు రూ.6,938గా నిర్ణయం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తరఫున భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) 2016 ఆగస్టులో జారీ చేసిన పసిడి బాండ్లలో పెట్టుబడి పెట్టిన వారికి లాభాల పంట పడింది. ఆర్‌బీఐ ఈ బాండ్లను యూనిట్ (గ్రాము)కు రూ.3,119 చొప్పున జారీ చేసింది. ఈ బాండ్ల 8 ఏళ్ల కాలపరిమితి ఈ నెల 5తో ముగియనుంది. ఈ సందర్భంగా ఆర్‌బీఐ ఈ విడత బాండ్ల రిడంప్షన్ రేటును గ్రాముకు రూ.6,938గా నిర్ణయించింది. అంటే, ఒక్కో గ్రాముపై 122 శాతం రిటర్ను లభించనుందని ఆర్‌బీఐ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

ఎస్‌బీఐ లాభం రూ.19,325 కోట్లు



రూ.1,22,688 కోట్లకు మొత్తం ఆదాయం .. 2024-25లో రూ.25,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4.25 శాతం వృద్ధితో రూ.19,325 కోట్లకు చేరుకుంది. స్టాండ్‌ఎలోన్ లాభం మాత్రం కేవలం 0.9 శాతం వృద్ధితో రూ.17,035 కోట్లకు పరిమితమైంది. బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్, ఇతర ఆదాయం తగ్గడంతో పాటు మొండి బాకీల నష్టాలను పూడ్చుకునేందుకు కేటాయింపులు పెరగడం లాభాల వృద్ధిని పరిమితం చేసింది. కాగా, ఈ క్యూ1లో ఎస్‌బీఐ స్టాండ్‌ఎలోన్ ఆదాయం రూ.1,22,688 కోట్లకు పెరిగింది. అందులో వడ్డీ ఆదాయం రూ.1,11,526 కోట్లుగా ఉంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఏప్రిల్-జూన్ కాలానికి బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 5.71 శాతం వృద్ధితో రూ.41,125 కోట్లకు చేరుకుంది.
- నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 0.11 శాతం తగ్గి 3.22 శాతానికి పరిమితమైంది. క్రితం సంవత్సరంలో ఇదే కాలానికి ఎన్ఐఎం 3.33 శాతంగా నమోదైంది.
- 2023 జూన్ 30 నాటికి 2.76 శాతంగా (రూ.91,327.84 కోట్లు) ఉన్న బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ).. ఈ ఏడాది జూన్ చివరి నాటికి 2.21 శాతానికి (రూ.84,226.04 కోట్లు) తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.71 శాతం (రూ.22,995.37 కోట్లు) నుంచి 0.57 శాతానికి (రూ.21,554.69 కోట్లు) దిగివచ్చాయి.
- మొండి బకాయిల నష్టాలను పూడ్చుకునేందుకు బ్యాంక్ రూ.4,580 కోట్ల కేటాయింపులు జరిపింది. క్రితం ఏడాదిలో జూన్ త్రైమాసికానికి జరిపిన రూ.2,488 కోట్ల కేటాయింపులతో పోలిస్తే 70 శాతం అధికమిది. కాగా, ఈ జూన్ చివరినాటికి కేటాయింపుల కవరేజీ నిష్పత్తి (పీసీఆర్) మాత్రం 91.76 శాతానికి పెరిగింది.
- ఈ ఏప్రిల్-జూన్ కాలంలో కొత్తగా రూ.7,903 కోట్ల రుణాలు మొండిపద్దుల్లోకి మళ్లాయి. అందులో రూ.1,600 కోట్లు ఇప్పటికే వసూలైనట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ దినేశ్ ఖారా వెల్లడించారు.
- గత త్రైమాసికంలో బ్యాంక్ స్థూల రుణాలు 15.39 శాతం వార్షిక వృద్ధితో రూ.38.12 లక్షల కోట్లకు చేరుకోగా.. మొత్తం డిపాజిట్లు 8.18 శాతం పెరుగుదలతో రూ.49.02 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2024-25 మొత్తానికి రుణ వృద్ధి 15 శాతంగా నమోదు కావచ్చని బ్యాంక్ భావిస్తోంది.
- బాసెల్-3 ప్రమాణాలకు అనుగుణంగా అదనపు టైర్ 1, టైర్ 2 బాండ్ల జారీ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.25,000 కోట్ల నిధుల సమీకరణకు ఎస్‌బీఐ బోర్డు ఆమోదం తెలిపింది. దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లకు ఈ బాండ్ల జారీ ద్వారా దేశీయ కరెన్సీతోపాటు డాలర్లలో నిధులను సమీకరించనుంది. ఈ ప్రతిపాదనకు కేంద్రం అనుమతి కూడా అవసరమని పేర్కొంది.

ఖారా హయాంలో రూ.1.63 లక్షల కోట్ల లాభం



బ్యాంక్ షేరు ధర ఇంకా తక్కువేనన్న ఎస్‌బీఐ ఛైర్మన్

గడిచిన కొన్నేళ్లలో బ్యాంక్ లాభం భారీగా పుంజుకుందని ఎస్‌బీఐ ఛైర్మన్ దినేశ్ ఖారా అన్నారు. ఛైర్మన్‌గా తన హయాంలోని నాలుగేళ్లలో బ్యాంక్ మొత్తం రూ.1.63 లక్షల కోట్ల లాభం గడించిందని.. అంతక్రితం 64 ఏళ్లలో ఆర్జించిన రూ.1.45 లక్షల కోట్ల లాభం కంటే అధికమని ఫలితాల విడుదల సందర్భంగా ఖారా మీడియాకు వెల్లడించారు. తను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు బ్యాంక్ లాభం రూ.14,000 కోట్ల స్థాయిలో ఉండగా.. ఇప్పుడది రూ.17,000 కోట్లు దాటిందన్నారు. అంతేకాదు, 22,000కు పైగా శాఖలతో పాటు భారీగా నిల్వలు, వైవిధ్యభరితమైన ఉత్పత్తులను కలిగి ఉన్నప్పటికీ బ్యాంక్ షేరుకు సరైన విలువ మాత్రం లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖారా పదవీ కాలం ఈ నెలలోనే ముగియనుంది. ఆయన స్థానాన్ని తెలంగాణకు చెందిన చల్లా శ్రీనివాసులు శెట్టి భర్తీ చేయనున్నారు. శెట్టి ప్రస్తుతం ఎస్‌బీఐలో ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,580 ▼	64,700 ▼	90,900 ▼
ముంబై	70,392 ▲	64,479 ▲	83,501 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ



హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	440
చిత్తూరు	493	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	92
వరంగల్	80	గుంటూరు	92
కరీంనగర్	80	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	106
కర్నూలు	80	నెల్లూరు	106
విశాఖపట్నం	86	అనంతపురం	92
గోదావరి	92		

అమర రాజా ఎనర్జీ ఆదాయం రూ.3,131 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ (ఎఆర్ఈ అండ్ ఎం).. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి గాను స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.244.55 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.198.65 కోట్లు)తో పోల్చితే లాభం 25 శాతం మేర వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా 13 శాతం వృద్ధితో రూ.2,770.70 కోట్ల నుంచి రూ.3,131.19 కోట్లకు పెరిగింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ నిలకడైన వృద్ధిని కనబరిచిందని, ఇందుకు సంస్థ రెవెన్యూ, లాభాలే నిదర్శనమని ఆటోమోటివ్ అండ్ ఇండస్ట్రియల్ బ్యాటరీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన గౌరినేని అన్నారు. అంతేకాకుండా కంపెనీ అంతర్జాతీయ కార్యకలాపాలు కూడా మెరుగ్గా ఉండటం కలిసివచ్చిందని పేర్కొన్నారు. దేశీయంగా డిజైన్ చేసిన ఏజీఎం బ్యాటరీలకు మంచి స్పందన రావటంతో రానున్న నెలల్లో ఈ విభాగంలో గట్టి పట్టును చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా ఉత్పత్తుల శ్రేణిని బలోపేతం చేయటంతో పాటు అంతర్జాతీయంగా స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవటంపై దృష్టిని కేంద్రీకరించనున్నట్లు హర్షవర్ధన పేర్కొన్నారు.

దివీస్ లాభంలో 21% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో దివీస్ లేబొరేటరీస్ ప్రోత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.2,197 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.430 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.356 కోట్లు)తో పోల్చితే లాభం 21 శాతం వృద్ధి చెందింది. కాగా గత ఏడాది ఇదే త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.1,859 కోట్లుగా ఉంది.

10% పెరిగిన బీఓఐ లాభం

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) రూ.1,702.7 కోట్ల స్టాండ్‌ఎలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.1,551 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం వృద్ధి కనబర్చింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.18,240 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 6.1 శాతం పెరుగుదలతో రూ.6,275.8 కోట్లుగా నమోదైంది. కాగా బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 4.62 శాతానికి తగ్గగా.. నికర ఎన్‌పీఏల నిష్పత్తి 0.99 శాతానికి జారుకుంది.

ఆంధ్ర యూనివర్సిటీలో
డిస్టెన్స్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు: బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ)ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్‌ఆర్‌ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

జేఎన్‌టీయూకేలో స్పాన్సర్డ్ ఎంటెక్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కాకినాడ, నర్సరావుపేట క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. అకడమిక్ మెరిట్, గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్పెషలైజేషన్‌కు అయిదు సీట్లు చొప్పున మొత్తం 125 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ.

అర్హత: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/ఎర్త్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్/బీడీఎస్/బీ ఫార్మసీ/బీవీఎస్సీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 అర్హత తప్పనిసరి. అభ్యర్థులకు కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **సెమిస్టర్ ఫీజు:** రూ.25,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

దిక్సూచి DIKSUCHI

బయోటెక్నాలజీ, సైన్సెస్ విభాగాల్లో పీజీ చేయాలనుకొనే వారి కోసం ఉద్దేశించిన 'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్) 2025' షెడ్యూల్ వెలువడింది. దీనిని ఈ ఏడాది ఐఐటీ ఢిల్లీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారా ఎమ్మెస్సీ; ఎమ్మెస్సీ(టెక్); ఎంఎస్(రీసెర్చ్); జాయింట్/డ్యూయల్ డిగ్రీ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ; ఎమ్మెస్సీ-ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ; ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐటీలు అందిస్తున్న వివిధ పీజీ ప్రోగ్రామ్‌లలో సుమారు 3000 సీట్లను జామ్ స్కోర్ ద్వారా నేరుగా భర్తీ చేస్తారు. అలాగే నిట్ సంస్థలు, ఐసర్లు, ఐఐఎస్సీ, ఐఐఈఎస్‌టీ, డీఐఏటీ, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్‌ఆర్, ఎస్ఎల్ఐఈటీ సహా ప్రముఖ సీఎఫ్‌టీఐ సంస్థల్లో 2300కు పైగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఈ స్కోరునే ప్రామాణికంగా తీసుకుంటారు.

సైన్స్ పీజీల్లో ప్రవేశానికి జామ్

జామ్ పేపర్లు: జామ్ ఎగ్జామ్‌ను ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్‌లో కెమిస్ట్రీ, జియాలజీ, మేథమెటిక్స్ పేపర్లు; మధ్యాహ్నం సెషన్‌లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్ ఫిజిక్స్ పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు పేపర్లు రాయవచ్చు. రెండు పేపర్లు రాసేవారు ఉదయం సెషన్ నుంచి ఒక పేపర్, మధ్యాహ్నం సెషన్ నుంచి మరో పేపర్ ఉండేలా చూసుకోవాలి. పేపర్లకు నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కెమిస్ట్రీ పేపర్ సిలబస్ మారినందున దానిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: అభ్యర్థి జామ్‌లో ఎంచుకొన్న పేపర్/పేపర్లను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; సంబంధిత ఇండియన్ డిగ్రీ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా జామ్ ఎగ్జామ్ రాయవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 3
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 11
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 జనవరిలో
- **జామ్ 2025 ఎగ్జామ్ తేదీ:** 2025 ఫిబ్రవరి 2
- **వెబ్‌సైట్:** jam2025.iitd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FIN8mlxలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



యుద్ధానికి సిద్ధం

అడివిశేష్ హీరోగా నటించిన 'గూఢచారి' సినిమాకి కొనసాగింపుగా వస్తోన్న చిత్రం 'గూఢచారి 2'. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. 'గూఢచారి' చిత్రం విడుదలై ఆరేళ్లు అవుతున్న సందర్భంగా పార్ట్ 2 నుంచి ఆరు స్టైలిష్ యాక్షన్ స్టిల్స్‌ను శనివారం యూనిట్ విడుదల చేసింది. 'గూఢచారి 2' భారీ స్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతోంది' అని శేష్ చెప్పారు. ఇప్పటికి 40 శాతం షూటింగ్ పూర్తయిందని నిర్మాతలు తెలిపారు.



రెడ్‌కార్పెట్ లుక్

'69వ శోభా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగింది. హీరోలు నాని, సుధీర్‌బాబు, సందీప్ కిషన్, అల్లు శిరీష్, నవీన్ పొలిశెట్టి, సిద్ధార్థ్... హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, ఐశ్వర్యా రాజేశ్, జ్యోతిక, నభానటేశ్, రాశీఖన్నా, ప్రియమణి తదితరులు పాల్గొన్నారు.

లావణ్యే డ్రగ్స్ అలవాటు చేసింది

● రాజ్‌తరుణ్ మాజీ ప్రియురాలిపై కేసు

రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య మధ్య నడుస్తున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది.



లావణ్య తనకు డ్రగ్స్ అలవాటు చేసిందంటూ ప్రీతీ అనే యువతి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. 'లావణ్య ఇప్పటికే చాలామంది అమ్మాయిలకు డ్రగ్స్ అలవాటు చేసింది, తరచూ నాకు ఫోన్‌చేసి బెదిరిస్తోంది, ఆమెవల్ల ఇప్పటికే చాలా జీవితాలు నాశనం అయ్యాయి' అని ప్రీతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుఖేందర్‌రెడ్డి తెలిపారు. డ్రగ్స్ విషయంలో అడ్డు చెప్పడం వల్లే ఆమె రాజ్‌తరుణ్‌పై కక్ష పెంచుకుందని ఆయన తరఫు లాయర్ మధుశర్మ చెప్పారు.

వయనాడ్ విలయం... సినీతారల సాయం



కేరళ సీఎం సహాయక నిధికి రూ. 25 లక్షల సాయం అందించిన మలయాళ నటుడు మోహన్‌లాల్ సహాయక చర్యల్లో సైతం పాల్గొని తన గొప్ప మనసు చాటుకున్నారు. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా కొనసాగుతున్న ఆయన ఆ హోదాలో దగ్గరుండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. వయనాడ్‌లోని ఆర్మీ బేస్ క్యాంప్‌లో ఆయన సైనికులను కలిశారు. తాత్కాలిక బ్రిడ్జిల నిర్మాణం లాంటి కార్యక్రమాల్లో సైనికులతో కలసి పాల్గొన్నారు. 'మీరు రీల్ హీరో కాదు రియల్ హీరో' అంటూ నెటిజన్లు మోహన్‌లాల్‌ను ప్రశంసిస్తున్నారు.

నటీనటుల విరాళాలు



భారీ వరదలు, కొండ చరియలు విరిగిపడి తీవ్రంగా నష్టపోయిన వయనాడ్ ప్రాంతంలో సహాయ, పునరావాస కార్యక్రమాలకు తమవంతు సాయం అందించేందుకు తారాలోకం నడుంకట్టింది. పలువురు నటీనటులు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారు. టాలీవుడ్ కథానాయిక రష్మిక మందన్న రూ. 10 లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 5 లక్షలు విరాళంగా ఇచ్చారు. తమిళ నటులు సూర్య, కార్తి, జ్యోతిక కలిసి రూ. 50 లక్షలు ఇవ్వగా, కమల్‌హాసన్ రూ. 25 లక్షలు, విక్రమ్ రూ. 20 లక్షలు ఇచ్చారు. దుల్కర్ సల్మాన్ రూ. 10 లక్షలు, మమ్ముట్టి రూ. 15 లక్షలు, ఫహద్‌ఫాజిల్, నజ్రియా దంపతులు రూ. 25 లక్షలు విరాళంగా అందించారు.



సక్సెస్



థియేటర్లు పెరుగుతున్నాయి

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా రూపొందిన 'తిరగబడరా సామీ' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవంలో నిర్మాత మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ 'మొత్తం 200 థియేటర్లలో విడుదల చేశాం. ఈ రోజు మరో 20 థియేటర్లు పెరిగాయి. మా సినిమాకు మంచి రిపోర్ట్ వచ్చింది. దర్శకుడు రవికుమార్ చౌదరి అద్భుతంగా తీశారు. లేడీ విలన్‌గా మన్నారా చోప్రా చక్కగా నటించింది' అన్నారు. మంచి సినిమాను ఏదీ అడ్డుకోలేదని ప్రేక్షకులు నిరూపించారని దర్శకుడు రవికుమార్ చౌదరి చెప్పారు.

ప్రేక్షక దేవుళ్లు కరుణించారు



'ఒక కొత్త హీరో నటించిన సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. 'ప్రేక్షక దేవుళ్లు' అని ఎందుకు అంటారో నాకు ఇప్పుడు అర్థమైంది' అన్నారు 'అలనాటి రామచంద్రుడు' చిత్ర హీరో కృష్ణవంశీ. శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి మంచి ఆదరణ లభించిందని శనివారం నిర్వహించిన థాంక్స్ మీట్‌లో వెల్లడించారు. ఈ చిత్ర నిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్మాత శ్రీరామ్ జడపోలు కృతజ్ఞతలు తెలిపారు.



రెస్పాన్స్ బాగుంది

'చాలా రోజుల తర్వాత ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను చూశామని ప్రేక్షకులు అంటుంటే ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు విజయ్‌భాస్కర్. శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష జంటగా రూపొందిన 'ఉషా పరిణయం' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో చిత్రనిర్మాత, దర్శకుడు విజయభాస్కర్ మాట్లాడుతూ 'కలెక్షన్లు నెమ్మదిగా పెరుగుతున్నాయి. రెస్పాన్స్ బాగుంది. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరిస్తే మరిన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు వస్తాయి' అన్నారు





పారిస్ ఒలింపిక్స్ (జూలై 26 - ఆగస్టు 11)

అరెరె.. నిషాంత్

క్వార్టర్స్‌లో పరాజయం



పారిస్: భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత బాక్సర్ నిషాంత్ దేవ్‌కు ఓటమి ఎదురైంది. పురుషుల 71 కిలోల విభాగంలో శనివారం రాత్రి జరిగిన క్వార్టర్స్ బౌట్‌లో నిషాంత్ 1-4తో మెక్సికో బాక్సర్ మార్కో వెర్డే చేతిలో పోరాడి ఓడాడు. ఆరంభంలోనే దూకుడుగా పంచ్‌లు విసిరిన నిషాంత్ తొలి రౌండ్‌ను 4-1తో సొంతం చేసుకొన్నాడు. అయితే, రెండో రౌండ్‌లో ఎదురుదాడి చేసిన వెర్డే 3-2తో నెగ్గాడు. ఇక, మూడో రౌండ్‌నూ మార్కో 5-0తో గెలిచి సెమీస్‌కు చేరుకొన్నాడు. దీంతో భారత్‌కు ఓ పతకం చేజారింది. బాక్సింగ్‌లో సెమీస్‌లో ఓడినా కనీసం కాంస్యం పతకం దక్కుతుంది.





బంగారు బైల్స్

సిమోన్ ఖాతాలో మూడో స్వర్ణం • మహిళల వాల్ట్ టైటిల్ కైవసం

పారిస్: తనకు ఎదురేలేదని అమెరికా స్టార్ జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ నిరూపించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇప్పటికే మహిళల ఆర్టిస్టిక్ టీమ్, వ్యక్తిగత ఆల్‌రౌండ్ విభాగాల్లో పసిడి పతకాలను సొంతం చేసుకున్న ఆమె..వాల్ట్‌లోనూ స్వర్ణం కొల్లగొట్టింది. తద్వారా ఈసారి విశ్వక్రీడల్లో స్వర్ణాల హ్యాట్రిక్ సాధించింది. వ్యక్తిగతంగా మాత్రం ఆమె రెండు పసిడి పతకాలు (ఆల్‌రౌండ్, వాల్ట్) అందుకుంది. కాగా..వెరా కస్లావస్కా (చెక్ రిపబ్లిక్, 1964, 1968 ఒలింపిక్స్) తర్వాత విశ్వక్రీడల వాల్ట్ విభాగంలో రెండు స్వర్ణాలు దక్కించుకున్న తొలి జిమ్నాస్ట్‌గా బైల్స్ రికార్డు నెలకొల్పింది. శనివారం జరిగిన వాల్ట్ ఫైనల్లో బైల్స్ 15.300 పాయింట్లతో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. అంద్రాడే (బ్రెజిల్, 14.966) రజతం, కేరీ (అమెరికా, 14.466) కాంస్యం గెలిచారు.

'బ్లాక్ జాబ్' నాకిష్టం: ట్రంప్‌నకు బైల్స్ కౌంటర్

'జిమ్నాస్టిక్స్‌లో స్వర్ణ పతకాలు గెలవడం నా బ్లాక్ జాబ్. ఈ బ్లాక్ జాబ్ నాకు ఎంతో ఇష్టం' అని బైల్స్. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఘాటైన జవాబిచ్చింది. వలసవాదుల వల్ల అమెరికన్లు నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటున్నారని.. ఆ వలసవాదులు చేసే ఉద్యోగాలను 'బ్లాక్ జాబ్స్'గా ట్రంప్ విమర్శించారు. పారిస్ ఒలింపిక్స్ జిమ్నాస్టిక్స్ వ్యక్తిగత ఆల్‌రౌండ్ విభాగంలో పసిడి పతకం గెలిచిన అనంతరం.. ట్రంప్ 'బ్లాక్ జాబ్స్' విమర్శకు బైల్స్ పరోక్షంగా గట్టి బదులిచ్చింది.

చరిత్ర సృష్టిస్తాడా?

టాప్‌సీడ్ విక్టర్‌తో లక్ష్యసేన్ సెమీస్ నేడు



ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఆదివారం మరో హైవోల్టేజ్ పోరుకు రంగం సిద్ధమైంది. డిఫెండింగ్ చాంపియన్, డెన్మార్క్‌కు చెందిన విక్టర్ అక్సెల్సెన్‌ను సెమీఫైనల్లో ఢీకొట్టేందుకు 22 ఏళ్ల లక్ష్యసేన్ సై అంటున్నాడు. ఈ మ్యాచ్‌లో గెలిస్తే...ఒలింపిక్స్ చరిత్రలో పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఫైనల్‌కు చేరిన తొలి భారత షట్లర్‌గా సేన్ రికార్డులకెక్కుతాడు. కాగా ఇప్పటివరకు వీరిద్దరూ ఏడుసార్లు తలపడగా ఆరు మార్లు విక్టర్‌నే విజయం వరించింది. రియోలో కాంస్యం, టోక్యోలో స్వర్ణం సాధించిన విక్టర్, మూడో ఒలింపిక్ పతకంపై కన్నేశాడు. గ్రూప్ దశలో వరల్డ్ నెంబర్ 4 జొనాథన్ క్రిస్టీ, క్వార్టర్స్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్ చౌ టైన్ చెన్‌కు షాకిచ్చిన సేన్, విక్టర్‌ను నిరోధించడానికి తన సర్వశక్తులు ఒడ్డేందుకు సమాయత్తమయ్యాడు.



హాకీ కుర్రాళ్లు.. నాకౌట్ ఫైట్‌కు సిద్ధం

గ్రూప్ దశలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చిన భారత పురుషుల హాకీ జట్టు నాకౌట్ సమరానికి సిద్ధమైంది. ఆదివారం జరగనున్న క్వార్టర్ ఫైనల్స్‌లో బ్రిటన్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. గ్రూప్-బిలోని తమ చివరి మ్యాచ్‌లో టోక్యో ఒలింపిక్స్ రన్నరప్ ఆస్ట్రేలియాపై 3-2తో విజయం సాధించి, అగ్రశ్రేణి జట్లకు హెచ్చరికలు పంపిన భారత్ క్వార్టర్స్ పోరులో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఒకే ఒక్క ఓటమితో గ్రూప్ దశలో రెండో స్థానంలో నిలిచిన భారత్, ఈసారి టోక్యో ఒలింపిక్స్ కంటే మెరుగైన ప్రదర్శన చేయాలని పట్టుదలతో ఉంది. చివరిగా కంగారూలతో జరిగిన మ్యాచ్‌లో భారత్ జట్టు దూకుడుగా ఆడడంతో పాటు అద్భుతమైన సమన్వయం కనబర్చింది. మిడ్‌ఫీల్డ్‌లో మన్‌ప్రీత్, హార్దిక్ సింగ్, ఫార్వర్డ్ లైన్‌లో గుర్జంత్, సుఖ్‌జీత్ సింగ్ అంచనాలకు తగ్గట్టు ఆడుతుండడం భారత్‌కు సానుకూలాంశం. బ్రిటన్ దాడులకు వెటరన్ గోల్‌కీపర్ శ్రీజేష్ అడ్డుగోడలా నిలిస్తే భారత్ గెలుపునకు తిరుగుండదు.

ఆ ఒక్క గురి హ్యాట్రిక్ చేజారి..

ఒక్క తూటా.. ఒకే ఒక్క తూటా మను భాకర్ చరిత్ర సృష్టించే అవకాశాన్ని చేజార్చింది. ఇప్పటికే రెండు పతకాలు సాధించిన మను 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లోనూ ఫైనల్‌కు వెళ్లడంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. మూడో స్థానం కోసం జరిగిన షూటాఫ్‌లో మను మూడు షాట్లు మాత్రమే కొట్టగా.. ప్రత్యర్థి నాలుగు షాట్లతో ముందుకెళ్లింది. దీంతో లక్ష్య ఛేదనలో కొద్దిలో గురి తప్పిన ఈ హరియాణా షూటర్ నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయినా ఇప్పటికే రెండు పతకాలతో దేశ ఖ్యాతిని పెంచిన మనుపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.



మూడో పతకాన్ని త్రుటిలో కోల్పోయిన మను భాకర్

25మీ. పిస్టల్ ఈవెంట్‌లో నాలుగో స్థానంతో సరి

పారిస్: సంచలన ప్రదర్శనతో రికార్డుల మోత మోగించిన యువ షూటర్ మను భాకర్ పారిస్ గేమ్స్ ప్రస్థానం ముగిసింది. శనివారం జరిగిన 25మీ. పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో అద్భుత పోరాటాన్ని కనబరచిన మను త్రుటిలో పతకాన్ని చేజార్చుకుంది. 28 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. దీంతో ఒకే ఒలింపిక్స్‌లో మూడు పతకాలతో చరిత్ర సృష్టిద్దామనుకున్న భాకర్ ఆశలకు బ్రేక్ పడినట్టయ్యింది. ఇప్పటికే మను మహిళల వ్యక్తిగత 10మీ. ఎయిర్ పిస్టల్‌తో పాటు మిక్స్‌డ్ టీమ్‌లో సరబ్‌జోత్‌తో కలిసి కాంస్య పతకాలు సాధించిన విషయం తెలిసిందే. కాగా, ఈ పోటీలో కొరియా షూటర్ జిన్ యాంగ్ (37)కు స్వర్ణం, ఫ్రాన్స్‌కు చెందిన కమిలె జెద్రెజెస్కికి రజతం, వెరోనిక(హంగేరి)కు కాంస్యం దక్కింది. భారత్ నుంచి గతంలోనూ షూటర్లు జాయ్‌దీప్ కర్మాకర్ (2012), అభినవ్ బింద్రా (2016), అర్జున్ బబుతా (2024) నాలుగో స్థానంలో నిలిచిన వారిలో ఉన్నారు.

షూటాఫ్‌లో తడబాటు

ఫైనల్‌లో భాగంగా స్టేజి1లో జరిగే మూడు సిరీస్‌ల్లో ఒక్కో షూటర్ 15 షాట్లు కొట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత స్టేజి2 ఎలిమినేషన్‌లో 4-10 సిరీస్‌లు జరుగుతాయి. అయితే పోటీని మను పేలవంగానే ఆరంభించినప్పటికీ క్రమక్రమంగా పర్ఫెక్ట్ షాట్లతో తన స్థానాలను మెరుగుపర్చుకుంటూ కొద్ది క్షణాల పాటు నెంబర్‌వన్‌గానూ నిలిచింది. కానీ అదే నిలకడను కొనసాగించలేక మూల్యం చెల్లించుకుంది. స్టేజి1 తొలి సిరీస్‌లో ఐదు టార్గెట్లలో రెండు మాత్రమే కొట్టింది. కానీ వెంటనే పుంజుకుని తర్వాత రెండు సిరీస్‌ల్లో నాలుగేసి షాట్లతో మొత్తం 10 పాయింట్లతో రెండో స్థానానికి వెళ్లింది. ఆ తర్వాత ఎలిమినేషన్ రౌండ్‌లో భాకర్ ఐదో సిరీస్‌ను ఐదు షాట్లతో ముగించి భేష్ అనిపించుకుంది. ఏడో సిరీస్‌లో రెండు వరుస షాట్లతో కాసేపు భాకర్ టాప్‌లోకి వెళ్లినా, ఆ తర్వాత మూడో షాట్ మిస్ అయింది. అటు జిన్ యాంగ్ మూడు వరుస షాట్లతో టాప్‌లోకి వెళ్లి భాకర్‌ను మూడో స్థానంలోకి నెట్టింది. ఇక ఎనిమిదో సిరీస్‌లో మను రెండు షాట్లు మాత్రమే కొట్టగా, వెరోనిక మూడు షాట్లతో ఇద్దరూ 28 పాయింట్లతో మూడో స్థానంలో నిలవాల్సి వచ్చింది. వాస్తవానికి ఇక్కడ మను మరో షాట్ సరిగ్గా కొట్టి ఉంటే 29 పాయింట్లతో షూటాఫ్ ఆడాల్సి వచ్చేది కాదు. టాప్-3లోకి వెళ్లి కనీసం కాంస్యమైనా దక్కించుకునేది. షూటాఫ్‌లోనూ భాకర్ 3 షాట్లు, వెరోనిక 4 షాట్లు కొట్టడంతో భారత షూటర్‌కు నిరాశ తప్పలేదు.

మెరిసిన మహేశ్వరి

పురుషుల స్కీట్ ఈవెంట్‌లో అనంత్ జీత్ నరుకకు నిరాశే ఎదురైంది. రెండో రోజు క్వాలిఫికేషన్ రౌండ్‌లో తను 24వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు. అటు మహిళల స్కీట్ తొలి రోజు క్వాలిఫికేషన్‌లో మహేశ్వరి చౌహాన్ 71 పాయింట్లతో 8వ స్థానంతో ఆకట్టుకుంది. దీంతో ఫైనల్‌కు అర్హత సాధించే టాప్-6లో ఉండేందుకు తన అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. మరో షూటర్ రైజా ధిల్లాన్ 66 పాయింట్లతో 25వ స్థానంలో కొనసాగుతోంది. ఆదివారం జరిగే మరో ఐదు రౌండ్లలో ఫైనలిస్టులు ఖరారవుతారు.

ఒత్తిడి లేదు..

'కొద్దిలో పతకం మిస్ అయినందుకు షూటర్ మను భాకర్ భావోద్వేగానికి లోనైంది. రెండు పతకాలు సాధించినప్పటికీ.. మూడో ఈవెంట్‌లో ఓటమి బాధ కలిగించింది. నాలుగో స్థానం అంత మంచిది కాదు' అని కన్నీటిని ఆపుకొంటూ భాకర్ తెలిపింది. అయితే తానేమీ ఒత్తిడిలో బరిలోకి దిగలేదని స్పష్టం చేసింది. లాస్ ఏంజిల్స్‌లో తిరిగి సత్తా చూపుతానని విశ్వాసం వ్యక్తం చేసింది. 'మ్యాచ్ అయిపోయాక ఫలితం గురించి ఆలోచించకుండా ప్రశాంతంగా కూర్చుని పోటీ ఫలితాన్ని విశ్లేషించుకోవాలని నా కోచ్ జస్పాల్ రాణా చెప్పాడు. నన్ను వాస్తవిక స్థితిలో ఉంచేందుకు ఆయన చేసిన ప్రయత్నం గొప్పది. మూడో పతకం కోసం నాపై ఎలాంటి ఒత్తిడీ లేదు. టోక్యో గేమ్స్‌లో ఆత్మవిశ్వాసంతో లేను. ప్రతీ దానికి భయపడుతూ ఉండేదాన్ని. కానీ ఇప్పుడు నాలో అనుభవంతో కూడిన మార్పు వచ్చింది. దీనికి నా కోచ్ రాణా కారణం' అని మను పేర్కొంది.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
చైనా	16	11	9	36
ఫ్రాన్స్	12	14	15	41
ఆస్ట్రేలియా	12	7	5	24
అమెరికా	11	20	20	51
బ్రిటన్	10	10	12	32
కొరియా	9	7	5	21
జపాన్	8	5	9	22
ఇటలీ	6	8	4	18
నెదర్లాండ్స్	5	4	4	13
జర్మనీ	4	3	2	9
భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

పారిస్‌లో నేటి భారతం



షూటింగ్: పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ **క్వాలిఫికేషన్ స్టేజ్ 1, 2:** విజయ్‌వీర్ సిద్ధు, అనీష్ (మ. 12.30), మహిళల స్కీట్ **క్వాలిఫికేషన్ రెండో రోజు**- రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ (మ.1).
గోల్ఫ్: పురుషుల వ్యక్తిగత స్ట్రోక్ ప్లే 4వ రౌండ్ - శుభాంకర్, గగన్‌జీత్ (మ. 12.30)
హాకీ: క్వార్టర్‌ఫైనల్: భారత్ x బ్రిటన్ (మ. 1.30).
అథ్లెటిక్స్: మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్‌చేజ్ రౌండ్ 1 - పారుల్ చౌధరి (మ. 1.35); పురుషుల లాంగ్ జంప్ క్వాలిఫికేషన్: జెస్విన్ ఆల్డ్రిన్ (మ. 2.30).
బాక్సింగ్: మహిళల 75 కిలోల క్వార్టర్‌ఫైనల్స్: లవ్లీనా బోర్గోహైన్ x లి కియాన్ (చైనా) (మ. 3.02).
బ్యాడ్మింటన్: పురుషుల సింగిల్స్ సెమీఫైనల్: లక్ష్యసేన్ x విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్) (మ. 3.30).
సెయిలింగ్: పురుషుల డింగీ **రేసు 7,8** - విష్ణు శరవణన్ (మ. 3.35); మహిళల డింగీ **రేసు 7,8** - నేత్ర కుమనన్ (సా. 6.05).

ఆధిక్యం దక్కినా..

క్వార్టర్స్‌లో దీపిక ఓటమి



అత్యున్నత వేదికపై వెటరన్ ఆర్చర్ దీపికా కుమారి మరోసారి తడబడింది. వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన దీపిక.. పతకం లేకుండానే వెనుదిరిగింది. దీంతో ఆర్చరీలో భారత పోరాటం ముగిసింది. శనివారం జరిగిన రికర్వ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్స్‌లో దీపిక 4-6తో సుహయోన్ నామ్ (కొరియా) చేతిలో పరాజయం పాలైంది. అంతకుముందు ప్రీక్వార్టర్స్‌లో దీపిక 6-4తో మిచెల్లీ క్రొపెన్ (జర్మనీ)ని ఓడించింది. లండన్, రియో, టోక్యోలో విఫలమైన దీపికపై ఈసారి పెద్దగా అంచనాలు లేకుండానే బరిలోకి దిగింది. కానీ, వ్యక్తిగత ఈవెంట్‌లో క్వార్టర్స్ చేరిన ఏకైక భారత ఆర్చర్‌గా అందరినీ ఆశ్చర్యపర్చింది. ఇక, పతకంపై ఆశలు రేపిన టీనేజర్ భజన్ కౌర్ షూటాఫ్‌లో ఎలిమినేట్ అయింది. ప్రీ క్వార్టర్స్‌లో కౌర్ 5-6తో దియానంద (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది.

23వ స్థానంలో శరవణన్

సెయిలింగ్ పురుషుల డింగీ ఈవెంట్‌లో విష్ణు శరవణన్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ఐదో రేస్‌లో 21వ స్థానంలో నిలిచిన శరవణన్.. ఆరో రేస్‌లో 13వ స్థానం దక్కించుకొన్నాడు. ఓవరాల్‌గా ఆరు రేస్‌లు ముగిసే సరికి విష్ణు 23వ స్థానంలో నిలిచాడు. మహిళల డింగీ ఈవెంట్‌లో నేత్ర కుమనన్ రేస్-4లో 28వ, రేస్-5లో 28వ, రేస్-6లో 20వ స్థానాల్లో నిలిచింది. ఓవరాల్‌గా 24వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. ఓపెనింగ్ 10 సిరీస్‌ల్లో టాప్-10 నెట్ స్కోర్లు సాధించిన సెయిలర్లు మెడల్ రేస్‌కు అర్హత సాధిస్తారు.

ఆమెకు పతకం ఖరారు



విల్లెపింటె (ఫ్రాన్స్): పురుష లక్షణాలున్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ పారిస్ ఒలింపిక్స్‌లో పతకం ఖాయం చేసుకుంది. శనివారం జరిగిన మహిళల 66 కిలోల విభాగం క్వార్టర్స్ బౌట్‌లో ఖెలిఫె 5-0తో అన్నా లూకా హమోరి (హంగేరి)ని చిత్తు చేసి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఖెలిఫె సెమీస్‌లో ఓడినా కనీసం కాంస్య పతకం దక్కుతుంది. 25 ఏళ్ల ఖెలిఫ్ టోక్యోలోనూ పోటీపడ్డా, క్వార్టర్స్‌లోనే ఓడింది. కానీ, ఈసారి పట్టుదలగా పోరాడి పతకాన్ని ఖరారు చేసుకుంది. కాగా, మహిళల బాక్సింగ్ పోటీలో ఓ పురుషుడిని ఎలా అనుమతిస్తారంటూ ఖెలిఫ్‌పై సోషల్ మీడియాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్, ప్రముఖ రచయిత్రి జేకె రౌలింగ్‌లాంటి ప్రముఖులు ఖెలిఫ్‌ను మహిళల బాక్సింగ్‌లో ఆడించడాన్ని తప్పుపట్టారు.

బ్యాటింగ్‌పైనే దృష్టి

శ్రీలంకతో రెండో వన్డే నేడు



మధ్యాహ్నం 2.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

కొలంబో: సునాయాసంగా నెగ్గాల్సిన తొలి వన్డేను స్టార్ బ్యాటర్లతో కూడిన టీమిండియా టైతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కీలక తరుణంలో విజృంభించిన శ్రీలంక స్పిన్నర్లు జట్టును ఓటమినుంచి గట్టెక్కించారు. ఈనేపథ్యంలో రెండు జట్ల నడుమ ఆదివారంనాటి రెండో వన్డే ఆసక్తిగా సాగడం ఖాయం. కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ వంటి స్టార్ బ్యాటర్లున్నా మొదటి వన్డేలో..231 పరుగుల మోస్తరు లక్ష్యాన్ని భారత్ ఛేదించలేక పోయింది. కెప్టెన్ రోహిత్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో గిల్‌తో కలిసి తొలి వికెట్‌కు 75 రన్స్‌తో తిరుగులేని ఆరంభం ఇచ్చాడు. ఇక ఆపై వచ్చే బ్యాటర్లు సునాయాసంగా ఛేదనను పూర్తి చేయాల్సి ఉంది. కానీ కోహ్లీ, అయ్యర్, అక్షర్ పటేల్ కుదురుకుంటున్న తరుణంలో వికెట్లు పారేసుకున్నారు. కేఎల్ రాహుల్ కూడా విఫలమయ్యాడు. మొత్తంగా ప్రత్యర్థి స్పిన్నర్లను ఎదుర్కోవడంలో మన బ్యాటర్లు తడబాటుకు లోనయ్యారు. మరోవైపు తొలి వన్డేను టై చేసుకున్న ఆత్మవిశ్వాసంతో ఉన్న ఆతిథ్య జట్టు భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలని పట్టుదలగా ఉంది. స్పిన్నర్లతో భారత్‌కు చెక్ పెట్టాలనుకుంటోంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లీ, శ్రేయాస్, కేఎల్ రాహుల్, శివమ్ దూబే, అక్షర్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్, సిరాజ్, అర్షదీప్.

శ్రీలంక: అసలంక (కెప్టెన్), నిస్సాంక, ఆవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్, సదీర సమరవిక్రమ, లియనాగే, వెల్లలగే, హసరంగ, అకిల దనంజయ, మహ్మద్ షిరాజ్, అసిత ఫెర్నాండో.

పిచ్/వాతావరణం: తొలి వన్డేలో మొత్తం18 వికెట్లు పడితే.. వాటిలో 13 స్పిన్నర్లే సాధించారు. అదే మాదిరి క్యాండీ పిచ్ రెండో వన్డేలోనూ స్పిన్నర్లకు అనుకూలించనుంది. మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశముంది.

ఫైనల్లో జొకోవిచ్ x అల్కారజ్



అంచనాలకు తగ్గట్టుగానే రాణించిన జొకోవిచ్, అల్కారజ్ టెన్నిస్‌లో ఒలింపిక్ స్వర్ణం కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు. ఆదివారం పురుషుల సింగిల్స్‌లో ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఎవరు గెలిచినా కెరీర్‌లో తొలి స్వర్ణం కానుంది. శుక్రవారం జరిగిన రెండో సెమీస్‌లో జొకో 6-4, 6-2తో లోరెంజో ముసెట్టి (ఇటలీ)పై సునాయాసంగా గెలిచాడు. జొకోకిది తొలి ఫైనల్ కావడం విశేషం. మరోవైపు మూడు వారాల క్రితమే వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ కోసం జొకో-అల్కారజ్ పోటీపడిన విషయం తెలిసిందే. ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని వెటరన్ జొకో ఎదురుచూస్తున్నాడు. గతంలో వీరు ఆరు సార్లు తలపడగా 3-3తో సమంగా ఉన్నారు.

జెంగ్ క్విన్‌వెన్‌కు స్వర్ణం

మహిళల సింగిల్స్ ఫైనల్లో చైనాకు చెందిన ఆరో సీడ్ జెంగ్ క్విన్‌వెన్ స్వర్ణం సాధించింది. శనివారం గంటా 45 నిమిషాల పాటు జరిగిన ఫైనల్లో జెంగ్ 6-2, 6-3తో వెకిక్ డొన్నా (క్రొయేషియా)ను ఓడించింది.

విడిపోయారు.. విజయంతో కలిశారు!



పారిస్: వాళ్లిద్దరూ మూడేళ్లపాటు కలిసి తిరిగారు.. అందమైన ప్రేమపక్షులని అనిపించుకున్నారు.. ఏమైందో ఏమో కానీ.. సరిగ్గా పారిస్ ఒలింపిక్స్ ఆరంభానికి వారం రోజుల ముందు విడిపోతున్నట్టు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. కానీ, దేశం కోసం విశ్వక్రీడల్లో కలిసి ఆడారు.. ఏకంగా చాంపియన్లుగా నిలిచారు. వాళ్లే చెక్ రిపబ్లిక్‌కు చెందిన టెన్నిస్ స్టార్లు కేటరీనా సినియకోవా, టొమాస్ మచాక్. వీళ్లిద్దరూ పారిస్‌లో టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కలిసి బరిలోకి దిగారు. ఫైనల్లో ఈ జోడీ 6-2, 5-7, 10-8తో చైనా జంట వాంగ్ గ్జిన్యూ-జాంగ్ జిజెన్‌ను ఓడించి స్వర్ణ పతకం సాధించారు. గెలిచిన ఆనందంలో ఇద్దరూ కోర్టులోనే హగ్ చేసుకున్నారు.. ముద్దులు కూడా పెట్టుకున్నారు. దీంతో.. 'మీరిద్దరూ ఇంకా ప్రేమికులేనా!' అని విజయానంతరం పాత్రికేయులు అడిగారు. ఇందుకు.. 'అది మా వ్యక్తిగతం. మీకు చెప్పాల్సిన పని లేదు' అని సినియకోవా పేర్కొనగా.. మచాక్ మాత్రం 'అది టాప్ సీక్రెట్' అని నవ్వుతూ బదులివ్వడం విశేషం. దీంతో విడిపోయిన ప్రేమపక్షులు విజయంతో మళ్లీ కలిశారన్న కామెంట్లు వినిపిస్తున్నాయి.

మూడో డోపీ దొరికాడు



పారిస్: ఒలింపిక్స్‌లో మూడో డోపింగ్ కేసు బయటపడింది. అఫ్ఘానిస్థాన్ జుడోకా మహ్మద్ సమీమ్ ఫైజాద్ డోపీగా తేలాడు. 81 కిలోల విభాగంలో తొలి బౌట్‌కు ముందు అతడి నుంచి సేకరించిన శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరకాలున్నట్టు నాడా ప్రకటించింది. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో స్ప్రింటర్ బెన్ జాన్సన్ వాడినట్టు తేలిన స్టానోజొలోల్ అవశేషాలను గుర్తించినట్టు పేర్కొంది. వెంటనే అతడిని ఒలింపిక్స్ నుంచి బహిష్కరించారు.



చెస్ బాక్సింగ్‌లో మెరిసిన కామారెడ్డి ప్లేయర్లు

హైదరాబాద్: ఆసియా చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పది పతకాలు సాధించిన కామారెడ్డి ప్లేయర్లను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లో సీఎంను చెస్ బాక్సింగ్ క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిసి, తాము సాధించిన పతకాలను చూపారు. గత నెల 26 నుంచి 29వ తేదీ వరకు కోల్‌కతా వేదికగా జరిగిన ఈ పోటీల్లో మహిళల సీనియర్ విభాగంలో టీ.ప్రతిభ ఐదు స్వర్ణ పతకాలు, ఒక రజతంతో మెరవగా, పురుషుల కేటగిరీలో విజయ్ రాఘవేంద్రరావు రెండు రజతాలు సాధించాడు. సబ్ జూనియర్ విభాగంలో పోచారం రుషాంక్ రెడ్డి రెండు పసిడి పతకాలు కొల్లగొట్టాడు.


ఏసీబీ అధికారులకు చిక్కిన ధర్మేందర్, తహసీల్దార్ జాహెద్‌పాషా, అమ్జద్‌పాషా

ఏసీబీ వలలో కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 3: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ జాహెద్‌పాషా శనివారం ఏసీబీ వలకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి వివరాల ప్రకారం.. ఓదెల మండలం చిన్నకొమిరె గ్రామానికి చెందిన కడెం తిరుపతికి కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామ శివారులో 28 గుంటల భూమి ఉంది. అయితే బ్యాంకు రుణం కోసం పహాణి నకల్ అవసరం ఉండటంతో అందుకు రూ.10 వేలు ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేశాడు. దీంతో తిరుపతి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తిరుపతి నుంచి తాత్కాలిక ఉద్యోగి దాసరి ధర్మేందర్, తహసీల్దార్ డ్రైవర్ అమ్జద్‌పాషా రూ.10 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. తిరుపతి తండ్రి పేరు మీద ఉన్న భూమిని విరాసత్ చేసేందుకు ధర్మేందర్, అమ్జద్ పాషాల ద్వారా రూ.50వేల లంచం తీసుకున్న తహసీల్దార్ గత నెల 23న మ్యుటేషన్ చేసినట్టు తెలిపారు. అయితే బ్యాంకు రుణం కోసం డాక్యుమెంట్లు, పహాణి నకలు మాన్యువల్‌గా ఇవ్వాల్సి ఉన్నందున తహసీల్దార్ లంచం డిమాండ్ చేశాడన్నారు. ఈ క్రమంలో తహసీల్దార్ అడిగిన మొత్తం తిరుపతి నుంచి ధర్మేందర్, అమ్జద్‌పాషా తీసుకుంటుండగా పట్టుకున్నామని, వారిద్దరి వాంగ్మూలం మేరకు తహసీల్దార్‌ను అరెస్టు చేశామని తెలిపారు. వీరిని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్టు చెప్పారు.

దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్ గడువు పొడిగింపు

హైదరాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఉద్దేశించిన 'దోస్త్' ప్రత్యేక కౌన్సెలింగ్ గడువును అధికారులు పొడిగించారు. రూ.400 అదనపు రుసుముతో ఈనెల 5 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు దోస్త్ కన్వీనర్ ఆచార్య లింబాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న సీట్లు కేటాయిస్తామని, ఈనెల 9లోపు కాలేజీల్లో చేరాలని సూచించారు.

నదుల అనుసంధానంపై 9న ఎన్‌డబ్ల్యూడీఏ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై చర్చించేందుకు ఈ నెల 9న జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్‌లో సమావేశం కానుంది. ఈ సమావేశంలో ప్రధానంగా తెలంగాణ అభ్యంతరాలపై అంశాల వారీగా చర్చించి, అభిప్రాయాలు తీసుకోనుంది. నదుల అనుసంధానంలో ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అనుసరిస్తోంది. ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తే.. ఈ ప్రాజెక్టుకు కేవలం 24 కిలోమీటర్ల దిగువలోనే తుపాకులగూడెం(సమ్మక్కసాగర్) బ్యారేజీ ఉందని, ఇచ్చంపల్లి నుంచి వరదను ఆకస్మికంగా విడుదల చేస్తే నియంత్రించే పరిస్థితుల్లేవని తెలంగాణ చెబుతున్న విషయం తెలిసిందే.

సీతారామపై జీఆర్ఎంబీ భేటీ 13కు వాయిదా

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం డీపీఆర్‌పై అధ్యయనానికి సమయం కావాలని, బోర్డు సమావేశాన్ని ఈ నెల 6న కాకుండా సెప్టెంబరు తొలివారంలో నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) తిరస్కరించింది. ఏ డీపీఆర్‌పై అధ్యయనం చేయాలన్నా ఒక్క రోజు సరిపోతుందని, తాము వారం రోజులు సమయమిస్తున్నామని.. ఈనెల 13న బోర్డు సమావేశం ఉంటుందని ప్రకటించింది. ఈ మేరకు తెలుగు రాష్ట్రాలకు సమాచారం అందించింది. డీపీఆర్‌పై చర్చించి, తదుపరి అనుమతి కోసం టెక్నికల్ అడ్వయిజరీ కమిటీకి పంపించాల్సి ఉంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పుల్‌కల్, ఆగస్టు 3: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం లక్ష్మీసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఉమ్లానాయక్ తండాలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన నేనావత్ బాల్‌సింగ్ (41)కు రెండు ఎకరాల భూమి ఉండగా, అప్పులు ఎక్కువ కావడంతో ఓ ఎకరం అమ్మేశాడు. మరో ఎకరంలో వ్యవసాయ పెట్టుబడులు, ఇతర అవసరాల కోసం మరిన్ని అప్పులు చేశాడు. రుణం తీర్చే మార్గం కనిపించకపోవడంతో శనివారం క్రిమిసంహారక మందు తాగాడు. అతన్ని 108లో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే చనిపోయాడు. బాల్‌సింగ్‌కు భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

'గ్రూప్-1' కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకం

హైదరాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం తెలుగు అకాడమీ సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాన్ని ముద్రించింది. తెలుగు మాధ్యమంలో చదువుకునే విద్యార్థులు ఆ అంశాలను సులువుగా అర్థం చేసుకునేందుకు వీలుగా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం తెలిపారు. ఈ పుస్తకాన్ని ఆదె సత్యనారాయణ, మోదాల మల్లేష్, పిడిగం సైదయ్య రచించారు. శనివారం ఈ పుస్తకంతో పాటు మరికొన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను తెలుగు అకాడమీ సంచాలకులు, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎ.దేవసేన తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

సైబర్ క్రైమ్‌కు విప్ రాంచందర్ నాయక్ ఫిర్యాదు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రతినిధుల మాటలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ బషీరాబాద్ సైబర్ క్రైమ్ ఏసీపీని ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్ కోరారు. శనివారంనాడు ఆయన్ను కలిసి ఈమేరకు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీలో ప్రజాప్రతినిధుల మాటలను వక్రీకరించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దళిత, గిరిజన ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని ఏసీపీ దృష్టికి తెచ్చారు. ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సౌదీ వచ్చిన 3 రోజులకే గుండెపోటుతో మృతి

విషయం తెలియక పారిపోయాడంటూ యజమాని కేసు

మృతుడు కామారెడ్డి వాసి.. మార్చురీలో నెల తర్వాత గుర్తింపు

(గల్ఫ్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కొలువు కోసం సౌదీకొచ్చిన తెలంగాణ వాసి మూడు రోజులకే మృత్యువాతపడ్డాడు. ఇది తెలియని యజమాని, విధులకు రాకుండా అతడు పారిపోయాడంటూ కేసు పెట్టాడు. అయితే నెల రోజుల తర్వాత అతడు చనిపోయిన విషయం స్వదేశంలోని అతడి కుటుంబసభ్యులకు తెలిసింది. మృతుడు కామారెడ్డి జిల్లా శబ్దిపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ షరీఫ్ (39). డ్రైవర్‌గా పనిచేసేందుకు సౌదీ రాజధాని రియాద్‌కు జూన్ 3న వచ్చాడు. తర్వాత మూడు రోజులకే సమీపంలోని అజీజీయా పార్కులో అతడు గుండెపోటుతో మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి గురించి నెలరోజుల దాకా ఎవ్వరూ ఆరా తీయకపోవడం, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో బయోమెట్రిక్ విధానంతో వివరాలు కనుక్కున్నారు. దీనిపై రియాద్‌లోని ప్రముఖ సామాజిక సేవకుడు షిహాబ్ కొత్తుకాడ్, సిద్దిఖ్ తువూర్లకు సమాచారమిచ్చారు. కాగా వీసా వివరాలను తనిఖీ చేస్తే విధి నిర్వహణ నుంచి షరీఫ్ పారిపోయినట్లుగా షరీఫ్ పేరు బ్లాక్ లిస్టులో ఉంది. పాస్‌పోర్టు ఆధారంగా మృతుడి కుటుంబసభ్యులను భారత రాయబార కార్యాలయం అధికారుల ద్వారా సంప్రదించి షరీఫ్ మరణవార్తను తెలియజేశారు. సౌదీలోనే ఉండే మృతుడి కుటుంబీకుల్లో ఒకరు ఆ మృతదేహం షరీఫ్‌దేనని గుర్తించారు. భారత రాయబార కార్యాలయం ఖర్చులతో మృతదేహాన్ని ఇటీవల స్వదేశానికి తరలించారు. ఇక కామారెడ్డి జిల్లాలోనే తాడ్వాయి మండలం అరగొండకు చెందిన శ్యామయ్య కూడా అనారోగ్యంతో సౌదీలోని ఆస్పత్రిలో చేరాడు. ఫోన్ స్విచాఫ్ రావడంతో విషయాన్ని కుటుంబీకులు విచారించగా అతడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలుసుకున్నారు. శ్యామయ్య మృతదేహాన్ని కూడా ఇటీవల స్వదేశానికి తరలించారు.

వర్గీకరణ చట్టరూపం దాల్చేవరకు కలిసి సాగుదాం

సీఎం రేవంత్‌కు రుణపడి ఉంటాం: దామోదర

బేగంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్ట రూపం దాల్చేవరకు కలిసికట్టుగా ముందుకు సాగాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్రాలు వర్గీకరణను చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు నివ్వడం హర్షణీయమని వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లోని బేగంపేట ప్లాజా హోటల్‌లో 'ఎస్సీ వర్గీకరణ-మాదిగల భవిష్యత్' అనే అంశంపై మాదిగ ప్రజా ప్రతినిధులు, నేతల సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దామోదర మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రాతో సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించడం వల్లే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామన్న సీఎంకు రుణపడి ఉంటామన్నారు. ఎస్సీ వర్గీకరణకు నిపుణులతో కమిటీ వేసి ఆర్డినెన్స్ తేవాలని ఆయన్ను కోరతామని చెప్పారు. మాదిగల సమ్మేళనం పేరుతో ఈనెల 16 లేదా 17వ తేదీల్లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి సీఎంను ఆహ్వానించి.. సన్మానించనున్నట్టు తెలిపారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసి మాదిగ జాతికి చంద్రబాబు ఎంతో మేలు చేశారన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్యతో పాటు పలువురు దళిత నేతలు పాల్గొన్నారు.


మాదిగ ప్రజా ప్రతినిధులు, నేతల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఎన్వీ రమణతో మందకృష్ణ మాదిగ భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మాజీ సీజేఐ ఎన్వీ రమణతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ భేటీ అయ్యారు. శనివారం ఢిల్లీలోని రమణ నివాసంలో ఆయనను మంద కృష్ణ కలిసి శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడం తనకెంతో సంతోషంగా ఉందని, ఇప్పటి వరకు సాధించిన దాన్ని పకడ్బందీగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉందని ఈ సందర్భంగా రమణ తెలిపారు. మందకృష్ణను పూలమాలతో అభినందించారు. సుప్రీం తీర్పును పకడ్బందీగా ఎలా అమలు చేయాలన్న అంశంపై సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎన్వీ రమణను మందకృష్ణ మాదిగ కోరారు.

3 లక్షల కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

సారించాలని సూచించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ విడుదల చేసిన వార్షిక నివేదికను ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే..! ఇందులో రాష్ట్ర ఆర్థిక స్థితిని కాగ్ సాంతం మదింపు చేసింది. రాష్ట్ర అప్పుల విధానాన్ని తూర్పారబట్టింది. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అప్పులు 2022-23 సంవత్సరానికి రూ.3,49,537 కోట్లుగా ఉన్నట్లుగా పేర్కొన్న కాగ్.. వివిధ కార్పొరేషన్ల పేర తీసుకున్న గ్యారెంటీ రుణాలు మరో రూ.1,18,629 కోట్లని గుర్తుచేసింది. అంటే.. మొత్తం అప్పు రూ.4,68,166 కోట్లుగా ఉన్నట్లు స్పష్టం చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి 2032-33 వరకు.. మొత్తం పదేళ్లలో ఈ అప్పుల అసలు, వడ్డీల సొమ్మును చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. అంతేకాకుండా.. జాతీయ చిన్న మొత్తాల పొదుపు నిధికి రూ.9,477 కోట్లు, భారత జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)కు రూ.36 కోట్లు, భారత సాధారణ బీమా సంస్థకు రూ.7 కోట్లు, ఉదయ్ బాండ్లకు సంబంధించి రూ.8,031 కోట్లు, వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు(నాబార్డ్)కు రూ.5,526 కోట్లు, జాతీయ సహకారాభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ)కు రూ.59 కోట్లను చెల్లించాలని వివరించింది. ఇలా పదేళ్లలో బడ్జెట్ రుణాలు, గ్యారెంటీ రుణాలు, ఇతర ఆర్థిక సంస్థల అప్పులకు సంబంధించి అసలు, వడ్డీల కింద మొత్తం రూ.2,90,154 కోట్లను చెల్లించాల్సి ఉంటుంది. ఇది ప్రస్తుత బడ్జెట్‌కు దాదాపు సమానం కావడం గమనార్హం..! ఈ పరిస్థితులు ప్రభుత్వాన్ని గణనీయమైన ఒత్తిడికి గురిచేస్తాయని కాగ్ ఆందోళన వ్యక్తం చేసింది.



మూలధన వ్యయం 9 శాతమే

సాధారణంగా భవనాలు, రోడ్లు, ప్రాజెక్టులు వంటి వాటిని నిర్మించి, ఆస్తులను సృష్టించడానికి వెచ్చించే నిధుల మొత్తాన్ని మూలధన వ్యయంగా పరిగణిస్తారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం పెట్టిన మొత్తం వ్యయంలో ఈ మూలధన వ్యయం 9 శాతమేనని కాగ్ వెల్లడించింది. అంతకుముందు సంవత్సరం మూలధన వ్యయం కింద రూ.28,874 కోట్లను వినియోగిస్తే.. 2022-23లో 38% తగ్గుదలతో రూ.17,881 కోట్లను మాత్రమే ఖర్చు చేశారని గుర్తుచేసింది. గడిచిన ఐదేళ్లలో 2018-19లో మూలధన వ్యయం 18శాతంగా ఉన్నట్లు తెలిపింది.

పదేళ్లలో అసలు, వడ్డీల కింద ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం (రూ.కోట్లలో)

సంవత్సరం	తీర్చాల్సిన అసలు	చెల్లించాల్సిన వడ్డీ	మొత్తం
2023-24	9,341	20,825	30,166
2024-25	13,118	19,945	33,063
2025-26	15,850	18,842	34,692
2026-27	19,786	17,588	37,374
2027-28	17,050	16,102	33,152
2028-29	4,461	14,858	19,319
2029-30	2,449	14,541	16,990
2030-31	4,500	14,353	18,853
2031-32	7,311	14,032	21,343
2032-33	8,587	13,479	22,066
మొత్తం	1,02,453	1,64,565	2,67,018

జీఎస్టీ కింద రూ.986 కోట్ల నష్టం

వస్తు సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లలో చోటు చేసుకున్న అక్రమాలు, అవకతవకల వల్ల ఐదేళ్ల కాలంలో ఖజానాకు రూ.986 కోట్ల నష్టం వాటిల్లినట్లు కాగ్ ఆక్షేపించింది. 2017-22 మధ్య ఐదేళ్ల కాలంలో పలు అక్రమాలు జరిగాయని తెలిపింది. ముఖ్యంగా పన్ను ఎగవేతలు, కొన్ని కేసుల్లో తక్కువ పన్నును వసూలు చేయడం, కొన్నింటిలో జరిమానాలు వసూలు చేయకుండా వదిలేయడం వల్ల నష్టపోయినట్లు వివరించింది.

హైదరాబాద్‌కు నిధులేవి?

హైదరాబాద్‌ను విశ్వనగరం చేస్తామని, 2020-21 నుంచి ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో భాగంగా 2020-21 బడ్జెట్‌లో మూసీ ప్రక్షాళన, మూసీ పరీవాహక ప్రాంత ప్రాజెక్టు, ఇతర పథకాల పేరిట రూ.10వేల కోట్లను ప్రతిపాదించింది. 2021-22లో కూడా రూ.2,600 కోట్లు, 2022-23లో రూ.200 కోట్లు కేటాయించినా.. ఆ నిధులను విడుదల చేయలేదంటూ కాగ్ తప్పుపట్టింది. పాతనగర మెట్రో మార్గానికి రూ.500 కోట్లు, విమానాశ్రయ మెట్రో మార్గానికి రూ.378 కోట్లు కేటాయించినా.. పనులు ప్రారంభం కాకపోవడంతో ఈ మొత్తాన్ని ఉపసంహరించుకున్నట్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.11,000 కోట్లు కేటాయించి, అరకొరగా ఖర్చు చేసినట్లు గుర్తుచేసింది.

ఐఏఎస్‌లకు స్థానచలనం

- రవాణా, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్‌గా వికాస్‌రాజ్
- వాణిజ్య పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవి ఎస్సీ అభివృద్ధి శాఖకు బదిలీ

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోమారు ఐఏఎస్ అధికారుల బదిలీ జరిగింది. ఇద్దరు నాన్ ఐఏఎస్‌లు సహా ఎనిమిది మంది అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రవాణా, గృహ నిర్మాణ, సాధారణ పరిపాలనా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్‌రాజ్ పోస్టులో స్వల్ప మార్పు చేసింది. ఆయన పోస్టును రవాణా, రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రీ-డిజిగ్నేట్ చేసింది. వికాస్‌రాజ్ ఇక నుంచి రవాణా, ఆర్ అండ్ బీ, గృహ నిర్మాణ, సాధారణ పరిపాలనా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవిని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీకి వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు-భవనాల శాఖ సంయుక్త కార్యదర్శి ఎస్.హరీశ్ రెవెన్యూ శాఖలోని విపత్తుల విభాగం సంయుక్త కార్యదర్శిగా బదిలీ అయ్యారు. వ్యవసాయ, సహకార శాఖ సంయుక్త కార్యదర్శి పి.ఉదయ్‌కుమార్‌కు మార్కెటింగ్ శాఖ సంచాలకులుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంకను పురపాలక శాఖ ఉప కార్యదర్శిగా బదిలీ చేశారు. సహకార శాఖ సంయుక్త రిజిస్ట్రార్, నాన్ ఐఏఎస్ కె.చంద్రశేఖర్‌రెడ్డిని బదిలీ చేసి హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. వరంగల్ వాణిజ్య పన్నుల సంయుక్త కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని మార్క్‌ఫెడ్ ఎండీగా నియమించారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్రం నుంచి నీట్ రాసిన విద్యార్థుల ర్యాంకులను ప్రకటించింది. తెలంగాణ నుంచి ఈ దఫా 49,184 మంది క్వాలిఫై అయినట్లు గుర్తించింది. జాబితాలో ఉన్న కన్వీనర్ కోటాలో సీట్ల కోసం ఈ నెల 4వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటలదాకా వర్సిటీ వెబ్‌సైట్(https://tsmedadm.tsche.in)లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం మెరిట్ జాబితాను విడుదల చేస్తామని ప్రకటించింది. ఆ తర్వాత వెబ్ ఆప్షన్ల స్వీకరణ ఉంటుందని, కళాశాలలు, సీట్ల వివరాలను వెబ్ ఆప్షన్లకు ముందే వెల్లడిస్తామని పేర్కొంది. గత నెలలో జారీ చేసిన జీవో 33 జీవో ప్రకారం 85 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో, 15 శాతం సీట్లను ఆలిండియా కోటాలో భర్తీ చేయనున్నారు. ఇక ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 50శాతం సీట్లను కన్వీనర్ కోటాలో, మిగిలిన సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ చేయనున్నారు. కాగా, స్థానికతను గుర్తించే విషయంలోనూ స్వల్ప మార్పులు చేశారు. గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ దాకా 7ఏళ్ల కాలంలో గరిష్ఠంగా నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడే స్థానికులుగా పరిగణనలోకి తీసుకునే వారు. ఈ సారి మాత్రం 9వ తరగతి నుంచి ఇంటర్ దాకా నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడే స్థానికులుగా పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇక 9వ తరగతి కంటే ముందు ఎక్కడ చదివారనే దానితో సంబంధం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

పీజీ డెంటల్ నోటిఫికేషన్ విడుదల

వరంగల్ మెడికల్: రాష్ట్రంలో పీజీ డెంటల్ సీట్ల భర్తీకి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎండీఎస్ కోర్సులో కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేయనున్నారు. నీట్, ఎండీఎస్ 2024 పరీక్షలో అర్హత సాధించిన వారు 8వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వర్సిటీ పేర్కొంది.

ఆర్వోఆర్-2024 చట్టంతో..

ధరణిలో సవరణలకు చాన్స్

చట్టాన్ని మళ్లీమళ్లీ మార్చకుండా పలు సెక్షన్లు.. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత అసెంబ్లీలో ముసాయిదా

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో ఇంతకాలం పరిష్కారానికి వీలులేని సమస్యలకు చరమగీతం పాడేందుకు సర్కారు సిద్ధమైంది. ఇందుకోసం తీసుకురానున్న ఆర్వోఆర్-2024 ముసాయిదా బిల్లులో పరిష్కార మార్గాలను చూపించనుంది. ఆర్వోఆర్-2020 చట్టంలో పరిష్కరించలేని సమస్యలకు ఈ బిల్లులో పలు సెక్షన్లను పొందుపరిచింది.

ఏమిటా సమస్యలు?

ఆర్వోఆర్-2020 చట్టంలో కొన్ని సమస్యలకు పరిష్కారమే లేదు. ధరణి పోర్టల్ రాకముందు డాక్యుమెంట్ల ద్వారా కొనుగోలు చేసిన భూమిని మ్యుటేషన్ చేసే అధికారం ఈ చట్టంలో లేదు. భూ రికార్డుల ప్రక్షాళనలో జరిగిన తప్పులను సరిదిద్దడం, 22ఏ రిజిస్టర్‌లో నమోదైన వాటిని సవరించడానికి అవకాశాల్లేవు. అన్నింటికీ మించి.. ధరణి పోర్టల్ అమల్లోకి రావడానికి ముందు భూములను కొన్నవారి పేర్లతో కాకుండా.. పాత యజమానుల పేరిట డిజిటల్ పాస్‌పుస్తకాలను జారీ చేశారు. వాటి ఆధారంగా ఆ భూములను మళ్లీ అమ్మిన దాఖలాలున్నాయి. అలాంటి క్రయవిక్రయాలను రద్దుచేసే అధికారం 2020 చట్టం ప్రకారం రెవెన్యూ శాఖకు లేదు. దాంతో.. అలాంటి సమస్యలను కోర్టుల్లో పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు. అంతేకాదు..! ఒక్కసారి డిజిటల్ పాస్‌పుస్తకం జారీ అయితే.. దాన్ని రద్దు చేసే అధికారం కూడా పాత చట్టంలో లేదు. ఇలా అనే రకాల సమస్యలతో రైతులు సతమతమయ్యారు. వీటికి పరిష్కారంగా ప్రభుత్వం ఆర్వోఆర్-2024 చట్టాన్ని తీసుకువస్తోంది. పాత చట్టంలో కలెక్టర్లకే ఉన్న కొన్ని అధికారాలను ఆర్డీవోలు, తహసీల్దార్లకు కట్టబెట్టాలని కొత్త చట్టం ముసాయిదా బిల్లు చెబుతోంది. బాధితులు తమకు అన్యాయం జరిగిందని భావిస్తే.. అప్పీల్‌కు వెళ్లొచ్చు. ప్రతి కమతానికి శాశ్వత నంబర్‌ను కేటాయించనున్నారు. భూములకు తొలుత తాత్కాలికంగా భూధార్ నంబర్ ఇస్తారు. సర్వే తర్వాత శాశ్వత భూధార్ నంబర్‌ను కేటాయిస్తారు. ఆ నంబర్ ద్వారా కమతానికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకోవచ్చు. అంతేకాదు.. భవిష్యత్‌లో కూడా మళ్లీమళ్లీ ఆర్వోఆర్ చట్టాన్ని మార్చకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను సులభంగా అమలు చేసేందుకు వీలుగా పలు సెక్షన్లను ఈ బిల్లులో చేర్చారు. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత ఈ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు చట్టరూపుదాలిస్తే.. రైతుల ధరణి కష్టాలు తీరిపోతాయని అధికారులు చెబుతున్నారు.

	ధరణి ఆర్వోఆర్-2020	కొత్త ఆర్వోఆర్-2024 ముసాయిదా బిల్లు
వ్యవసాయ భూముల రికార్డులు	ఉన్నాయి	ఉన్నాయి
రిజిస్ట్రేషన్ అధికారం	తహశీల్దార్లకు ఉంది	తహశీల్దార్లకు ఉంది
ధరణి కంటే ముందు రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమికి తహసీల్దార్లకు మ్యుటేషన్ చేసే అధికారం	లేదు	ఉంది
ఆబాది(నివాసాలు), వ్యవసాయేతర భూములు ఇళ్లు, ఇంటి స్థలాలకు సంబంధించిన రికార్డులు	లేవు	నమోదు చేస్తారు
ఆర్వోఆర్ సవరణ	అవకాశ లేదు	అవకాశం కల్పించారు
పార్ట్-బి కేసులు పరిష్కారం	లేదు	విచారించి పరిష్కరించవచ్చు
సాదాబైనామా దరఖాస్తులు సెక్షన్ 6 పరిష్కారం	లేదు	విచారించి పరిష్కరించవచ్చు
వారసత్వం, భాగాల పంపకం, వీలునామా కింద సక్రమించిన భూమిని మ్యుటేషన్ చేసే అధికారం	కొన్నిటికి లేవు	అన్నిటికీ ఉన్నాయి
అప్పీల్‌కు వెళ్లేందుకు వెసులు బాటు	లేదు	ఉంది
అప్పీల్ విచారించే అధికారులు	లేరు	కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్, సీసీఎల్ఏ
ఇనాం, ఆక్యుపెన్సీ రైట్స్, సాదాబైనామా, కౌలుదారు చట్టం కింద సక్రమించిన మ్యుటేషన్‌కు	అవకాశం లేదు	ఆర్డీవోలు విచారించి మ్యుటేషన్ చేయవచ్చు
రికార్డుల మార్పు కోసం	అవకాశం లేదు	అవకాశం ఉంది
ప్రతి కమతానికి భూధార్ నెంబరు	లేదు	సర్వే అనంతరం పర్మినెంట్ నెంబరు ఇస్తారు

ఈ చెత్తపై సంతకం పెట్టను

టీజీఎండీసీ ఆడిట్ నివేదికలపై మంత్రి తుమ్మల అసహనం

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎండీసీ) వార్షిక ఆడిట్ నివేదికలను తొలిసారిగా శాసనసభకు సమర్పించింది. 2014-15 నుంచి 2019-20 సంవత్సరాల వరకు సంబంధించిన నివేదికలను సభ ముందు ఉంచింది. అయితే, నివేదికలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'ఈ చెత్త మీద నేను సంతకం పెట్టను..' అంటూ తీవ్ర అభ్యంతరంవ్యక్తం చేశారు. ఆడిట్ రిపోర్టు పుస్తకాలను నాసిరకంగా ముద్రించడమే ఆయన అభ్యంతరానికి కారణం. నిజానికి, గనుల శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధీనంలో ఉంది. అయితే, ఆ శాఖ శాసనసభలో ప్రవేశపెట్టే నివేదికలపై సంతకం చేసే అధికారాన్ని సీఎం రేవంత్ మంత్రి తుమ్మలకు ఇచ్చారు. దీంతో టీజీఎండీసీ వార్షిక ఆడిట్ నివేదికలను సభలో ప్రవేశ పెట్టేందుకు అధికారులు మంత్రి తుమ్మల వద్దకు తెచ్చారు. జిరాక్స్ తీసిన కాగితాలకు పిన్నులు కొట్టి పుస్తకాల్లా చేసిన వాటిని చూసిన మంత్రి ఈ చెత్త మీద సంతకం పెట్టనని తొలుత తేల్చి చెప్పారు. సభలో నివేదికలు కచ్చితంగా పెట్టాల్సి ఉండడంతో తప్పనిసరై తుమ్మల వాటిపై సంతకం చేశారు. అనంతరం ఆ నివేదికలను చూసిన పలువురు శాసన సభ్యులు కూడా ఆశ్చర్యపోయారు. వార్షిక నివేదికలు ఇలా ఇస్తే ఎలా ? అని చర్చించుకున్నారు. అయితే, శాసన సభ సమావేశాల కోసం తొలుత సిద్ధం చేసిన నివేదికలు కనిపించకుండా పోవడంతో చివరి నిమిషంలో ఇలా పుస్తకాలను తయారు చేశామని అధికారులు మంత్రికి వివరణ ఇచ్చినట్టు తెలిసింది. ఇక, విభజన సమస్యల వల్ల 2014 నుంచి ఆడిట్ నివేదికలు సమర్పించలేకపోయామని టీజీఎండీసీ తరఫున మంత్రి తుమ్మల శాసనసభకు తెలియజేశారు.

వరి, ఇతర పంటల విత్తనాల ఉత్పత్తిని పెంచాలి

ఖమ్మం మార్కెట్‌ను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలి... వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సమీక్షలో మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వరితో పాటు ఇతర పంటల విత్తనాల ఉత్పత్తిని పెంచాలని, అందుకు అధికారులు కొత్త ఆలోచనలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సచివాలయంలో వ్యవసాయ, కో-ఆపరేటివ్, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల అధికారులు, ఆయా శాఖలకు అనుబంధంగా ఉన్న కార్పొరేషన్ల చైర్మన్లతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నామని సీడ్ కార్పొరేషన్ చైర్మన్, అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,700 మంది విత్తన ఉత్పత్తిదారులు ఉన్నారని, వారంతా నాణ్యత ప్రమాణాల ప్రకారమే విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నారని, ఆ విత్తనాలను ఆగ్రోస్, డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల ద్వారా సరఫరా చేస్తున్నామని చెప్పారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పరిధిలోని గోదాములు ఖాళీగా ఉంటున్నాయని, ప్రైవేటు గోదాములు మాత్రం నిండుగా ఉంటున్నాయని.. లోపం ఎక్కడుందో గుర్తించి దాన్ని పరిష్కరించాలన్నారు. వివిధ సంస్థల అధీనంలో ఉన్న ప్రభుత్వ భూములన్నిటినీ పరిరక్షించాలని, వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే అంశంపైనా కసరత్తు చేయాలని అధికారులకు సూచించారు. 2024-25 ఏడాదిలో నిర్దేశించుకున్న మేరకు ఆయిల్‌పామ్ సాగును లక్ష ఎకరాలకు తీసుకువెళ్లాలన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను ఆధునికీకరించడానికి చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం 72 వేల బ్యాగుల నిల్వ సామర్థ్యం ఉండగా, ఆధునికీకరణతో దాదాపు 1.37 లక్షల బ్యాగులకు నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, దీంతో పాటు ఓపెన్ ఏరియాలోనూ నిల్వ ఉంచే అవకాశాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో, నూతన సాంకేతికతతో దేశంలోనే అగ్రగామి మార్కెట్‌గా ఖమ్మం మార్కెట్‌ను ఆధునికీకరించాలన్నారు. ఆ పనులు వెంటనే మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్లతో పాటు శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

‘దళితబంధు’ విక్రేతలపై కేసులు పెట్టండి

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



చింతకాని, ఆగస్టు 3: దళితబంధు యూనిట్ల క్రయవిక్రయదారులపై కేసులు నమోదు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా చింతకానిలో శనివారం దళితబంధు పథకంపై గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల ఆర్థికాభివృద్ధి కోసం చేపట్టిన దళితబంధు పథకం లక్ష్యం నెరవేరాలన్నారు. లబ్ధిదారులు తమ యూనిట్‌ను విక్రయిస్తే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి పూర్తి వివరాలు సేకరించాలని, లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులపై నివేదిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ఎండీ ముజమ్మిల్‌ఖాన్, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మధిరకు ఇండస్ట్రియల్ పార్క్ మంజూరు

మధిరటౌన్, ఆగస్టు 3: ఖమ్మం జిల్లా మధిరకు ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్‌ను మంజూరు చేసింది. శనివారం ఈ మేరకు పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ జీవో విడుదల చేశారు. మధిర మండలం యండపల్లిలోని 84.26 ఎకరాల ప్రభుత్వ భూమిలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఇండస్ట్రియల్ పార్క్‌కు కేటాయించిన భూమి వరకు బీటీ రోడ్డును మంజూరు చేసి శంకుస్థాపన చేయడమే కాకుండా పనులు కూడా ప్రారంభించారు. మధిర ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో అక్కడ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని పది సంవత్సరాలుగా డిప్యూటీ సీఎం భట్టి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. నేటికి ఆయన కృషి ఫలించింది.

విదేశీ విద్యకు ఫెలోషిప్: తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించేందుకు వెళ్లే వ్యవసాయ విద్య విద్యార్థులకు వ్యవసాయ శాఖ ఫెలోషిప్‌ను అందించనుంది. ఏడాదికి నలుగురు ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి, వారికి ఒక్కొక్కరికీ రూ.55.50 లక్షల చొప్పున మొత్తం రూ.2.22 కోట్లను అందించనున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈమేరకు అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫెలోషిప్ సాధించిన నలుగురు విద్యార్థులతో ఆయన శనివారం సచివాలయంలో మాట్లాడారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం నుంచి 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో డిగ్రీ చదివిన, చదువుతోన్న విద్యార్థులు అమెరికాలోని ఆబర్న్ యూనివర్సిటీ, అలబామా స్టేట్ యూనివర్సిటీలలో మాస్టర్స్ చేసేందుకు ఒక్కో వ్యవసాయ యూనివర్సిటీ నుంచి ఇద్దరు చొప్పున నలుగురిని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామన్నారు. తమ ప్రభుత్వం పేద విద్యార్థులతో పాటు ఆయా రంగాల్లో ప్రతిభ చూపుతున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఫెలోషిప్‌కు ఎంపికైన నలుగురు విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హైడ్రాకు 1200 మందిని ఇవ్వండి

» పురపాలక శాఖ సంచాలకుడిని కోరిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్)లో అవసరమైన సిబ్బంది కోసం సర్కారు ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు పురపాలక శాఖ సంచాలకుల(సీడీఎంఏ)ను వారి పరిధిలో ఉన్న మునిసిపాలిటీల నుంచి సిబ్బందిని సమీకరించాలని ఆదేశించింది. హైడ్రాలో పని చేయబోయే ఉద్యోగి వయసు 40 సంవత్సరాలలోపు ఉండాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అవసరాలకు, విపత్తుల నిర్వహణ సమయంలో చురుగ్గా పనిచేసే సామర్థ్యం కలిగి ఉండాలని సూచించింది. అలాగే మహిళా సిబ్బందిని పంపవద్దని కోరింది. పురపాలక శాఖ సంచాలకుల పరిధిలో ఉన్న 142 మునిసిపాలిటీల నుంచి 1200 మంది సిబ్బందిని గుర్తించి పంపాలని ఆదేశించింది. అయితే అన్ని మునిసిపాలిటీల పరిధిలో అధికారులు గాలించగా 125 మంది మాత్రమే హైడ్రా అవసరాలకు తగిన విధంగా ఉన్నారని, 1200 మందిని సమకూర్చడం తమ వల్ల కాదని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. ఇప్పటికే గుర్తించిన 125 మందిని హైడ్రాకు పంపితే పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రభావం పడుతుందని, అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నందున మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయని ప్రభుత్వానికి వివరించినట్లు సమాచారం.

బీసీ గురుకులంలో బీఏ యానిమేషన్ కోర్సు

హైదరాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బీసీ గురుకులంలో ప్రవేశపెట్టిన బీఏ యానిమేషన్ కోర్సులో చేరేందుకు 17వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ మేరకు బీసీ గురుకుల కార్యాలయం శనివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేసింది. చేవెళ్ల మండల కేంద్రంలోని బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో బీఏ యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్ కోర్సు అందుబాటులో ఉందని వెల్లడించింది. యువతలో నైపుణ్యాన్ని పెంచేందుకు, వారిలోని సృజనాత్మకతకు మెరుగులు దిద్దేందుకు వీలుగా ఈ కోర్సును ప్రవేశపెట్టినట్టు పేర్కొంది. ఈ కోర్సుకు ఇంటర్ పూర్తయిన వారు అర్హులని, వివరాలకు బీసీ గురుకుల వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపింది.

హీరా గ్రూప్ సంస్థల్లో ఈడీ సోదాలు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడికి ఎక్కువ మొత్తంలో చెల్లింపుల పేరుతో లక్షలాది మంది నుంచి రూ.వేల కోట్ల డిపాజిట్లు సేకరించి మోసగించిన హీరా సంస్థల అధినేత్రి నౌహీరా షేక్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. తాజాగా హైదరాబాద్‌లోని హీరా గ్రూప్ ప్రధాన కార్యాలయంతో పాటు ఐదు వేర్వేరు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రత్యేక బృందాలు ఏకకాలంలో దాడులు జరిపాయి. బంజారాహిల్స్‌లోని నౌహీరా షేక్ ఇల్లు, కార్యాలయంతోపాటు సంస్థ డైరెక్టర్లు, ఇతరుల ఇళ్లల్లో శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయి. తనిఖీల్లో రూ.90 లక్షల నగదు, కోట్ల విలువ చేసే స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, ఇతర డిజిటల్ ఆధారాల్ని ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా, నౌహీరా షేక్‌పై దేశవ్యాప్తంగా 60కిపైగా కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే ఈడీ సుమారు రూ.400 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేసింది.

‘జీవన్‌దాన్’కు జాతీయ పురస్కారం

సనత్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అవయదానం, మార్పిడిల్లో తెలంగాణ దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా నిలిచింది. తెలంగాణ జీవనదాన్ కార్యక్రమానికి బెస్ట్ స్టేట్ ఫర్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లంట్ ఆర్గనైజేషన్(ఎస్‌ఓటీటీఓ) అవార్డు వరించింది. 14వ అవయవ దాన దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ ఈ అవార్డును జీవన్‌దాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలతకు అందజేశారు. అలాగే, ఎస్‌ఓటీటీ ఫర్ విమెన్ పయనీర్ ఇన్ ద ఫీల్డ్ ఆఫ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ అవార్డును కూడా డాక్టర్ స్వర్ణలత అందుకున్నారు. 2012లో తెలంగాణలో జీవన్‌దాన్ కార్యక్రమం ప్రారంభమైంది. జీవన్‌దాన్ ద్వారా ఇప్పటివరకు 5,541 అవయవాలను సేకరించి రోగులకు అందించారు. ఇందులో 1,465 మందికి గుండె మార్పిడి చికిత్సలు జరిగాయి.

జీవో 317పై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన జీవో నం.317పై మంత్రివర్గ ఉప సంఘం శనివారం సమావేశమైంది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్థానికతకు సంబంధించి సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ).. మంత్రివర్గ ఉప సంఘం ముందుంచిన ప్రతిపాదనలపై చర్చించారు. ఈ ప్రతిపాదనలపై అడ్వకేట్ జనరల్(ఏజీ) నుంచి అభిప్రాయం తీసుకున్నాక నివేదిక ఇవ్వాలని జీఏడీని మంత్రివర్గ ఉపసంఘం ఈ సందర్భంగా ఆదేశించింది. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, జీఏడీ ముఖ్యకార్యదర్శి బెనహర్ మహేష్ దత్ ఎక్కా, మాజీ ఐఏఎస్‌లు శివశంకర్, బూసాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్.. ఇక ఆగదు!

(మొదటిపేజీ తరువాయి)

మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ఎలాంటి న్యాయపరమైన చిక్కుల్లేవని స్పష్టమైంది. సుప్రీంకోర్టు, హైకోర్టు నుంచి ఈ ప్రక్రియపై ఎలాంటి స్టేలు లేవని వెల్లడైంది. దీంతో ఈ అంశంపై కింది స్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, ఈ ప్రక్రియతో సంబంధం ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలన ప్రారంభించి.. నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా కార్యాచరణ చేపట్టాలని నిర్దేశించింది.



నాలుగేళ్ల నిరీక్షణకు తెర..

ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం నాటి ప్రభుత్వం 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబరు 31 వరకు రెండు నెలలపాటు దరఖాస్తులను స్వీకరించింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.70 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 3.58 లక్షల దరఖాస్తులు, జీహెచ్‌ఎంసీ పరిధిలో 1.06 లక్షలు, మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల నుంచి 13.69 లక్షలు, గ్రామ పంచాయతీల నుంచి 6 లక్షల దరఖాస్తులు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి 1.35 లక్షల దాకా దరఖాస్తులు అందాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 131 ప్రకారం ప్లాట్ యజమాని వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకుంటే రూ.1000 ఫీజు చెల్లించాలని, లేఅవుట్ డెవలపర్ దరఖాస్తు చేస్తే (ఎన్ని ప్లాట్లు ఉన్నా) రూ.10 వేలు ఫీజుగా చెల్లించాలని నిర్ణయించింది. అయితే దీనిని సవాలు చేస్తూ జువ్వాడి సాగర్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కానీ, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై హైకోర్టు నుంచి గానీ, సుప్రీంకోర్టు నుంచి గానీ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ప్రభుత్వానికి రాకపోవడంతో పురపాలక శాఖ 2023 మే 20న (లెటర్ నంబరు 14148/పీఎల్‌జీ.111/2020) ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించింది. మరోవైపు జీహెచ్‌ఎంసీ పరిధిలో లేని.. హెచ్‌ఎండీఏ పరిధిలో మాత్రమే ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి 2023 జూలై 31న జీవో 138 జారీ చేశారు. ఇదిలా ఉండగా.. తొలుత అంటే 2020 ఆగస్టు 31న ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభుత్వం ఇచ్చిన జీవో 131ని సవరిస్తూ 2020 సెప్టెంబరు 16న మరో జీవో (నంబరు 135)ను జారీ చేశారు. అయితే ఈ ఎల్‌ఆర్‌ఎస్ జీవోలను సవాలు చేస్తూ హైకోర్టులో ఎనిమిది ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై హైకోర్టు 2021 ఏప్రిల్ 28న కామన్ ఉత్తర్వులిచ్చింది. అందులో.. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన అన్ని పిటిషన్లనూ మూసేస్తున్నట్లు పేర్కొంది. అయితే ఇదే అంశంపై సుప్రీంకోర్టులో కేసు ఉన్నందున.. అక్కడ ఏదైనా తీర్పు వస్తే దానిప్రకారం వ్యవహరించాలని పేర్కొంది. కాగా, సుప్రీంకోర్టులో 2016 అక్టోబరు 18న రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిపై తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను కొనసాగించుకోవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో లక్షలాది మంది దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు మేలు చేసే ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలంటూ ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసింది.

రాజకీయ కారణాల వల్లే జాప్యం!

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల విషయంలో గత ప్రభుత్వ వైఖరే నాలుగేళ్ల జాప్యానికి దారితీసిందన్న ఆరోపణలున్నాయి. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ నేతృత్వంలో 2020 ఆగస్టు 31న జారీ చేసిన జీవో 131 ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు భారీగా పెంచడం, జీవో ఇచ్చే విషయాన్ని నాటి పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌కు చెప్పకపోవడంతో అసెంబ్లీలో దీనిపై దుమారం రేగింది. దీంతో కేటీఆర్ ఆ జీవోపై క్షమాపణ చెప్పి.. 2020 సెప్టెంబరు 16న సవరణలతో కూడిన జీవో నంబరు 135ను జారీ చేయించారు. అయితే ఈ వివాదంపై కొంత మంది కోర్టులను ఆశ్రయించారు. ఈ పిటిషన్లను హైకోర్టు కొట్టేసినా.. ప్రజల్లో వ్యతిరేకత వస్తుందన్న భయంతో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై నిర్ణయం తీసుకోలేదు. ఎన్నికల ముందు ఈ వ్యవహారం ఎందుకనే ఆలోచనలో ప్రభుత్వం ఉండడం, నాటి సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లి దీనిపై ఎవరూ అడగకపోవడం, ఆయన కూడా ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో ఈ సమస్య పరిష్కారానికి నోచుకోకుండా ఉండిపోయింది. ప్రభుత్వం మారిన తరువాత పాత ఫీజుల ప్రకారమే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించాలని ఈ ఏడాది మార్చిలో నిర్ణయించారు. ఆ సమయంలో కూడా ప్రజల నుంచి నిర్దిష్ట సమయంలో ఫీజులు చెల్లించాలని గడువు విధిస్తే ఎలా అంటూ విమర్శలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలని నిర్ణయించారు. కోర్టుల నుంచి అభ్యంతరాలు లేకపోయినా.. దానిని ఒక బూచిగా చూపించారని, ఇంత జాప్యం జరగడానికి కేవలం రాజకీయపరమైన అంశాలే కారణమని పురపాలక శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు ‘ఆంధ్రజ్యోతి’తో అన్నారు.

పురపాలక సంచాలకుల పరిధిలో ఇదీ పరిస్థితి

ఎల్‌ఆర్‌ఎస్ కింద పురపాలక సంచాలకుల పరిధిలో ఉన్న మునిసిపాలిటీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి 15,07,505 దరఖాస్తులు రాగా.. అందులో 4,09,059 దరఖాస్తులను ప్రాసెస్ చేశారు. 18,703 దరఖాస్తులను తిరస్కరించారు. 69,972 దరఖాస్తులకు సంబంధించి షార్ట్‌ఫాల్ లేఖలు రాశారు. మరో 61,571 మంది దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని లేఖలు పంపారు. 7513 దరఖాస్తులకు ఆమోదం తెలిపి రూ.51.83 కోట్ల ఫీజు వసూలు చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్‌లో దళారులకు తావివ్వొద్దు

ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరగనివ్వొద్దు.. 3 నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలి: పొంగులేటి

మార్గదర్శకాలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్.. ప్రభుత్వ స్థలాలకు నష్టం జరగొద్దు: భట్టి

హైదరాబాద్/భూపాలపల్లి/కూసుమంచి/ఖమ్మం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. నిబంధనల ప్రకారం మాత్రమే భూముల క్రమబద్ధీకరణ జరగాలని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని అన్నారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా, సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ధరణి పోర్టల్‌ను అప్పటి సీఎం కేసీఆర్, సీఎస్ సోమేశ్‌కుమార్ కలిసి రూపొందించారని, అది సమస్యలకు కేంద్ర బిందువుగా మారిందని అన్నారు. ఫలితంగా లక్షల మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేలా భూ యజమానులకు అనువుగా, రాష్ట్రానికి రోల్ మోడల్‌గా ఉండేలా కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ మేరకు 16 రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాలను అధ్యయనం చేస్తామని చెప్పారు. శనివారం భూపాలపల్లి నుంచి జిల్లా కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఖమ్మం జిల్లా పాలేరు జలాశయం నుంచి పాత కాలువకు, భక్త రామదాసు ప్రాజెక్టులోంచి పాలేరు ఆయకట్టుకు సాగర్ జలాలను విడుదల చేసిన సందర్భంగా పొంగులేటి మాట్లాడారు.

అత్యంత ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలి

గత ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను స్వీకరించగా 25.70 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, కానీ.. నాలుగేళ్లుగా అవి పరిష్కారానికి నోచుకోలేదని మంత్రి పొంగులేటి తెలిపారు. వాటిని అత్యంత ప్రాధాన్యం క్రమంలో పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ఇందుకోసం జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని, సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలని అన్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మునిసిపాలిటీలు మినహా.. మిగిలిన ప్రాంతాల దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న ఏడు జిల్లాల్లో అత్యంత విలువైన భూములు ఉన్నాయని, ఈ జిల్లాల్లో లేఅవుట్ క్రమబద్ధీకరణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ప్రణాళికాబద్ధమైన, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రజల ఆస్తులకు చట్టపరమైన గుర్తింపుతో సహా ఆమోదించిన లేఅవుట్ల ద్వారా అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆమోదించిన లేఅవుట్ యజమానులకు ఇంటి నిర్మాణాలకు అనుమతులు పొందేందుకు, బ్యాంకు రుణాలు పొందేందుకు, కొనుగోలు చేయడానికి, విక్రయించడానికి వెసులుబాటు కలుగుతుందన్నారు. కాగా స్థలాల క్రమబద్ధీకరణ కోసం చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను.. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తిచేయాలని ఖమ్మంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల కలెక్టర్లను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ భూములకు ఎక్కడా నష్టం జరగొద్దన్నారు.

మీరు తిట్టినా, అవమానించినా..

పోరాడుతాం

» అవసరమైతే ఢిల్లీకొచ్చి ఎండగడతాం..

» కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పోరాటాలు తమకు కొత్తేం కాదని.. కాంగ్రెస్ నేతలు బూతులు తిట్టినా, అవమానించినా ప్రజా సమస్యలపై సర్కారును నిలదీస్తూనే ఉంటామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ‘పోరాటం మాకు కొత్త కాదు. ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అని నమ్మించి రాహుల్ గాంధీ తెలంగాణ యువతను మోసం చేస్తున్న విధానంపై అవసరమైతే ఢిల్లీకి వచ్చి మిమ్మల్ని ఎండగడతాం. వదిలిపెట్టం.. మీరు బూతులు తిట్టినా, అవమానించినా ప్రశ్నిస్తూనే ఉంటాం. నిలదీస్తూనే ఉంటాం’ అని ‘ఎక్స్’లో పేర్కొన్నారు. తన అరెస్టుకు సంబంధించిన ఫొటోను షేర్ చేశారు. ‘ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు సున్నా. జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదల చేశారు. మరోసారి హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌కు వచ్చి యువతను కలిసి మీ హామీని ఎలా నిలబెట్టుకుంటారో చెప్పండి’ అంటూ మరో పోస్టులో రాహుల్ గాంధీని నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ అశోక్‌నగర్‌కు వచ్చి యువతతో మాట్లాడిన వీడియోను షేర్ చేశారు.

బుల్డోజ్ సమావేశాలు: ప్రశాంత్‌రెడ్డి

రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్ని బుల్డోజ్ సమావేశాలుగా మార్చిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. ప్రశ్నోత్తరాల సమయం ఒక్కరోజే పెట్టారని.. జీరో అవర్ ఎత్తేసి ప్రతిపక్షాల గొంతు నొక్కారని విమర్శించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కోవా లక్ష్మితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌ది ప్రజా పాలన కాదని, ప్రతిపక్షాలపై పంజా విసిరే పాలన అని ఈ బడ్జెట్ సమావేశాలు నిరూపించాయని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని బెదిరిస్తున్న దానం నాగేందర్.. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గెలవాలని కౌశిక్ రెడ్డి సవాల్ చేశారు.

‘టీ-సేఫ్’ సూపర్!

» 5 నెలల్లోనే 11 వేల యాప్ డౌన్‌లోడ్లు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ప్రయాణించే మహిళలు, చిన్నారుల భద్రత కోసం తెలంగాణ పోలీసులు తెచ్చిన టీ-సేఫ్ యాప్‌నకు మంచి స్పందన లభిస్తోంది. యాప్ ప్రారంభించిన ఐదు నెలల్లోనే 11 వేల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ ఐదు నెలల్లో 17 వేల 263 మంది ప్రయాణాల (ట్రిప్స్) ను పోలీసులు ట్రాక్ చేశారు. గూగుల్ ప్లే స్టోర్‌లో టీ-సేఫ్ యాప్‌నకు 4.8 రేటింగ్ నమోదైంది. ఈ యాప్ సాయంతో అర్ధరాత్రి వేళల్లో తాము ప్రయాణం ఎంత సాఫీగా సాగించింది సోషల్ మీడియా వేదికగా మహిళలు పలు సందర్భాల్లో వెల్లడించారు. దేశంలోనే టీ సేఫ్ తరహా సేవలు అందిస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణే అని మహిళా భద్రత విభాగం చీఫ్ షీకా గోయల్ తెలిపారు. టీ-సేఫ్ యాప్ వినియోగంపై మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

నెలరోజుల్లోపు 4.5 లక్షల ఇళ్లు!

ఇవన్నీ తొలి విడత కింద యుద్ధ ప్రాతిపదికన మంజూరు.. నియోజకవర్గానికి 3,500 చొప్పున కేటాయిస్తాం

» రుణమాఫీపై సమస్యలుంటే పరిష్కరిస్తాం: సీతక్క

» కాళేశ్వరంపై కుట్ర అంటూ బీఆర్‌ఎస్ గోబెల్స్ ప్రచారం: శ్రీధర్‌బాబు



భూపాలపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు పొంగులేటి, సీతక్క, శ్రీధర్‌బాబు

భూపాలపల్లి, గణపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి విడత కేటాయింపుల్లో భాగంగా నెలరోజుల్లోపు 4.5 లక్షల ఇళ్లు మంజూరుచేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు తొలి విడతలోనే నియోజకవర్గానికి 3,500 ఇళ్లను యుద్ధ ప్రతిపాదికన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. పేదలకు ఇళ్లపై అప్పటి సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పారని.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల కోసం 1.5 లక్షల ఇళ్లే కట్టించారని.. తాము ఇవాళ తొలి విడతలోనే 4.5 లక్షల ఇళ్లను కట్టనున్నామని చెప్పారు. వైఎస్సార్ హయాంలో గ్రామ గ్రామన పేదల కోసం కావాల్సినన్ని ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించిందని, ఇప్పుడూ అలాగే గ్రామాల్లో తప్పకుండా పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. శనివారం భూపాలపల్లి జిల్లాలో గణపురం మండలం గాంధీనగర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపన, భూపాలపల్లి డ్రగ్స్ ఫార్మసీ భవన ప్రారంభోత్సవం, వివిధ శాఖల సమీక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబుతో కలిసి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15వతేదీ లోపు రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని, రుణమాఫీ క్రమంలో తలెత్తిన సమస్యలను కూడా నెలాఖరులోపు పరిష్కరించి మొత్తం ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. తాము ధరణి కంటే మెరుగ్గా భూమాత పేరుతో కొత్త ఆర్వోఆర్ తెస్తామని చెప్పారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులు ఇవ్వకుండా కేంద్రం తొండాట ఆడుతోందని విమర్శించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. భూపాలపల్లి లాంటి మారుమూల గ్రామీణ ప్రాంతంలో చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసమే ఇండస్ట్రియల్ పార్క్‌లను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులపై కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసిందన్నట్లుగా బీఆర్‌ఎస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, నిజంగా కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేసి ఉంటే అసలు ప్రాజెక్టుకు పునాది రాయే పడేది కాదన్నారు. ప్రాజెక్టులో అవినీతి జరిగినందునే నీళ్లివ్వకుండానే కూలిపోయిందన్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బీఆర్‌ఎస్ నేతలు సంకుచిత ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రుణమాఫీకి సంబంధించి మొత్తం ప్రక్రియ పూర్తయినప్పటికీ ఇంకా ఏమైనా సమస్యలు మిగిలి ఉంటే వాటిని పరిష్కరించడం కోసం మంత్రి వర్గం కూర్చొని చర్చిస్తుందని చెప్పారు.

ఉప్పల్ కారిడార్ పనులు కదిలేనా!

» నాలుగేళ్ల క్రితమే పూర్తి కావాల్సినా.. తీవ్ర జాప్యం

» గడ్కరీ ఆదేశాలతో ఎన్‌హెచ్‌ఏఐ కసరత్తు

» నేడు కోమటిరెడ్డి పరిశీలన

హైదరాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థకు ఆర్థిక చిక్కులు, మరోవైపు అధికారుల అలసత్వంతో ఆరు లేన్ల ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో తీవ్ర జాప్యం రాజ్యమేలుతోంది. 2018 జూన్‌లో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు దక్కించుకున్న కంపెనీ 24 మాసాల్లోనే పూర్తి చేయాలని ఒప్పందంలో ఉంది. కానీ వివిధ కారణాలు చూపుతూ పనులను ఆలస్యం చేయగా, గత రెండేళ్ల నుంచి అసలు పనులే నిర్వహించడం లేదు. దాంతో రూ.626.76 కోట్లతో చేపట్టిన 6.25 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ పనులు నిలిచిపోయాయి. ఉప్పల్ జంక్షన్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ఇటీవల ఢిల్లీ వెళ్లినపుడు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌పై చర్చించారు. కొత్త కంపెనీకి పనులు అప్పగించాలని లేదంటే నిలిచిపోయిన పనులతో పాటు, ప్రాజెక్టును పూర్తిచేసేందుకు మరోసారి టెండర్లు ఆహ్వానించాలని కోరారు. దీంతో గడ్కరీ ప్రాజెక్టు పూర్తికి ఎలా ముందుకెళ్లాలో తెలపాలని జాతీయ ఎన్‌హెచ్‌ఏఐ తెలంగాణ విభాగం అధికారులను కోరారు. ఈ నేపథ్యంలో కేంద్రానికి నివేదిక అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాగా, ఇప్పటివరకు 44 శాతం పనులే పూర్తయ్యాయి. మొత్తం 143 పిల్లర్లకు 137 పూర్తయ్యాయి. పిల్లర్లపై నిర్మించాల్సిన 142 స్పాన్లలో 36 మాత్రమే పూర్తయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఇప్పటికైనా కారిడార్ పనుల్లో కదలిక వస్తుందా అనే చర్చ మొదలైంది. కాగా, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ అసంపూర్తి పనులను మంత్రి కోమటిరెడ్డి ఆదివారం పరిశీలించనున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ, జాతీయ రహదారుల శాఖతో పాటు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారులతో పనుల నిర్వహణ పలు అంశాలపై చర్చించనున్నారు.

అమెరికా వెళ్లొచ్చేలోగా బీఆర్‌ఎస్ ఆఫీసు కూల్చేయండి

» అనుమతుల్లేకుండా నిర్మిస్తుంటే ఏం చేశారు?

» మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ‘నేను అమెరికా వెళ్లి ఈనెల 11న తిరిగొస్తా.. ఈలోగా అనుమతులు లేకుండా నిర్మించిన బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని కూల్చేయండి’ అని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. శనివారం నల్లగొండ మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలో నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా కేంద్రంలో అనుమతులు లేకున్నా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తుంటే మునిసిపల్ అధికారులు ఎందుకు అడ్డుకోలేదని నిలదీశారు. ఆ భవనాన్ని కూల్చేయాలని గతంలోనే ఆదేశించానని, అయినా ఎందుకు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా వెళ్లి ఈ నెల 11న తిరిగి వస్తానని, అప్పటిలోగా కూల్చకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2019లో అత్యంత విలువైన స్థలాన్ని చదరపు గజం రూ.100 చొప్పున నామమాత్రపు ధరకు ఎకరా భూమిని ఆ పార్టీ కార్యాలయానికి కేటాయించారు. అయితే ఈ స్థలం విలువ రూ.50 కోట్ల పైనే ఉంటుందని, ఇంత విలువైన సర్కారు భూములు పార్టీ కార్యాలయానికి ఎలా కేటాయిస్తారని మంత్రి గతంలోనే ప్రశ్నించారు.

దివికేగిన నాట్యమయూరి

- నృత్య కళాకారిణి యామినీ కృష్ణమూర్తి కన్నుమూత

న్యూఢిల్లీ, రవీంద్రభారతి ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ భరత నాట్యం, కూచిపూడి నృత్య కళాకారిణి, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత యామినీ కృష్ణమూర్తి(84) కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో ఏడు నెలలుగా ఢిల్లీలోని అపోలో ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆమె శనివారం తుదిశ్వాస విడిచారు. ఏపీలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లెలో 1940 డిసెంబరు 20న జన్మించిన యామినీ కృష్ణమూర్తి అసలు పేరు యామినీ పూర్ణతిలకం. ఆమెకు ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. యామిని కుటుంబం ఆమె చిన్నతనంలోనే తమిళనాడుకు వెళ్లింది. తండ్రి ప్రోత్సాహంతో ఐదేళ్ల వయస్సులో చెన్నైలోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో యామిని భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించారు. అనంతరం వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, చింతా కృష్ణమూర్తి, పసుమర్తి వేణుగోపాలకృష్ణశర్మ వంటి వారి వద్ద కూచిపూడి నేర్చున్నారు. పంకజ చరణ్‌దాస్, కూలూచరణ్ మహాపాత్ర వద్ద ఒడిస్సీ, ఎండీ రామనాథన్ దగ్గర కర్నాటక సంగీతం, కల్పక్కం స్వామినాథన్ దగ్గర వీణ నేర్చుకున్నారు. అనతికాలంలోనే భరతనాట్యం, కూచిపూడిలో ప్రావీణ్యం సంపాదించిన యామిని 1957లో తన 17వ ఏట అరంగేట్రం చేశారు. అప్పటి నుంచి వేలసంఖ్యలో ప్రదర్శనలిచ్చి దేశ, విదేశాల్లో పేరుగాంచారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగానూ సేవ చేశారు. ఇక, 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2017లో పద్మవిభూషణ్‌తో కేంద్ర ప్రభుత్వం యామినీ కృష్ణమూర్తిని సత్కరించింది. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ నుంచి భామావేణి బిరుదు పొందారు. అవివాహితగానే ఉండిపోయిన యామిని తన జీవితాన్ని కళకే అంకితం చేశారు. యామిని స్కూల్ ఆఫ్ డ్యాన్స్ పేరిట ఢిల్లీలో డ్యాన్స్ స్టూడియోను ప్రారంభించి చాలామందికి నాట్యంలో శిక్షణ ఇచ్చారు. యామినీ కృష్ణమూర్తి భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం యామిని స్కూల్ ఆఫ్ డ్యాన్స్‌కు తీసుకురానున్నారు. కాగా, యామినీ కృష్ణమూర్తి మరణం పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు సంతాపం తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని తెలంగాణ సీఎం పేర్కొన్నారు.



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న సైయంట్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, తనికెళ్ల భరణికి ఎస్సార్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం

వినూత్న ఆలోచనలతోనే ఆవిష్కరణలు

- సైయంట్ టెక్నాలజీస్ చైర్మన్ మోహన్ రెడ్డి
- తనికెళ్ల భరణికి ఎస్సార్‌యూ గౌరవ డాక్టరేటు
- ఘనంగా ఎస్సార్‌యూ ద్వితీయ స్నాతకోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 3: వినూత్న ఆలోచనలతోనే అద్భుత ఆవిష్కరణలు సాధ్యమవుతాయని సైయంట్ టెక్నాలజీస్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని అనంతసాగర్‌లో ఉన్న ఎస్సార్ యూనివర్సిటీ క్యాంపస్‌లో శనివారం ద్వితీయ స్నాతకోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా బీవీఆర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను జోడిస్తూ ఆవిష్కరణలు చేయాల్సిన బాధ్యత భావి ఇంజనీర్లపై ఉందన్నారు. ప్రస్తుతం 'టెకేడ్' నడుస్తోందని, సృజనాత్మక ఆవిష్కరణలతో ఉద్యోగాలు సాధించడమే కాదు సొంతంగా సంస్థలు కూడా నెలకొల్పవచ్చన్నారు. థామస్ అల్వా ఎడిసన్, అబ్దుల్ కలాం లాంటి మహనీయులు వినూత్న ఆలోచనలతో అద్భుత ఆవిష్కరణలు చేశారన్నారు. వారి స్ఫూర్తితో తాను 1992లో నలుగురు ఇంజనీర్లతో సైయంట్ టెక్నాలజీస్ ప్రారంభించానని, అదే ఇప్పుడు 21 దేశాల్లో 18వేల మంది ఇంజనీర్లతో సేవలు అందిస్తోందని, రూ.700 కోట్ల టర్నోవర్‌కు ఎదిగిందన్నారు. మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు సైయంట్ సేవలు అందిస్తోందన్నారు. వైస్‌చాన్సలర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ ఎస్సార్ విద్యాసంస్థల ఎదుగుదలను వివరించారు. అనంతరం సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణికి గౌరవ డాక్టరేట్ అందించారు. చాన్స్‌లర్ వరదారెడ్డి మాట్లాడుతూ 2002లో స్థాపించిన ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్నో మైలురాళ్లు దాటి వర్సిటీ స్థాయికి చేరిందన్నారు. కాగా, విద్యార్థులు కష్టపడితేనే బంగారు భవిష్యత్తును అనుభవిస్తారని తనికెళ్ల భరణి అన్నారు. తనకు ఇదే మొదటి డాక్టరేట్ అని, తన జీవిత భాగస్వామి భవానికి ఈ డాక్టరేట్‌ను అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పట్టభద్రులైన, వివిధ కోర్సుల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు, పీహెచ్‌డీ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రో-చాన్స్‌లర్ ఎ.మధుకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, ఫ్యాకల్టీ డీన్ వి.మహేష్, ఇంజనీరింగ్ డీన్ రామ్‌దేశ్‌ముఖ్, మేనేజ్‌మెంట్ డీన్ సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

వేగంగా నిండుతున్న సాగర్

రేపు సాయంత్రం గేట్లు ఎత్తే అవకాశం.. ప్రాజెక్టుకు 4.33 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో

- శ్రీశైలం జలాశయానికీ అంతే మొత్తంలో వరద

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో నాగార్జున సాగర్ జలాశయం శరవేగంగా నిండుతోంది. సోమవారం సాయంత్రానికల్లా ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా.. శనివారం సాయంత్రం 6 గంటల కల్లా 244.15 టీఎంసీల నీరు ఉంది. మరో 67.85 టీఎంసీలు వచ్చి చేరితే ప్రాజెక్టు పూర్తిగా నిండనుంది. సోమవారం సాయంత్రం కల్లా ప్రాజెక్టు గేట్లను ఎత్తే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తూ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో కరెంటు ఉత్పత్తి చేస్తున్నారు. దాంతో ఈ వరదంతా పులిచింతల ప్రాజెక్టుకు వచ్చిచేరుతోంది. పులిచింతల సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 3.69 టీఎంసీల నీరు ఉంది. బుధవారం కల్లా ఈ ప్రాజెక్టు నిండే అవకాశాలున్నాయి. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాలకు వరద నిలకడగా కొనసాగుతోంది. గోదావరి బేసిన్‌లో ప్రధానంగా సాగు నీరు అందించే ప్రాజెక్టులకు వరద నిరాశాజనకంగానే ఉంది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు 25 వేల క్యూసెక్కులు, కడెంకు 1,518 క్యూసెక్కులు, ఎల్లంపల్లికి 8,355 క్యూసెక్కులు, సింగూరు ప్రాజెక్టుకు 565 క్యూసెక్కుల నీరు వస్తోంది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి 3.62లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి అంతే నీటిని వదులుతున్నారు.

ప్రాజెక్టు	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
ఆల్మట్టి	129.72	72.89	313000	275000
నారాయణపూర్	37.64	28.88	260000	256271
తుంగభద్ర	100.86	98.26	138393	149202
జూరాల	9.66	8.45	290000	270452
శ్రీశైలం	215.81	202.04	433088	552641
నాగార్జునసాగర్	312.05	244.15	433088	552641
సింగూరు	29.91	14.71	565	391
శ్రీరాంసాగర్	80.5	42.81	17925	703
కడెం	7.6	6.67	1518	957
ఎల్లంపల్లి	20.18	15.13	8355	13031
మేడిగడ్డ	16.17	6.07	451920	451920
సమ్మక్క	6.94	6.94	618720	618720
సీతమ్మ	36.57	0.2	552380	552380



శ్రీరామ సాగర్‌లో జల కళ

ప్రాజెక్టులు	నీరందించనున్న ఎకరాలు
ఎస్ఆర్ఎస్పీ ఒకటో దశ	427566
నాగార్జునసాగర్	644961
జూరాల	109296
కాళేశ్వరం	98570
ఆర్డీఎస్	55000
మూసీ	30000
కోయిల్‌సాగర్	35600
రాజీవ్ బీమా	146668
నెట్టంపాడు	120000
కల్వకుర్తి	293851
ఎస్ఎల్‌బీసీ	266461
సదర్‌మట్	13720
తాలిపేరు	24700
ఘన్‌పూర్	21625
పాల్వాల	24000
పాకాల చెరువు	23193
రామప్ప చెరువు	5180
లక్నవరం	8794
డిండి	22975
గుత్ప	33925
వైరా	17390
కడెం	53838
కిన్నెరసాని	10000
ఎల్లంపల్లి రెండోదశ	46716
దేవాదుల	35600

కృష్ణా ఆయకట్టుకు నీరు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) నుంచి నాగార్జున సాగర్ దాకా ప్రాజెక్టులన్నీ నిండుగా ఉండటంతో ఈ జలాశయాల కింద పంటలకు నీటిని ఇవ్వడానికి ఇబ్బందుల్లేవని గుర్తించారు. ఇక, గోదావరి బేసిన్‌లో పలు ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవు. దీంతో 15 రోజుల్లో మళ్లీ సమావేశమై నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని నీటి పారుదల శాఖ యోచిస్తోంది. గోదావరి బేసిన్ ప్రాజెక్టుల కింద 17.95 లక్షల ఎకరాలకు 188 టీఎంసీల నీటిని సాగు అవసరాలకు ఇవ్వాలని సర్కారు భావిస్తోంది. మొత్తంగా ఈ సీజన్‌లో కృష్ణా, గోదావరి పరిధిలోని ప్రాజెక్టుల నుంచి 32 లక్షల ఎకరాల్లో పంటల సాగు కోసం 313 టీఎంసీల నీటిని అందించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

హత్య చేసినట్లు నిందితుడు అంగీకరిస్తే సరిపోదు

- స్పష్టమైన ఆధారాలు ఉండాలి
- హైకోర్టు స్పష్టీకరణ
- తల్లి హత్య కేసులో కుమారుడికి విముక్తి

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హత్య తానే చేసినట్లు నిందితుడు నేరాన్ని అంగీకరిస్తూ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఒక్కటే నేరనిర్ధారణకు సరిపోదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ నేరాంగీకార స్టేట్‌మెంట్‌కు అనుగుణంగా సాక్ష్యాలు, స్వాధీనం చేసుకున్న ఆధారాలు ఉండాలని పేర్కొంది. కేవలం పోలీసుల ఎదుట ఇచ్చిన సీఆర్పీసీ 161 స్టేట్‌మెంట్లు, నేరాంగీకార స్టేట్‌మెంట్ ఆధారంగా హత్యను నిర్ధారించలేమని తెలిపింది. 11 ఏళ్ల క్రితం జరిగిన 80 ఏళ్ల వృద్ధురాలైన తల్లి హత్య కేసులో నిందితుడిగా ఉన్న కుమారుడికి విముక్తి ప్రసాదిస్తూ జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశించింది. మెదక్ జిల్లా దుబ్బాక మండలం పెద్దగుండవల్లి గ్రామానికి చెందిన కూలీ పెద్దగుండెల్లి పోచయ్య.. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న తల్లిని గొంతునులిమి హత్య చేశాడని, దానిని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ఇంటివెనుక ఉన్న సీతాఫలం చెట్టుకు శవాన్ని వేలాడదీశాడనే ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని చూసుకోలేక టవల్‌తో గొంతునులిమి చంపినట్లు పోలీసుల ఎదుట నిందితుడు అంగీకరించాడు. దీనిపై విచారణ చేపట్టిన ఉమ్మడి మెదక్ జిల్లా సిద్ధిపేట్ ఆరో అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టు నిందితుడికి జీవితఖైదు విధించింది. దీనిపై నిందితుడు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయగా జస్టిస్ కే సురేందర్, జస్టిస్ జే శ్రీనివాసరావుల ధర్మాసనం సమగ్రంగా విచారణ చేపట్టింది. డాక్టర్ నివేదిక ప్రకారం గొంతుపై ఒత్తిడి వల్ల మరణం సంభవించింది. అయితే అది హత్య అయినా కావచ్చు లేదా ఆత్మహత్య అయినా కావచ్చని ఆ నివేదికలో పేర్కొన్నారు. ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేకపోవడం, డాక్టర్ సైతం సంశయాత్మకంగా నివేదిక ఇవ్వడాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. పోలీసులకు నిందితుడు ఇచ్చిన నేరాంగీకార స్టేట్‌మెంట్ ఒక్కటే చెల్లదని, దానిని నిరూపించేలా తగిన ఆధారాలు ఉండాలని స్పష్టం చేస్తూ దిగువ కోర్టు తీర్పును కొట్టేసింది. చట్టబద్ధమైన, అంగీకరించదగిన ఆధారాలు లేకుండా కేవలం ఊహ ఆధారంగా నేర నిర్ధారణ జరగదని, సహేతుకమైన సందేహాలన్నింటినీ పటాపంచలు చేసేలా ప్రాసిక్యూషన్ కేసును నిరూపించాలని స్పష్టంచేసింది.

ఇక్కడా పూజా ఖేద్కర్‌లు ఉన్నారా..?

- దివ్యాంగుల కోటా దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలిస్తున్న టీజీపీఎస్సీ
- జేఎల్ పోస్టులకు ప్రత్యేక మెడికల్ బోర్డు

హైదరాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నకిలీ అంగ వైకల్య ధ్రువీకరణ పత్రాలు సమర్పించి యుపీఎస్సీనే మోసం చేసి పూజా ఖేద్కర్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ఆమె ప్రవర్తనతో అనుమానం వచ్చి విచారణ చేయగా ఆమె చేసిన మోసాలు వెలుగు చూడటంతో ఎట్టకేలకు ఆమెపై అనర్హత వేటు పడింది. దాంతో ఆమెలా నకిలీ ధృవీకరణ పత్రాలు సమర్పించి ఎవరైనా ఉద్యోగాలు పొందారా..? అలాంటి ప్రయత్నాలు చేస్తున్నారా..? అన్న కోణంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అప్రమత్తమైంది. ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్లలో దివ్యాంగుల కోటాను వినియోగించిన ప్రతీ అభ్యర్థిని నిశితంగా పరిశీలించనుంది. దివ్యాంగ అభ్యర్థులు ఎక్కువగా ఉన్న జూనియర్ లెక్చరర్ల(జేఎల్) అభ్యర్థుల పరిశీలనపై కమిషన్ ప్రస్తుతం దృష్టిపెట్టింది. 1,392 జేఎల్ పోస్టులకు గతేడాది పరీక్షలు జరగ్గా 80 వేల మంది హాజరయ్యారు. వాటి ఫలితాలు గత నెల విడుదలవ్వగా ప్రస్తుతం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరుగుతోంది. సాధారణ అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో, దివ్యాంగ(పీడబ్ల్యూడీ) అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో ఎంపిక చేశారు. దివ్యాంగుల కోటాలో దృష్టిలోపం ఉన్న 126 మంది, వినికిడి లోపం ఉన్న 74 మంది, అంగవైకల్యం ఉన్న 79 మంది ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 5 నుంచి చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఈ పరిశీలన నామమాత్రంగా జరిగేది. వైద్యులు ధృవీకరణ పత్రం ఇస్తే సరిపోయేది. అయితే పూజా ఖేద్కర్ వివాదం నేపథ్యంలో ఈ ప్రక్రియను మరింత పకడ్బందీగా నిర్వహించనున్నారు. అభ్యర్థులు సమర్పించిన ధృవీకరణ పత్రాల ఆధారంగా అభ్యర్థుల వైకల్యాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక వైద్య నిపుణులను నియమించారు. అంగవైకల్యం ఉన్నవారిని ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు ఉస్మానియా ఆసుపత్రిలో, అంధులను ఈనెల 27 నుంచి 31వరకు మెహదీపట్నంలోని సరోజిని ఆసుపత్రిలో, వినికిడిలోపం ఉన్నవారిని సెప్టెంబరు 5 నుంచి 10వ తేదీ వరకు కోఠిలోని ప్రభుత్వ ఈఎన్‌టి ఆసుపత్రిలో నిపుణులు పరిశీలించనున్నారు. వైకల్య ధ్రువీకరణలో వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే వారిపైనా చర్యలకు ప్రభుత్వానికి టీఎస్‌పీఎస్సీ సిఫారసు చేయనుంది. అలాగే ఇతర పరీక్షల ఎంపికలోనూ దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే భర్తీచేసిన పోస్టుల్లో దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను మళ్లీ పరిశీలించే అవకాశాలున్నాయని తెలిసింది.

బాట్‌తో బోల్తా

(మొదటి పేజీ తరువాయి)

ఎన్ని పర్యాయాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలనుకున్నా అవకాశం దక్కటం లేదు. దీంతో చాలా మంది లారీల యజమానులు నెలకు ఒకటి, రెండు ట్రిప్పులన్నా తమకు అవకాశం ఇవ్వాలంటూ అధికారులను కోరుతున్నారు. సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ ఆదేశాల మేరకు, అధికారులు ఈ సమస్యపై ఐటీ నిపుణులను సంప్రదించగా, బాట్ అనే ఒక సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ తతంగం నడుస్తున్నట్లు తాజాగా వెల్లడైంది. కంప్యూటర్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల్లో ఉపయోగిస్తున్న ఈ సాఫ్ట్‌వేర్ గురించి తెలుసుకున్న ఇసుక లారీల ఓనర్లు.. టీజీఎండీసీ వెబ్‌సైట్‌లో బుకింగ్ కోసం పడిగాపులు పడకుండా, అధికారులు ఎప్పుడు అవకాశం ఇస్తే అప్పుడు ఆయా రీచ్‌ల నుంచి ఇసుక తరలించేందుకు బాట్ సాయంతో అవకాశాలు దక్కించుకుంటున్నట్లు తెలిసింది. దీనిపై చైర్మన్ అనిల్ కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఒకసారి లారీ ఓనర్ తన దరఖాస్తును కంప్యూటర్ సెంటర్‌లో అప్‌లోడ్ చేసుకుంటే ఆ తరువాత పదే పదే హిట్ చేస్తూ బాట్



సాయంతో బుకింగ్ పొందేందుకు అవకాశం ఉందన్నారు. కొన్ని కంప్యూటర్ సెంటర్ల నిర్వాహకులు ఒక్కో బుకింగ్‌కు రూ.5000 చార్జ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 45 వేల లారీలు ఇసుక తరలింపు కోసం పనిచేస్తున్నాయని, ఈ విషయంలో లారీ ఓనర్లమధ్య వివాదాలు తలెత్తుతుండటంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మరోవైపు, ఇసుక రీచ్‌ల వద్ద అక్రమ తవ్వకాలను నిలువరించేందుకు, స్టాక్ యార్డుల నుంచి ఇసుక తరలింపుపై నిఘా ఉంచేందుకు త్వరలో డ్రోన్లు వినియోగించనున్నామన్నారు. ఒకటి, రెండు నెలల్లో దీనిని అమల్లోకి తీసుకొచ్చే అవకాశం ఉందని అనిల్‌కుమార్ తెలియజేశారు. ఒక డ్రోన్ 8 గంటల పాటు పర్యవేక్షిస్తుందని, దాంట్లో ఛార్జింగ్ అయిపోతున్నప్పుడే దానిని దించి, మరో డ్రోన్‌ను పైకి పంపిస్తామని మరో అధికారి వివరించారు.

6 నెలల్లో రూ.84.3 కోట్ల డ్రగ్స్ స్వాధీనం: డీజీపీ

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది మొదటి 6 నెలల్లో రూ.84.3 కోట్లు విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం 938 కేసులు నమోదు చేసి ఆయా కేసులతో సంబంధమున్న 1,921 మంది నిందితుల్ని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అత్యధికంగా గంజాయికి సంబంధించి 816 కేసులు నమోదు చేసి.. 1,649 మందిని అరెస్ట్ చేశామన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన 5 కేసుల్లో నిందితులకు చెందిన రూ.47.16 కోట్లు విలువైన ఆస్తులు అటాచ్ చేసినట్లు 'ఎక్స్' వేదికగా వివరించారు. మరోవైపు.. డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల వాడకం వల్ల ఎదురయ్యే ఇబ్బందులపై తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య నేతృత్వంలో పాఠశాలల నుంచి కళాశాలల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లతో పాటు ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో.. 2.43 కోట్లకు టోకరా

- టెకీకి సైబర్ నేరగాళ్ల వల
- రూ.28 లక్షలను వెనక్కి రప్పించిన పోలీసులు

పటాన్‌చెరు, ఆగస్టు 3: స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ టెకీకి రూ.2.43 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన ఉదంతమిది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. ఏపీఆర్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జూన్ 19న స్టాక్ మార్కెట్, ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి ఫేస్‌బుక్‌లో కనిపించిన ప్రకటనకు ఆకర్షితుడయ్యాడు. అందులో చూపిన లింకును క్లిక్ చేయగా.. సైబర్ నేరగాళ్లు లైన్‌లోకి వచ్చి.. 'మోతీలాల్ ఓస్వాల్ స్ట్రాటజీ' అనే పేరుతో ఉన్న గ్రూప్‌లో యాడ్ చేశారు. వారు సూచించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న సదరు టెకీ.. తొలుత కొద్ది మొత్తంలో పెట్టుబడి పెట్టారు. లాభాలు వస్తున్నట్లు సైబర్ నేరగాళ్లు చూపడంతో.. 22 సార్లు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.2.43 కోట్లను బదిలీ చేశాడు. రూ.6 కోట్ల మేర లాభం వచ్చినట్లు యాప్‌లో చూపుతుండడంతో.. విత్‌డ్రాకు ప్రయత్నించాడు. అది సాధ్యం కాకపోవడంతో సైబర్ నేరగాళ్లకు విషయం చెప్పి.. సమస్యను పరిష్కరించాలని కోరాడు. వారు కుంటిసాకులు చెబుతుండడంతో.. మోసం జరిగిందని గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భారీ మోసం కావడంతో కేసును సైబర్ క్రైమ్ సెల్‌కు బదిలీ చేశామని, సైబర్ కేటుగాళ్ల ఖాతా నుంచి రూ.28 లక్షలను వెనక్కి రప్పించామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● ఆదివారం 4 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

ఆంధ్ర యూనివర్సిటీలో
డిస్టెన్స్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకు సంబంధిత స్టడీ మెటీరియల్ అందిస్తారు. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.




అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.
- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ) ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్ఆర్ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసిన వారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ప్రింట్ మెటీరియల్ కోసం చెల్లించాల్సిన ఫీజు:** సెమిస్టర్‌కు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

జేఎన్‌టీయూకేలో స్పాన్సర్డ్ ఎంటెక్



కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కాకినాడ, నర్సరావుపేట క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. అకడమిక్ మెరిట్, గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్పెషలైజేషన్‌కు అయిదు సీట్లు చొప్పున మొత్తం 125 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

క్యాంపస్‌లు

- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడ
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జేఎన్‌టీయూకే క్యాంపస్
- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, నర్సరావుపేట

ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- **సివిల్ ఇంజనీరింగ్:** స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, హైడ్రాలిక్స్ అండ్ వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్:** హై ఓల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్
- **మెకానికల్ ఇంజనీరింగ్:** క్యాడ్/క్యామ్, మెషిన్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్:** కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- **కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ
- **రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్:** రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ.

అర్హత: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/ఎర్త్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్/బీడీఎస్/బీ ఫార్మసీ/బీవీఎస్సీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 అర్హత తప్పనిసరి. అభ్యర్థులకు కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **సెమిస్టర్ ఫీజు:** రూ.25,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ-533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా)లో సీనియర్ టెక్నీషియన్ మెంబర్ అర్హతతోపాటు హయ్యర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కోర్సులు చేసే అవకాశం లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి కింది చిరునామాకు పంపాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** మొదటి సెమిస్టర్‌కు రూ.3500+జీఎస్‌టీ రూ.630; రెండో సెమిస్టర్‌కు రూ.4,000+జీఎస్‌టీ రూ.720
- **దరఖాస్తు ఫీజు:** రూ.4330
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **చిరునామా:** ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా), రూమ్ నెం.109, ఎన్‌సీఆర్‌పీయూ బిల్డింగ్, శంకర్ మార్కెట్ పక్కన, న్యూఢిల్లీ- 110001.
- **వెబ్‌సైట్:** ipweindia.org.in



ఎస్ఎస్‌సీ- కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్

312 ఖాళీలు



కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్ ఆఫీసర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీకి నిర్వహించే 'కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్ 2024' నోటిఫికేషన్‌ను స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 312 ఖాళీలు భర్తీ చేస్తారు.

- కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్- 2024

1. జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్స్(జేహెచ్‌టీ)
2. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్(జేటీవో)
3. జూనియర్ ట్రాన్స్‌లేటర్(జేటీ)
4. సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్(ఎస్‌హెచ్‌టీ)
5. సీనియర్ ట్రాన్స్‌లేటర్(ఎస్‌టీ)

అర్హతలు: పోస్టును అనుసరించి మాస్టర్ డిగ్రీ(హిందీ/ఇంగ్లీష్) ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ స్థాయిలో హిందీ/ఇంగ్లీష్ సబ్జెక్టు పాఠ్యాంశంగా ఉండాలి. దీంతోపాటు ట్రాన్స్‌లేషన్(హిందీ/ఇంగ్లీష్) డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు చేసి ఉండాలి. లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థలో ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి. సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీతో పాటు ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీ/పీజీ(హిందీ/ఇంగ్లీష్) అర్హతతో పాటు తగిన అనుభవం ఉండాలి. డిగ్రీ స్థాయిలో హిందీ/ఇంగ్లీష్ సబ్జెక్టు పాఠ్యాంశంగా ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.

జీతభత్యాలు: నెలకు సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్/సీనియర్ ట్రాన్స్‌లేటర్ పోస్టులకు రూ.44,900 - రూ.1,42,400. ఇతర పోస్టులకు రూ.35,400 - రూ.1,12,400.

పరీక్ష విధానం: ఆన్‌లైన్ పరీక్ష. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటాయి. జనరల్ హిందీ నుంచి 100 ప్రశ్నలు(100 మార్కులు), జనరల్ ఇంగ్లీష్ నుంచి 100 ప్రశ్నలు(100 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

పేపర్-2(డిస్క్రిప్టివ్): ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. ట్రాన్స్‌లేషన్, ఎస్సే ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

దరఖాస్తు రుసుము: జనరల్, ఈడబ్ల్యుఎస్, ఓబీసీలకు రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25

కంప్యూటర్ ఆధారిత పరీక్ష(పేపర్-1): అక్టోబరు/నవంబరులో

వెబ్‌సైట్: https://ssc.nic.in/

హిందుస్థాన్ కాపర్‌లో ట్రేడ్ అప్రెంటిస్‌లు

195 ఖాళీలు

మధ్యప్రదేశ్‌లోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్‌కు చెందిన మలాంజ్‌ఖండ్ కాపర్ ప్రాజెక్ట్... ట్రేడ్ అప్రెంటిస్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ట్రేడ్ అప్రెంటిస్

ట్రేడ్: మేట్(మైన్స్), బ్లాస్టర్(మైన్స్), డీజిల్ మెకానిక్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మన్(సివిల్), డ్రాఫ్ట్స్‌మన్(మెకానికల్), కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, సర్వేయర్, ఏసీ అండ్ రిఫ్రిజిరేషన్ మెషిన్, మేసన్, కార్పెంటర్, ప్లంబర్, హార్టికల్చర్ అసిస్టెంట్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్స్, సోలార్ టెక్నీషియన్(ఎలక్ట్రీషియన్).

అర్హత: 10వ తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఐటీఐ, పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 20

వెబ్‌సైట్: https://www.hindustancopper.com/

HINDUSTAN COPPER LIMITED
(A Government of India Enterprise)

జాబ్ కార్నర్

ఎయిమ్స్‌లలో నర్సింగ్ ఆఫీసర్లు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తో దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్(నార్‌సెట్)-7 నోటిఫికేషన్ విడుదలైంది.

ఎయిమ్స్ సంస్థలు: ఎయిమ్స్ భటిండా, ఎయిమ్స్ భువనేశ్వర్, ఎయిమ్స్ బిలాస్‌పూర్, ఎయిమ్స్ దేవగఢ్, ఎయిమ్స్ గోరఖ్‌పూర్, ఎయిమ్స్ గువహటి, ఎయిమ్స్ జోధ్‌పూర్, ఎయిమ్స్ కల్యాణి, ఎయిమ్స్ మంగళగిరి, ఎయిమ్స్ నాగ్‌పూర్, ఎయిమ్స్ రాయ్‌బరేలీ, ఎయిమ్స్ న్యూఢిల్లీ, ఎయిమ్స్ పట్నా, ఎయిమ్స్ రిషికేశ్, ఎయిమ్స్ విజయ్‌పూర్.

అర్హత: డిప్లొమా(జీఎన్ఎం)తో పాటు రెండేళ్ల పని అనుభవం లేదా బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ(పోస్ట్ సర్టిఫికెట్)/పోస్ట్ - బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సులుగా రిజిస్టరై ఉండాలి.

వయోపరిమితి: 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్లు, ఎక్స్-సర్వీస్‌మన్‌లకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతభత్యాలు: రూ.9,300 - రూ.34,800తో పాటు రూ.4600 గ్రేడ్ పే అందుతుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.3000; ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.2400; పీడబ్ల్యుడీ అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: నార్‌సెట్-7 ప్రిలిమినరీ, ప్రధాన పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 21

సీబీటీ ప్రిలిమినరీ పరీక్ష: సెప్టెంబరు 15

సీబీటీ మెయిన్ పరీక్ష: అక్టోబరు 4

వెబ్‌సైట్: https://www.aiimsexams.ac.in/



లిటిల్స్



మీకు తెలుసా?

- ధృవాల్లో ఉండే పెంగ్విన్స్ గుంపులు గుంపులుగా ఉంటాయి. వీటి రెక్కలు పక్షులకంటే బలమైనవి. దీంతో పాటు ఇవి వేడిగా ఉంటాయి. ముఖ్యంగా సముద్రం అడుగులో పెంగ్విన్స్ ఈతకొడతాయి. అంతేకానీ గాలిలో ఎగరలేవు.
- పెంగ్విన్స్ పక్షి జాతికి చెందినవి. వీటి కాళ్ల మధ్య దూరం ఉండటం వల్ల ఇవి మనిషిలా నడవగలవు.
- వీటి నోటిలో దంతాలు ఉండవు.
- అంటార్కిటికాలోనే మాత్రమే జీవిస్తాయి.
- డైనోసార్లు అంతమైంది మూడు మిలియన్ల సంవత్సరాల నుంచి అయితే.. పెంగ్విన్స్ చివరి శిలాజాలం 62 మిలియన్ల క్రితం అని పరిశోధకులు తేల్చారు.
- పెంగ్విన్లు అన్నీ నలుపు, తెలుపు రంగులోనే ఉంటాయి. ఇవి ఆహారం కోసం నీటిలోకి 530 మీటర్లు సైతం డైవ్ చేస్తాయి.
- వీటి సమూహాన్ని 'రాఫ్ట్' అంటారు.



- ఇరవై రెండు మిలియన్ల క్రితం నుంచి పెంగ్విన్స్ ఉన్నాయని.. అది కూడా ఆస్ట్రేలియాలోనే అవి ఉండేవని పరిశోధకులు చెబుతున్నారు. న్యూజిలాండ్‌తో దక్షిణ పసిఫిక్ ఐలాండ్స్‌లో ఇవి కనిపిస్తాయి. వీటిలో 18 రకాల జాతులు ఉన్నాయి.
- ఎంపరర్ పెంగ్విన్స్ అందంగా ఉంటాయి. యంగ్ పెంగ్విన్స్ ముందు భాగం తెల్లగా ఉండి.. నల్లటి మెడ ఉంటుంది. ఈ ఎంపరర్ పెంగ్విన్స్ కేవలం
- ఉప్పగా ఉండే సముద్రం నీళ్లను తాగుతాయి. వీటిలో సోడియాన్ని ఫిల్టర్ చేసే నిర్మాణం ఉంటుంది. ఇది ముక్కుద్వారా వెళ్లిపోతుంది.
- ఇవి చేపలను మాత్రమే తింటాయి. తీర ప్రాంతాల్లోకి వచ్చి గూళ్లు ఏర్పరచుకుని ఒకటి లేదా రెండు గుడ్లు మాత్రమే పెడతాయి. ఎంపరర్ పెంగ్విన్స్ ఆహారం లేకుండా 115 రోజులు బతుకుతాయి.

సరైన నీడ ఏది?





6 తేడాలు గుర్తించండి!



చేపలు ఎన్ని?

డైలీ సుడోకు - 375

				5				9
	3		2				5	1
	2			9		7		
5	1			4	8			2
8			9	3			6	5
		4		8			7	
3	7				4		1	
1				7				

సుడోకు - 374 సమాధానం

1	7	2	5	4	6	8	9	3
5	8	3	2	7	9	1	6	4
4	6	9	3	8	1	5	2	7
8	1	4	9	3	5	2	7	6
3	2	6	7	1	4	9	8	5
7	9	5	6	2	8	3	4	1
9	3	1	8	6	7	4	5	2
6	4	8	1	5	2	7	3	9
2	5	7	4	9	3	6	1	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.